సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 | సంచిక: 212

SUNDAY Special | ఆదివారం 22-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'


అదనపు జడ్జీలుగా ప్రమాణం చేస్తున్న కిరణ్మయి, సుమతి, హరినాథ్, విజయ్

ఏపీలో నలుగురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణం

- హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్‌తో ప్రమాణం చేయించిన గవర్నర్ నజీర్
- హాజరైన సీఎం వైఎస్ జగన్, సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్


- వివరాలు 7లో



దద్దరిల్లుతున్న దక్షిణ గాజా

ఇజ్రాయెల్ దాడులతో దక్షిణ గాజా గజగజలాడుతోంది. మరోపక్క గాజాకు సహాయ సామాగ్రి అందించేందుకు వీలుగా ఈజిప్టు తన రఫా క్రాసింగ్‌ను తెరిచింది.

- వివరాలు 6లో



పాక్‌కు నవాజ్ షరీఫ్

పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ నాలుగేళ్ల స్వీయ ప్రవాసం అనంతరం స్వదేశానికి తిరిగొచ్చారు. లాహోర్‌లో జరిగిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు.

- వివరాలు 6లో

ఎడతెగని ఉత్కంఠ

బీజేపీ అభ్యర్థుల జాబితాపై సుదీర్ఘంగా కసరత్తు

- ఇంకా అధికారికంగా ప్రకటించని కాషాయ పెద్దలు
- ఎంపికైన వారికి మాత్రం ఫోన్ చేసి పనిచేసుకోవాలంటూ సూచనలు
- ఇప్పటివరకు 40 మందికి లైన్ క్లియర్ చేసినట్టు పార్టీ వర్గాల వెల్లడి
- కొన్ని నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థులపై పునరాలోచన
- నేడు సాయంత్రం 55 మందితో జాబితా విడుదల చేసే చాన్స్
- ఢిల్లీ వేదికగా రెండు రోజులు జరిగిన భేటీలు పూర్తి... రాష్ట్రానికి తిరిగి వచ్చిన రాష్ట్ర ముఖ్య నేతలు
- జనసేనతో పొత్తు విషయంలో రాని స్పష్టత



సాక్షి, హైదరాబాద్:

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ దగ్గ రపడుతున్నా బీజేపీ అభ్యర్థుల విషయంలో ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికే కొందరు అభ్యర్థులను ఖరారు చేశారని, మరికొందరి విషయంలోనూ ఏకాభిప్రాయం వ్యక్తమైందని పార్టీ నేతలు చెప్తున్నా.. అధికారికంగా జాబితా విడుదల కాకపోవడం చర్చనీయాంశంగా మారుతోంది. అయితే పక్కాగా ఖరారైన సుమారు 35–40 సెగ్మెంట్లకు సంబంధించి అభ్యర్థులకు ఫోన్ చేసి సమాచారం అందించినట్టు తెలిసింది. వారు వెంటనే ప్రచార కార్యక్రమాలు, ఇతర ఏర్పాట్లు చేసుకోవాలని సూచించినట్టు సమాచారం. మిగతా అభ్యర్థులకు సంబంధించి పరిశీలన పూర్తిచేసి.. ఆదివారం సాయంత్రానికి 55 మంది పేర్లతో అధికారికంగా తొలి జాబితా విడుదల చేయనున్నట్టు తెలిసింది. తొలి జాబితా దాదాపు ఖరారైనా జాప్యం కావడం వెనుక.. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల విషయంగా పునరాలోచన చేయడం, కొందరు అటూ, ఇటూ మారే అవకాశం ఉండటమే కారణమని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. కాంగ్రెస్ రెండో జాబితా వెలువడితే.. అవకాశం దక్కనివారు బీజేపీ వైపు చూడవచ్చన్న

మిగతా 2వ పేజీలో ▶


మంత్రులు కేటీఆర్, హరీశ్, జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన చెరుకు సుధాకర్

వారంతా కాంగ్రెస్ నిరంకుశంపై పోరాడిన వాళ్లే..

- ఇప్పుడు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు: మంత్రి కేటీఆర్
- ఉద్యమ ద్రోహి రేవంత్‌రెడ్డి... ఉద్యమంలో రాజీనామా చేయని నాయకుడు కిషన్‌రెడ్డి: హరీశ్‌రావు

2లో

కాంగ్రెస్, బీజేపీ ఆలుమగలు!

కేసీఆర్‌ను విమర్శించడంలో మోదీ, రాహుల్‌ది ఒకే గొంతు: కేటీఆర్

కాంగ్రెస్ పార్టీకి కలలు కనడం కొత్తకాదు..

బీజేపీ దుకాణం ఇక బంద్ అయినట్టే

40 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు అభ్యర్థులే లేరు

బీజేపీ అయితే యుద్ధానికి ముందే రేసు నుంచి తప్పుకొంది

ఆ పార్టీ ఒక్క సీటుకే పరిమితమయ్యే సూచనలు ఉన్నాయి

బీఆర్‌ఎస్ అభ్యర్థుల మీద ఉన్న అసంతృప్తిని అధిగమిస్తాం

ప్రగతిభవన్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి వెల్లడి

8లో

మరో రెండు నెలలు నిరీక్షణే..!

సంక్షేమ శాఖల్లో పెండింగ్‌లో పలు రకాల బిల్లులు

-5లో

కాంగ్రెస్‌లో ఇంకా ఎదురుచూపులే!

అభ్యర్థుల ఎంపికపై ఏకాభిప్రాయానికి రాని స్క్రీనింగ్ కమిటీ

- తుది జాబితాపై మరోసారి భేటీ కావాలని నిర్ణయం
- దసరా తర్వాతే అభ్యర్థుల ప్రకటన ఉంటుందన్న పార్టీ వర్గాలు
- ఢిల్లీలో కేసీ వేణుగోపాల్ నివాసంలో స్క్రీనింగ్ కమిటీ భేటీ
- అభ్యర్థులు, వామపక్షాలతో పొత్తులపై సుదీర్ఘంగా చర్చలు
- ఇంతకుముందే 55 మందితో కాంగ్రెస్ తొలి జాబితా
- ఈసారి మిగతా అన్ని సీట్లకు కలిపి అభ్యర్థులను ప్రకటిస్తామన్న మాణిక్‌రావ్ ఠాక్రే



8లో



'గగన్' విజయం

- మానవసహిత అంతరిక్ష ప్రయోగాల దిశగా అడుగులు వేస్తున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ తొలి విజయం సాధించింది. గగన్‌యాన్ ప్రాజెక్టు సన్నాహకాల్లో భాగంగా చేపట్టిన మానవరహిత క్రూ ఎస్కేప్ సిస్టమ్ (సీఈఎస్) పరీక్ష విజయవంతమైంది. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి శనివారం ఉదయం గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ (టీవీ–డీ1)ను విజయవంతంగా పరీక్షించారు. మానవసహిత ప్రయోగాలు చేపట్టినపుడు అందులోని వ్యోమగాములను క్రూ మాడ్యూల్ ఎలా సురక్షితంగా బయటపడేయగలదన్న అంశాన్ని పరీక్షించేందుకే ఈ పరీక్ష నిర్వహించారు.

- వివరాలు 6లో

క్లుప్తంగా...

మేనిఫెస్టోతో దసరా తర్వాత జనంలోకి

నేడు బీఆర్ఎస్ ఇన్‌చార్జిలతో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ

సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఇటీవల విడుదల చేసిన పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను దసరా తర్వాత ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ అంశంపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మంత్రి హరీశ్‌రావు ఆదివారం తెలంగాణ భవన్‌లో పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిలతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. దసరా తర్వాత పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ భేటీలో పార్టీ ఇన్‌చార్జిలకు దిశా నిర్దేశం చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల ప్రభావాన్ని బీఆర్ఎస్ వార్‌రూమ్ విశ్లేషించి పార్టీ మేనిఫెస్టోకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించినట్లు తెలిసింది.

మీ తోడు దొంగల దుమ్ము దులపడం ఖాయం

మంత్రి కేటీఆర్ పోస్టుకు రేవంత్ కౌంటర్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ శిష్యరికంతో రాష్ట్ర మంత్రి కేటీరామారావు అసత్య ప్రచారాల్లో రాటుదేలారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ సునామీ చూసి ఏం చేయాలో అర్థంకాక కోట్లాదిరూపాయలు పెట్టి అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కర్ణాటకలోని రైతులకు విద్యుత్ సరఫరాపై మంత్రి కేటీఆర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా చేసిన పోస్టుకు శనివారం ఆయన కౌంటర్ పోస్ట్ చేశారు. 'నిన్న మొన్నటి దాకా కర్ణాటకలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మిత్రపార్టీ బీజేపీ 40% కమీషన్లతో రాష్ట్రాన్ని పూర్తిగా దివాళా తీయించింది. అలాంటి పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల సమయంలో గ్యారంటీలను 100 రోజుల్లోపు అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. 'తెలంగాణలో కూడా కాంగ్రెస్ దూసుకెళుతుంటే ఇన్ని రోజులు నింపుకున్న జేబులను ఇప్పుడు దులుపుతున్నరు. మీరెన్ని తప్పుడు ప్రచారాలు చేసినా, ప్రజలు మీ తోడుదొంగల దుమ్ము దులపడం ఖాయం. కాంగ్రెస్ వస్తుంది. తెలంగాణ గెలుస్తుంది' అని రేవంత్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే విజయం సాధిస్తా

గద్దర్ కూతురు వెన్నెల



పంజగుట్ట (హైదరాబాద్): ప్రజలు, కుటుంబ పెద్దల నిర్ణయం ప్రకారం ప్రజాపోరుకు సిద్ధంగా ఉన్నానని, కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ టికెట్ కేటాయిస్తే తప్పక విజయం సాధిస్తానని ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల అన్నారు. ఒకవేళ టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటారా అన్న విలేకరుల ప్రశ్నకు ఆమె స్పందిస్తూ.. తనను పోటీచేయాలని ప్రోత్సహించిన కుటుంబ సభ్యులు, కంటోన్మెంట్ ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటానని జవాబు చెప్పారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తమది ఉద్యమ వారసత్వం అని అన్నారు. భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే ఓట్ల విప్లవం రావాలని గద్దర్ 2014, 2018 ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారని, అప్పుడే తాను కూడా ఓటుహక్కు వినియోగించుకున్నానని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రత్యేక పరిశీలకులుగా అశోక్ చవాన్, బోసురాజు

నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం ఇద్దరు సీనియర్ కాంగ్రెస్ నాయకులను ప్రత్యేక పరిశీలకులుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ మేరకు మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్‌తోపాటు కర్ణాటక మంత్రి ఎన్.ఎస్. బోసురాజును నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు.



..ఈ అభ్యర్థి కోటీశ్వరుడు!

ఎడతెగని ఉత్కంఠ

▶ మొదటి పేజీ తరువాయి

అంచనాలు కూడా ఉన్నాయని అంటున్నాయి.

అభ్యర్థులు, సీట్ల మార్పుతో..

అధికార బీఆర్ఎస్ నెలన్నర ముందే అభ్యర్థులను ప్రకటించడంతోపాటు చాలా మందికి బీ ఫారాలు కూడా అందజేసింది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ తొలి జాబితా విడుదల చేసి, మిగతా అభ్యర్థులపై కసరత్తు చేస్తోంది. అయితే ఇప్పటికే బీజేపీ నుంచి అభ్యర్థులపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. నిజానికి ఈ నెల 15 లేదా 16న తొలి జాబితా ఉంటుందని ముఖ్యనేతలు ప్రకటించినా విడుదల చేయలేదు. శనివారానికి దీనిపై బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ కసరత్తు ఒక కొలిక్కి వచ్చిందని.. 55 మంది అభ్యర్థులతో తొలి జాబితా సిద్ధమైందని పార్టీ నేతలు చెప్పారు. కానీ ఇందులోని దాదాపు 15 వరకు స్థానాల్లో అభ్యర్థుల మార్పు, నేతలు పోటీకి సుముఖత వ్యక్తం చేయని చోట్ల ఇతరులను ఎంపిక చేయాల్సి రావడంతో ప్రకటన ఆగిపోయినట్టు తెలిసింది.

ఫోన్ చేసి సమాచారమిస్తూ..

అభ్యర్థుల ఎంపిక కసరత్తు కోసం ఢిల్లీ వెళ్లిన కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, రాష్ట్ర పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ తదితరులు శనివారం సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. అయితే జాబితా విడుదల కాని నేపథ్యంలో.. కచ్చితంగా ఖరారైన అభ్యర్థులకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి స్వయంగా ఫోన్ చేసి ఎంపిక విషయాన్ని తెలియజేసినట్టు సమాచారం. సదరు అభ్యర్థులు వెంటనే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి, పకడ్బందీ కార్యాచరణతో ప్రజల్లోకి వెళ్లాలని సూచించినట్టు తెలిసింది. పార్టీ తీసుకున్న బీసీ అజెండా, ఇతర అంశాలను ప్రజలకు వివరించాలని.. ఇతర పార్టీల కంటే బీజేపీ ఏ విధంగా భిన్నమైనదో స్పష్టంగా తెలియజేయాలని దిశానిర్దేశం చేసినట్టు సమాచారం.

అభ్యర్థుల తీరు ఎలా ఉంది?

ముగ్గురు ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అరి్వంద్, సోయం బాపూరావు (కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్ మినహా), ఇద్దరు ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావులకు తొలి జాబితాలోనే అవకాశం కల్పించినట్టు తెలిసింది. సీఎం కేసీఆర్ పోటీచేస్తున్న గజ్వేల్‌తోపాటు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూరాబాద్ రెండు చోట్లా ఈటల రాజేందర్‌ను బరిలోకి దింపుతున్నట్టు సమాచారం. ఇక గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై విధించిన సస్పెన్షన్ ఎత్తేసి, ఆయనకు అదే స్థానంలో పోటీ చేసే అవకాశంపై ఢిల్లీలో చర్చ జరిగినట్టు తెలిసింది. అయితే దీనిపై స్పష్టత రాలేదు. మరోవైపు చెన్నూరు నుంచి వివేక్ వెంకటస్వామి, ధర్మపురి నుంచి ఎస్.కుమార్‌ల పేర్లు ఖరారయ్యాయని.. అయితే వివేక్ ధర్మపురి నుంచి పోటీకి మొగ్గుచూపుతుండటంతో కుమార్‌ను చెన్నూరుకు మార్చడంపై ఆలోచన జరుగుతోందని సమాచారం. ఇదే జరిగితే ఈ రెండు సీట్ల అభ్యర్థులు మారనున్నారు. మరోవైపు కాంగ్రెస్ మలివిడత జాబితా ఇంకా ప్రకటించనందున.. ఒకవేళ అక్కడ టికెట్లు దక్కని బలమైన నాయకులు, బీఆర్ఎస్‌లోని అసంతృప్తులు బీజేపీలోకి వచ్చే అవకాశాలను కూడా ఢిల్లీ పెద్దలు పరిశీలిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

జనసేన పొత్తులపై అస్పష్టత

ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న జనసేనతో తెలంగాణలో బీజేపీ పొత్తుపై ప్రచారం జరిగినా ఎలాంటి స్పష్టత రాలేదు. ఇటీవల జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ జరిపిన చర్చల్లో రాష్ట్రంలో బీజేపీకి మద్దతివ్వాలని, పోటీ ఆలోచనను విరమించుకోవాలని కోరిన సంగతి తెలిసిందే. దీనిపై ఢిల్లీ భేటీల్లో చర్చ జరిగినా.. ఇరువైపుల నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడలేదు.

నెలాఖరులోగా మిగతా జాబితాలు

రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ స్థానాలకు సంబంధించి జాతీయ నేతలతో రాష్ట్ర ముఖ్య నేతలు చర్చించారు. అభ్యర్థుల పేర్లపై ప్రాథమిక పరిశీలన పూర్తి చేశారు. ఇందులో ఒక్కరే బలమైన అభ్యర్థులున్న సీట్లు, ఏకాభిప్రాయం కుదిరిన స్థానాలు కలిపి 55 సీట్లలో అభ్యర్థులపై స్పష్టత వచ్చిందని, బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని నేతలు వెల్లడించారు. ఆదివారం సాయంత్రానికల్లా ఈ 55 మందితో జాబితా వెలువడే అవకాశం ఉందని తెలిపారు. నెలాఖరులోగా మిగతా అభ్య ర్థులను ఖరారు చేసి, ప్రకటించనున్నట్టు వెల్ల డించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల కంటే అధికంగా బీసీలు, మహిళలు, యువతకు సీట్లు కేటాయించేలా కసరత్తు జరిగిందని వివరించారు.

బీజేపీ అభ్యర్థుల జాబితా

అభ్యర్థిత్వాలు ఖరారైనట్టుగా నేతలు చెప్తున్న సెగ్మెంట్లు ఇవీ..

నియోజకవర్గం	అభ్యర్థి
1 సిర్పూర్	పాల్వాయి హరీశ్
2 చెన్నూరు	వివేక్ వెంకటస్వామి
3 బెల్లంపల్లి	శ్రీదేవి
4 ఖానాపూర్(ఎస్టీ)	రమేశ్ రాథోడ్
5 ఆదిలాబాద్	పాయల్ శంకర్
6 బోథ్ (ఎస్టీ)	సోయం బాపూరావు
7 నిర్మల్	మహేశ్వర్‌రెడ్డి
8 ముథోల్	రామారావు పటేల్
9 జుక్కల్(ఎస్సీ)	అరుణతార
10 నిజామాబాద్	ధన్‌పాల్
అర్బన్	సూర్యనారాయణ గుప్తా
11 బాల్కొండ	అన్నపూర్ణమ్మ
12 చొప్పదండి	బొడిగె శోభ
13 కోరుట్ల	ధర్మపురి అర్వింద్
14 జగిత్యాల	భోగ శ్రావణి
15 కరీంనగర్	బండి సంజయ్
16 సిరిసిల్ల	రాణి రుద్రమరెడ్డి
17 మానకొండూర్	ఆరెపల్లి మోహన్
18 హుజూరాబాద్	ఈటల రాజేందర్
19 దుబ్బాక	రఘునందన్‌రావు
20 గజ్వేల్	ఈటల రాజేందర్
21 కల్వకుర్తి	టి.ఆచారి
22 కొల్లాపూర్	సుధాకర్‌రావు
23 సూర్యాపేట	సంకినేని వెంకటేశ్వరరావు
24 వరంగల్ తూర్పు	ఎర్రబెల్లి ప్రదీప్‌రావు
25 భూపాలపల్లి	చందుపట్ల కీర్తిరెడ్డి
26 మహేశ్వరం	అందెల శ్రీరాములుయాదవ్
27 పటాన్‌చెరు	నందీశ్వర్‌గౌడ్
28 భువనగిరి	గూడూరు నారాయణరెడ్డి
29 కుత్బుల్లాపూర్	కూన శ్రీశైలంగౌడ్
30 మహబూబాబాద్	
(ఎస్టీ)	హుస్సేన్ నాయక్
31 వరంగల్ పశ్చిమ	రావు పద్మ
32 హుజూర్‌నగర్	శ్రీలతారెడ్డి
33 వేములవాడ	చెన్నమనేని వికాస్‌రావు
34 నారాయణఖేడ్	సంగప్ప
35 ఆందోల్	బాబూమోహన్
36 ఉప్పల్	ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్
37 స్టేషన్‌ఘన్‌పూర్	విజయరామారావు
38 జనగామ	దుష్యంత్‌రెడ్డి
39 ధర్మపురి	ఎస్.కుమార్

(ఈ సీట్లకు సంబంధించి కిషన్‌రెడ్డి స్వయంగా అభ్యర్థులకు ఫోన్ చేసి చెప్పారని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి)

వారంతా కాంగ్రెస్ నిరంకుశంపై పోరాడిన వాళ్లే..

ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు: మంత్రి కేటీఆర్

- చెరుకు సుధాకర్, జిట్టా, ఏపూరి సోమన్న, హర్‌దీప్ లాంటి వాళ్లు బీఆర్ఎస్‌లో చేరడం గొప్ప విషయం
- ప్రతి ఓటరు ఆలోచనతో ఓటువేయాలి... కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలని వినతి
- ఉద్యమ ద్రోహి రేవంత్‌రెడ్డి... ఉద్యమంలో రాజీనామా చేయని నాయకుడు కిషన్‌రెడ్డి: హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ నిరంకుశ విధానాలపై పోరాడిన వాళ్లంతా ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ విధానాలకు ఆకర్షితులై వారంతా పార్టీలో చేరుతున్నారన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమక్షంలో చెరుకు సుధాకర్‌తోపాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా 46 రోజులు పోరాటం చేసి జైలు శిక్ష అనుభవించిన నాయకులు చెరుకు సుధాకర్ బీఆర్ఎస్‌లో చేరడం శుభ పరిణామమన్నారు. జిట్టా బాలకృష్ణ, ఏపూరి సోమన్న, హర్‌దీప్‌రెడ్డి లాంటి వాళ్లు బీఆర్ఎస్‌లో చేరడం గొప్ప విషయమని, ఇది తనకెంతో సంతోషం కలిగించిందని చెప్పారు. 'అదృష్టం ఉంటేనే ఇంట్లో ఆడపిల్లలు పుడతారు. ఆడపిల్ల పెళ్లి చేయాలంటే ఒకటికి పది సార్లు ఆలోచిస్తాం. మనింటి అమ్మాయిని వేరే వాళ్లకు ఇవ్వాలంటే ఎంత ఆలోచిస్తామో, రాష్ట్రాన్ని ఒకరి చేతిలో పెట్టాలంటే కూడా ఎంతో ఆలోచించాలి. ఇంత గొప్పగా సాధించుకున్న రాష్ట్రాన్ని, అభివృద్ధి చేసుకున్న రాష్ట్రాన్ని ఎవరి చేతిలో ఉంచాలో ప్రజలు కూడా ఆలోచించాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిచిందని, ప్రతి ఓటరు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కేసీఆర్‌కు హ్యాట్రిక్ సీఎంగా అవకాశమివ్వాలని విన్నవించారు. 'ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పన్నెండుకు 12 అసెంబ్లీ స్థానాల్లో మళ్లీ గెలవాలి. ఈ చేరికలతో నకిరేకల్‌లో లింగయ్య, ఆలేరులో సునీత గెలుపు ఖాయమయ్యాయి. అందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు. ఈసారి దసరాకు ఊళ్లలో అభివృద్ధిపైనే చర్చ జరగాలి' అని కేటీఆర్ చెప్పారు.

దూకుడుగా పని చేస్తాను: చెరుకు సుధాకర్

'తెలంగాణ ఉద్యమాన్ని గరిష్ట స్థాయిలో నడిపాను. జైలు జీవితాన్ని కూడా గడిపాను. నా ఆలోచన విధానానికి పదును పెట్టింది తెలంగాణ భవన్. పార్లమెంటరీ రాజకీయాలను అవగాహన చేయించిన వ్యక్తి కేసీఆర్. తెలంగాణ ప్రజల గుండెచప్పుడుగా బీఆర్ఎస్ కొనసాగాలి. తెలంగాణ ప్రజలకు అనేక పాఠాలు, వ్యతిరేకులకు గుణపాఠాలు చెప్పిన వ్యక్తి కేసీఆర్. భవిష్యత్తు రాజకీయ ప్రస్థానంలో తెలంగాణ ప్రజల ఆయువు పట్టుగా పార్టీ నిలవాలి. ప్రజలకు మరింత చేరువై అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలి. తెలంగాణ ప్రజల ఆశయాలు, ఆకాంక్షల సాధన కోసం గతంలో మాదిరిగానే దూకుడుగా పని చేస్తాను' అని చెరుకు సుధాకర్ చెప్పారు.

రాహుల్, రేవంత్ డీఎన్ఏలు మ్యాచ్ కావట్లేదు

మంత్రి హరీశ్‌రావు

చెరుకు సుధాకర్ కరుడుగట్టిన ఉద్యమవాది అని, తెలంగాణ ఉద్యమంలో మొదటగా జైలుకెళ్లిన వ్యక్తి ఆయనే అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. ఉద్యమ ద్రోహి రేవంత్ రెడ్డి ఒకవైపు, తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయని కిషన్‌రెడ్డి మరోవైపు ఉన్నారని పేర్కొన్నారు. కానీ కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపి రాష్ట్రాన్ని సాధించారని చెప్పారు. బీజేపీతో పోరాటం తమ డీఎన్ఏలో ఉందని రాహుల్ గాంధీ అన్నారని, మరి రేవంత్ రెడ్డి డీఎన్ఏలో ఏముందో చెప్పాలన్నారు. రాహుల్, రేవంత్ రెడ్డి డీఎన్ఏలు సరిపోలడం లేదని, ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌కు 35–40 స్థానాల్లో పోటీచేసేందుకు అభ్యర్థులు కరువయ్యారని, సోనియమ్మ ను బలి దేవత అన్న రేవంత్ ఇప్పుడు నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. రాహుల్ కుటుంబ పాలన గురించి మాట్లాడటం సిగ్గుచేటని, కాంగ్రెస్‌కు లెహర్ లేదని జహర్ మాత్రమే ఉందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఎకరాకు 13 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొంటున్నారని, కానీ రాష్ట్రంలో ప్రతి గింజనూ సీఎం కేసీఆర్ కొనుగోలు చేశారని చెప్పారు. పనితనం తప్ప, పగతనం లేని నాయకుడు కేసీఆర్ అని, కేసీఆర్‌కు ఎప్పుడూ పని మీదే ధ్యాస ఉంటుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో కరువు లేదు, కర్ఫ్యూ లేదని, కాంగ్రెస్ అంటే మాటలు, మంటలు, ముఠాలు అని అభివర్ణించారు.

కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మొద్దు

బతుకమ్మపై జీవన్‌రెడ్డివి దిగజారుడు మాటలు: ఎమ్మెల్సీ కవిత

కోరుట్ల/మెట్‌పల్లి(కోరుట్ల): నిజాం చక్కెర ఫ్యాక్టరీల విషయంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాటలను రైతులు నమ్మవద్దని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. స్వాతంత్ర్యం రాక ముందే నిజాం చక్కెర ఫ్యాక్టరీలను నిజాం ప్రభువులు ఏర్పాటు చేస్తే వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం నెలకొల్పిందని జీవన్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం వీటిని బీజేపీకి చెందిన మాజీ ఎంపీకి విక్రయించినప్పుడు ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు చోద్యం చూశా రా అని మండిపడ్డారు. శనివారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. బతుకమ్మ మీద గౌరమ్మ బదులు ఇంకేదో పెట్టు కొని పండుగ చేసుకుంటామని జీవన్‌రెడ్డి వ్యాఖ్యా నించడం ఆయన వయసుకి, హోదాకి తగదని కవిత చెప్పారు. ఎన్నికల్లో గెలవడానికి దిగజారి పోయి బతుకమ్మను అవమానించిన ఆయనను జగిత్యాల ప్రజలు తిరస్కరించడం ఖాయమ న్నారు.



కోరుట్లలో బతుకమ్మను పేర్చుతున్న కవిత

నేడు మహారాష్ట్రకు కవిత

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని సోలాపూర్‌లో ఆదివారం జరిగే బతుకమ్మ సంబరాలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరుకానున్నారు. అలాగే దత్తవాడ నుంచి సాయంత్రం ప్రారంభమయ్యే బతుకమ్మ శోభాయాత్రలో ఆమె పాల్గొంటారు.

ఆ మూడు పార్టీలు ఒక గూటి పక్షులే

కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపునకు కేసీఆర్ ప్రయత్నించారు: కె.లక్ష్మణ్

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ ఈ మూడు పార్టీలు ఒక గూటి పక్షులేనని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. కేంద్రంలోని మోదీ సర్కార్‌ను ఎదుర్కొనేందుకు విపక్ష కూటమిలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అన్ని పార్టీలను ఏకం చేస్తోందన్నారు. బీఆర్ఎస్‌తో కూడా రాజ్యసభ ఒప్పందం కుదుర్చుకోవడం, ఈ ఎన్నికల తర్వాత ఆ విపక్ష కూటమిలోకి బీఆర్ఎస్‌ను తెచ్చేందుకు ఢిల్లీ వేదికగా మంతనాలు జరిగాయన్నారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపునకు కేసీఆర్ ప్రయత్నాలు చేశారని ఆరోపణలు చేశారు. రెండు పర్యాయాలు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని..ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చడానికి కాంగ్రెస్ పార్టీని బీఆర్ఎస్ పార్టీ జాకీలు పెట్టి మరీ లేపుతూ అవసరమైన మేరకు ఆర్థిక సాయం కూడా చేస్తోందని విమర్శించారు. కె.లక్ష్మణ్ శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు.

ఆరు గ్యారంటీలు.. నూరు సీట్లు!

- తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కొత్త నినాదం
- టీపీసీసీ ఎన్నారై సెల్ ఆధ్వర్యంలో లండన్‌లో ప్రచార కార్యక్రమం
- అక్కడి పార్టీ నేతలు, కార్యకర్తలకు శ్రీధర్‌బాబు మార్గనిర్దేశం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎన్నికల కోసం లండన్ వేదికగా కాంగ్రెస్ పార్టీ కొత్త నినాదాన్ని అందుకుంది. ''ఆరు గ్యారంటీలు–నూరు సీట్లు' పేరుతో ప్రచారానికి శ్రీకారం చుట్టింది. టీపీసీసీ ఎన్నారై సెల్ (యూకే) ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని లండన్‌లో చేపట్టారు. దీనిని గాంధీభవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఆరు గ్యారంటీ పథకాలు, నూరు గ్యారంటీ సీట్లు లక్ష్యంగా తెలంగాణ ప్రజల్లోకి వెళ్లాలని.. విదేశాల్లో ఉన్న వారి బంధువులు, సన్నిహితులు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేసేలా తోడ్పడాలని ఆయన మార్గనిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. రాష్ట్రంలోని యువత, మహిళలు, రైతులకు ప్రాధాన్యం ఉండేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. విద్యార్థుల కోసం రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాంటి గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. గల్ఫ్ సంక్షేమ బోర్డు, ఎన్నారై సెల్ ఏర్పాటు తదితర అంశాలను మేనిఫెస్టోలో పొందుపరిచే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ గంప వేణుగోపాల్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నారై సెల్ నేతలు రంగుల సుధా కర్ గౌడ్, బిక్కుమండ్ల రాజేశ్, మంగళారపు శ్రీధర్, గంగసాని ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎమ్మెల్యేల్లో 106 మంది కోటీశ్వరులే!

రూ.161 కోట్లతో మర్రి జనార్దన్‌రెడ్డి టాప్

- అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ నివేదికలో వెల్లడి
- కేటీఆర్ ఆస్తులు రూ.41 కోట్లు, అప్పులు రూ.27 కోట్లు
- కేసీఆర్ ఆస్తులు రూ.23 కోట్లు, అప్పులు రూ.8 కోట్లు
- ఈటల రాజేందర్ ఆస్తులు రూ.56 కోట్లు, అప్పులు రూ.8 కోట్లు
- మొత్తంగా 72 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని ఎమ్మెల్యేల్లో 90శాతం అంటే 106 మంది కోటీశ్వరులేనని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. అధికార బీఆర్ఎస్‌కు చెందిన 101 మంది ఎమ్మెల్యేలలో 93 మంది (92%), ఏడుగురు ఎంఐఎం ఎమ్మెల్యేలలో ఐదుగురు (71%), ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో నలుగురు (67%), బీజేపీకి ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేలు (100%), ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేల ఆస్తులు రూ.కోటి కంటే ఎక్కువేనని తెలిపింది. మొత్తంగా సిట్టింగ్ ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.13.57 కోట్లు అని వెల్లడించింది. పార్టీల వారీగా చూస్తే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సగటు ఆస్తి రూ.14.11 కోట్లు, ఎంఐఎం ఎమ్మెల్యేల సగటు ఆస్తి రూ.10.84 కోట్లు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల సగటు ఆస్తి రూ.4.22 కోట్లు, బీజేపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తి రూ.32.61 కోట్లు, ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేల సగటు ఆస్తి రూ.4.66 కోట్లుగా తేల్చింది. రాష్ట్రంలో మొత్తం 119 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. అందులో కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్ ఖాళీగా ఉంది. ఈ క్రమంలో మిగతా 118 నియోజకవర్గాల సిట్టింగ్ ఎమ్మెల్యేల ఆస్తులు, నేర చరిత్ర తదితర అంశాలపై 2018 ఎన్నికల సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా ఏడీఆర్ సంస్థ శనివారం తమ నివేదికను విడుదల చేసింది. బహిష్కరణకు గురైన, పార్టీని వీడి ఇతర పార్టీలో చేరిక ఖరారుకాని ఇద్దరు ఎమ్మెల్యేలను స్వతంత్రులుగా చూపింది.

పార్టీలు మారినవారు 16 మంది

ఏడీఆర్ నివేదిక ప్రకారం.. తెలంగాణలో 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత మొత్తం 16 మంది ఎమ్మెల్యేలు పార్టీలు మారారు. అందులో 12 మంది కాంగ్రెస్ నుంచి గెలిచినవారుకాగా, ఇద్దరు టీడీపీ నుంచి, ఒకరు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి గెలిచారు. వీరంతా బీఆర్ఎస్‌లో చేరారు. ఇక బీఆర్ఎస్ నుంచి గెలిచిన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరారు.

గ్రాడ్యుయేట్లు 58 శాతమే..

- రాష్ట్రంలోని మొత్తం ఎమ్మెల్యేలలో.. 43 మంది (36%) విద్యార్హత 5వ తరగతి నుంచి 12వ తరగతి మధ్య ఉంది. మరో 69 మంది (58%) గ్రాడ్యుయేషన్/ఆపై విద్యార్హత కలిగి ఉన్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు డిప్లొమా చేశారు. ఒక ఎమ్మెల్యే తాను సాధారణ అక్షరాస్యుడినని ప్రకటించుకున్నారు.
- ఎమ్మెల్యేల వయసును పరిశీలిస్తే.. 43 మంది (36%) వయసు 30 నుంచి 50ఏళ్ల మధ్య ఉండగా, 75 మంది (64%) వయసు 51 నుంచి 80 ఏళ్ల మధ్య ఉంది.
- మొత్తం 118 మంది ఎమ్మెల్యేల్లో ఆరుగురు (5%) మాత్రమే మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారు.

సగానికిపైగా ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు

రాష్ట్రంలో అన్నిపార్టీలు కలిపి ప్రస్తుతమున్న 118 మంది ఎమ్మెల్యేలకుగాను.. 72 మంది (61%)పై క్రిమినల్ కేసులు ఉన్నాయని.. ఇందులో బీఆర్ఎస్ వారే 59 మంది అని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. బీఆర్ఎస్‌కు ఉన్న 101 మంది ఎమ్మెల్యేల్లో ఇది 58శాతమని తెలిపింది. ఎంఐఎంకు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేల్లో ఆరుగురిపై (86%), ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో నలుగురిపై (67%), బీజేపీకి చెందిన ఇద్దరు (100%) ఎమ్మెల్యేలపై, ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేల్లో ఒకరిపై (50%) క్రిమినల్ కేసులు ఉన్నట్టు వారు గత ఎన్నికల అఫిడవిట్లలో తెలిపారని వివరించింది. మొత్తంగా 46 మంది (39%) సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని పేర్కొంది. అందులో బీఆర్ఎస్ వారు 38 మంది అని తెలిపింది. ఏడుగురు ఎమ్మెల్యేలపై హత్యాయత్నం, నలుగురిపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయని.. ఒక ఎమ్మెల్యేపై అత్యాచారానికి సంబంధించిన కేసు ఉందని వివరించింది.

రూ.161 కోట్లతో మర్రి జనార్దన్‌రెడ్డి టాప్



అత్యధిక ఆస్తులున్న సిట్టింగ్ ఎమ్మెల్యేల జాబితాలో.. రూ.161 కోట్లతో నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి టాప్‌లో ఉన్నారు. తర్వాతి స్థానాల్లో రూ.91 కోట్లతో కందాల ఉపేందర్‌రెడ్డి (పాలేరు–బీఆర్ఎస్), రూ.91 కోట్లతో పైళ్ల శేఖర్‌రెడ్డి (భువనగిరి–బీఆర్ఎస్) నిలిచారు.

- మంత్రి కేటీఆర్‌కు రూ.41 కోట్లు ఆస్తులు, రూ.27 కోట్లు అప్పులు ఉండగా.. సీఎం కేసీఆర్‌కు రూ.23 కోట్లు ఆస్తులు, రూ.8కోట్లు అప్పులు ఉన్నట్లు గత అఫిడవిట్లలో చూపారు. బీఆర్ఎస్‌ను వీడి బీజేపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయంలో చూపిన అఫిడవిట్ ప్రకారం ఆయన ఆస్తులు రూ.56 కోట్లు, అప్పులు రూ.8 కోట్లు కావడం గమనార్హం.
- యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రీ రూ.19 లక్షల విలువైన ఆస్తులతో రాష్ట్రంలో తక్కువ ఆస్తులున్న ఎమ్మెల్యేగా ఉన్నారు.
- రూ.కోటికిపైగా అప్పులున్న ఎమ్మెల్యేల జాబితాలో రూ.94 కోట్లతో కందాల ఉపేందర్‌రెడ్డి టాప్‌లో ఉన్నారు. తర్వాతి స్థానాల్లో రూ.63 కోట్లతో మర్రి జనార్దన్‌రెడ్డి, రూ.40 కోట్లతో దానం నాగేందర్ ఉన్నారు.

నెలాఖరుకు కాంగ్రెస్ మేనిఫెస్టో!

- మెగా డీఎస్సీ, భారీసంఖ్యలో ఉద్యోగాల కల్పనపై ప్రత్యేకదృష్టి
- ఆరు గ్యారంటీ హామీలపై స్పష్టత.. గల్ఫ్‌బోర్డు ఏర్పాటుపై హామీ!



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాల్సిన అంశాలకు సంబంధించిన కసరత్తు తుది దశకు చేరుకుంది. పూర్తిస్థాయి రూపకల్పనకు మరో వారానికిపైగానే పడుతుందని, ఈ నెలాఖరు లేదంటే, నోటిఫికేషన్ వెలువడిన వెంటనే మేనిఫెస్టో విడుదలవుతుందని తెలుస్తోంది. నెలరోజులుగా వరుసగా టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ భేటీ అవుతూ ఎన్నికల ప్రణాళికలో చేర్చాల్సిన అంశాలను ఓ కొలిక్కి తెస్తోంది. ఈ క్రమంలో శనివారం కూడా గాంధీభవన్‌లో కమిటీ చైర్మన్, మాజీమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన మేనిఫెస్టో కమిటీ సమావేశమైంది. సమావేశంలో కమిటీ సభ్యులు సంభాని చంద్రశేఖర్, చందా లింగయ్య, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రధానంగా యువతకు ఉద్యోగాల కల్పనపైనే నేతలు చర్చించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహించి పెద్దసంఖ్యలో టీచర్ పోస్టులు భర్తీ చేసే అంశాన్ని మేనిఫెస్టోలో పొందుపర్చాలని నిర్ణయించారు. భారీసంఖ్యలో ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తామని, తెలంగాణ యువతకు అండగా నిలుస్తామని హామీ ఇవ్వాలని కూడా నిర్ణయించారు. గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు, వివిధ స్థాయిల్లోని ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లు, ఆర్టీసీ ఉద్యోగుల కోసం పథకాలు రూపొందించాలని కూడా చర్చించారు. ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించిన పలు అంశాలపై ఈ మేనిఫెస్టోలో స్పష్టతనిచ్చే కోణంలో కూడా కమిటీ కసరత్తు జరిపింది.

దుర్గాదేవిగా శ్రీభద్రకాళి



హనుమకొండ కల్చరల్: వరంగల్ శ్రీభద్రకాళి ఆలయంలో శనివారం భద్రకాళి అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

కాళరాత్రి దేవిగా జోగుళాంబ దేవి



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారు శనివారం కాళరాత్రి దేవిగా దర్శనమిచ్చారు.

కాళరాత్రిగా సరస్వతి



భైంసా: నిర్మల్ జిల్లా బాసర సరస్వతి అమ్మవారు కాళరాత్రి రూపంలో దర్శనమిచ్చారు. కూరగాయలతో తయారు చేసిన కిచిడీని నైవేద్యంగా పెట్టారు.

ఐశ్వర్యలక్ష్మిగా శ్రీ లక్ష్మీతాయారు



భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు శనివారం ఐశ్వర్యలక్ష్మిగా దర్శనమిచ్చారు.

28న యాదాద్రి ఆలయం మూసివేత




యాదగిరిగుట్ట: చంద్ర గ్రహణం సందర్భంగా ఈ నెల 28న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మూసివేయనున్నారు. గ్రహణం కారణంగా ఒక్క రోజు ముందు అంటే 27వ తేదీన రాత్రి 7 గంటలకు శరత్ పౌర్ణమి వేడుకలను బ్రహ్మోత్సవ కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. 28వ తేదీన సాయంత్రం 4 గంటలకే ఆలయాన్ని మూసివేస్తారు. ప్రధానాలయంతో పాటు అనుబంధ ఆలయాలైన శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను మూసివేయనున్నారు. గ్రహణం పూర్తయిన తరువాత 29వ రోజున ఆలయాన్ని వేకువజామునే తెరిచి సంప్రోక్షణ నిర్వహిస్తారు.



> పేదలను బాధించు దరిద్రుడు... ఆహార వస్తువులను ఉండనియ్యక కొట్టుకొనిపోవు వానతో సమానుడు.
>
> – క్రైస్తవ ధర్మం

ఓర్వలేని కళ్లన్నీ నీ మీదే తల్లీ!



ఎదగాలి నాన్నా... నువ్వింకా ఇంకా పైపైకి... ఈ లోకం గుర్తించేంత పైకి ఎదగాలి తల్లీ! దిగువ కులాల వృత్తి చట్రాల్లో బందీలై వెనుకబాటుతనాన్ని వారసత్వంగా మోసుకొస్తున్న మీ అమ్మానాన్నల కలలు ఫలించేలా... మీకు అండగా నిలబడిన మీ జగన్‌ మామ ఆశీస్సులు సాకారమయ్యేలా ఎదగాలి తల్లీ! అసూయా దృక్కులు నిన్ను వెన్నాడుతాయ్‌. భయపడకు! ఓర్వలేని తనం శాపనార్థాలు పెడుతుంది. చలించకు! పెత్తందార్లు పగబడతారు. ప్రతిఘటించు! నీ వెనుక మీ మేనమామ ఉన్నాడు.

తరతరాలుగా మీ తాత ముత్తాతల దగ్గర్నుంచీ మీ అమ్మానాన్నల దాకా మిమ్మల్ని తొక్కిపెట్టి ఉంచిన పెత్తందార్లు ఇప్పుడు నీ చదువు మీద యుద్ధం ప్రకటించారు. భయం లేదులే! అభయం దొరికింది కదా... ఇక దృష్టి పెట్టి చదువు! చదువే నీ తిరుమంత్రం. చదువే నీ రణతంత్రం. అంబేడ్కర్, పూలే, సావిత్రీబాయి, నారాయణ గురులు ఉపదేశించిన విముక్తి మార్గం చదువు.

నువ్వు అమెరికాకు వెళ్లి ఐక్యరాజ్యసమితి వేదికపై ఇంగ్లీషులో ధారాళంగా మాట్లాడుతుంటే మన పెత్తందార్లు కళ్లల్లో నిప్పులు పోసుకున్నారు తెలుసా? నువ్వు అంతర్జాతీయ యూనివర్సిటీల్లో మాట్లాడుతుంటే ఈర్ష్యతో వాళ్ల కడుపులు కుతకుతలాడాయి తెలుసా? కానీలే, 'రానీ, రానీ, వస్తే రానీ! కోపాల్, తాపాల్, శాపాల్ రానీ' అన్నాడు కదా శ్రీశ్రీ. నిప్పులు పోసుకున్న వాళ్ల కళ్లు పేలిపోనీ, రగిలిన కడుపులు పగిలిపోనీ, ఇప్పుడా పెత్తందార్లు మీ అమ్మానాన్నలపైనే కాదు, అండగా నిలబడిన మీ జగన్ మామ మీద, చదువుకుంటున్న మీ మీద కూడా యుద్ధం ప్రకటించారు.

ఈ యుద్ధంలో గెలవాలంటే మీ కర్తవ్యం ఏమిటో తెలుసా? బాగా చదవాలి. పైపైకి ఎదగాలి. అడవులు కొండలు ఎడారులా మనకడ్డంకి అంటూ ముందుకు సాగాలి. సరిహద్దుల్నీ సముద్రాల్నీ దాటుకుంటూ వెళ్లాలి. ఆకాశాన్ని చీల్చుకుంటూ పైకెగరాలి. ఆరుద్ర పాట తెలుసుకదా! ''గ్రహ రాశుల నధిగమించి, ఘనతారల పథము నుంచి, గగనాంతర రోదసిలో, గంధర్వ గోళ గతులు దాటి'' అలా సాగిపోవాలి.

ఇంతకూ పెత్తందార్లంటే ఎవరో తెలుసా చిన్నా? వాళ్లూ అందరిలాగే ఉంటారు. కోరలూ కొమ్ములూ కనిపించవు. కాకపోతే డబ్బు ఉన్నదనే అహంకారంతో కనిపించని కొమ్ములు మొలుస్తాయి. ఈ సృష్టిలో ప్రతీదీ తమకే కావాలనుకుంటుంది పెత్తందార్ల వర్గం. భూమి, గాలి, నీరు, ఆకాశం మీద కూడా వాళ్లకే హక్కు ఉన్నట్టు భావిస్తారు. పొలాలు, ఫ్యాక్టరీలు, డబ్బు, అధికారం, హోదా అన్నీ వాళ్లకే ఉండాలి. మంచి చదువులు చదివితే తెలివి తేటలొస్తాయి. కనుక మంచి చదువులు తమ పిల్లలకే ఉండాలి. పేద పిల్లలు కూడా మంచి చదువులు చదివితే తమ పిల్లలతో సమానంగా ఉంటారు. మంచి ఉద్యోగాలు సంపాదిస్తారు. తమకు నౌకర్లు, చాకర్లు, డ్రైవర్లు, వంట వాళ్లు దొరకరు. సినిమా వాళ్లకు 'పవర్ స్టార్'.. 'పంచర్‌స్టార్' అని వెర్రికేకలు వేసే ఫ్యాన్స్ దొరకరు. ఈ కారణాల వల్ల ఇంగ్లీష్ మీడియంలో చదివితే చెడిపోతారని వాళ్లు ప్రచారంలో పెడుతున్నారు.

మాతృభాషలో విద్యాబోధన ఆవశ్యకతను గురించి సుద్దులు చెప్పడానికి కొందరు పెద్దల్ని రంగంలోకి దించుతారు. ఇప్పటికే దించారు కూడా! మాతృభాషలోనే పాఠాలు నేర్చుకుంటే జ్ఞానం పెరుగుతుందనీ, సులభంగా అర్థమవుతాయనీ చెబుతారు. అంతేగాకుండా అంతా ఆంగ్ల మీడియంలో చదివితే తెలుగు సంస్కృతి దెబ్బతింటుందని వాపోతారు. అలాంటి వాళ్లు మీకు తగిలినప్పుడు రెండు ప్రశ్నలు వేయండి. ఒకటి – ఇప్పుడు ఇంగ్లీషులో చదవకపోతే పై చదువులకు వెళ్లినకొద్దీ ఇంగ్లీషులోనే చదవాల్సిన పాఠాలకు ఎలా అలవాటు పడతామని అడగాలి. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఎలా నెగ్గుతామని అడగాలి. మీరు పై చదువులు పెద్దగా చదవొద్దని కదా వారి ఉద్దేశం. అందుకని మీరా ప్రశ్న అడగ్గానే గతుక్కుమంటారు. ఇక రెండో అంశం – 'అయ్యా! గత యాభయ్యేళ్లుగా మా అమ్మానాన్నలు, తాతముత్తాతలు తెలుగులోనే చదివి, తెలుగు భాషకు సేవలు చేసి అలసిపోయారు. ఇప్పుడు కొంతకాలం మేము ఇంగ్లీషులో చదువుకుంటాము. మీ పెత్తందార్లంతా ఇంతకాలం ఇంగ్లీషు చదువులు చదివారు కదా! ఇప్పుడు పిల్లల్ని మనవల్నీ తెలుగు మీడియంలో చదివించండి. వారు తెలుగు భాషను రక్షిస్తారు. మేం ఇంగ్లీష్ చదువుకొని అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతామ'ని చెప్పండి. ఏమంటారో చూద్దాం.

రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యాన్నిస్తూ 'నాడు – నేడు' కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగతి మీకు తెలుసు. ఈ కార్యక్రమం ఫలితంగా శిథిలావస్థకు చేరిన సర్కారు బళ్లు మళ్లీ చిగురించాయి. ప్రైవేట్ స్కూళ్లను మించి సకల హంగులు సంతరించుకున్నాయి. మీకిస్తున్న బూట్లు, బ్యాగ్, బెల్ట్, యూనిఫామ్ అన్నీ బెస్ట్‌గా ఉండాలని స్వయంగా సీఎం హోదాలో ఉన్న మీ మేనమామ స్వయంగా సెలెక్ట్ చేసి పంపిస్తున్నారు. 'గోరుముద్ద' మెనూ కూడా ఆయనే తయారు చేశారు. కూలినాలి చేసుకునే పేద తల్లులు వారి బిడ్డల్ని స్కూళ్లకు పంపించేలా ప్రోత్సహించడం కోసం 'అమ్మ ఒడి' పేరుతో నగదు అందజేస్తున్న సంగతి కూడా మీకు తెలిసిందే. ఈ మొత్తం కార్యక్రమాల్లో భాగంగా మూడేళ్ల కిందనే ఒకటి నుంచి ఆరో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం బోధనను ప్రారంభించారు. ఏటా ఒక్కో తరగతిని పెంచుకుంటూ వచ్చారు. ఇప్పుడు తొమ్మిదో తరగతి వరకు అంతా ఇంగ్లీష్ మీడియమే.

ఇంగ్లీష్ మీడియాన్ని ప్రారంభించిన ఆదిలోనే పెత్తందారీ ప్రతిఘటన మొదలైంది. తెలుగు భాషోద్యమం పేరుతో ఓ నకిలీ ఉద్యమాన్ని ప్రారంభించడానికి యెల్లో మీడియాతో కలిసి చంద్రబాబు ప్లాన్ చేశారు. కానీ, క్షేత్రస్థాయి నుంచి వ్యతిరేకత వస్తుందన్న సమాచారంతో కాస్త వెనక్కు తగ్గారు. కొద్దిరోజుల విరామం తర్వాత మళ్లీ చంద్రబాబు మొదలుపెట్టారు. ఈసారి ప్రత్యక్షంగా పేద తల్లితండ్రుల మెదళ్లలోకి దూరాలని ప్రయత్నించారు. శ్రీకాకుళం నుంచి రోడ్డు మార్గం ద్వారా వస్తున్న చంద్రబాబుకు విశాఖ సమీపంలో ఓ పదిమంది కూలీలు రోడ్డు పక్కన కనిపించారు. వెంటనే వాహనాన్ని ఆపేసి వాళ్ల మధ్యన కూర్చున్నారు. ఆ మాట ఈ మాట మాట్లాడిన తర్వాత ''ఆయనేదో (జగన్) ఇంగ్లీష్ మీడియం అంటున్నాడు. ఏమొస్తది ఇంగ్లీష్ మీడియంతో! కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోద్ది. మన పిల్లలు మొద్దబ్బాయిలుగా తయారవుతారు...'' అంటూ ఇంకేదో చెప్పబోయారు. అక్కడున్న జనమంతా అసహనంతో 'జై జగన్' అని నినాదాలు చేయడంతో చల్లగా జారుకున్నారు.

పెత్తందార్ల కూటమికి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయకుడు. ఆయన సమన్వయంలోనే యెల్లో మీడియా పనిచేస్తున్నది. ఈ మీడియా సమూహంలో అతి ముఖ్యుడు రామోజీరావు. ఆయన చంద్రబాబుకు గురుపాదుల వంటివారు. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రెండు వేల ఎకరాల విశాల సామ్రాజ్యాన్ని అక్రమ పద్ధతుల్లో విస్తరించారు. ఈ విస్తరణలో భాగంగా ఆయన చట్టాలను కూడా యథేచ్ఛగా ఉల్లంఘించారు. ఆయనకు 'ఈనాడు' అనే పత్రిక, 'ఈటీవీ' పేరుతో చానళ్లున్నాయి. తాను తెలుగు కోసమే పుట్టినట్టు, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ కోసమే గాలి పీల్చుకుంటున్నట్టు ఆయన డప్పు వేయించుకుంటారు. ఆయన స్థాపించిన ఫిలిం సిటీ చేరువలో కొండల మీద రమాదేవి పబ్లిక్ స్కూల్ పేరుతో ఒక పాఠశాలను స్థాపించారు. అది మాత్రం పక్కా ఇంగ్లీష్ మీడియం, సెంట్రల్ సిలబస్.

తెలుగు మీడియం పాఠశాల పెడితే భారీగా ఫీజులు కట్టి ఎవరు చదువుకుంటారు? కనక తనకు కలెక్షన్ కోసం సంపన్నులు చదువుకునే ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉండాలి. పేద బిడ్డలు మాత్రం కనీస వసతులు లేని ప్రభుత్వ బడుల్లో తెలుగు మీడియం చదవాలి. ఇదీ వారి నీతిసారం. ఉమ్మడి రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఈ గురుపాదులవారు రాజ గురువుగా చక్రం తిప్పిన రోజుల్లోనే ప్రభుత్వరంగంలోని విద్యా వ్యవస్థ శిథిలమైపోయి వీధికో ప్రైవేట్ స్కూల్, ఊరికో కార్పొరేట్ కాలేజీ బ్రాంచీలు విస్తరించాయి. చదువు అంగడి సరుకుగా రూపాంతరం చెందింది. పేదలు డ్రాపౌట్లుగా మిగిలిపోయారు. ఫలితంగా రెండు తరాల పేదలు నాణ్యమైన చదువుకు నోచుకోక జీవన ప్రమాణాలను కోల్పోవలసి వచ్చింది. ఈ మానవ కల్పిత మహా సంక్షోభం మీద పరిశోధన జరగవలసిన అవసరం ఉన్నది.

ఇంగ్లీష్ మీడియం విద్యకు వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడేందుకు చంద్రబాబు, ఆయన ముఠా వెనుకడుగు వేసినా పరోక్ష ప్రయత్నాలను మాత్రం ఆపలేదు. తెలుగు భాషా సంస్కృతుల ముసుగులో వివిధ వేదికల ద్వారా ఇంగ్లీష్ మీడియంపై విషం చల్లుతూనే వస్తున్నారు. రాజ్యాంగబద్ధ పదవుల్లో పనిచేసిన పెద్దమనుషుల సేవలను కూడా ఇందుకోసం విరివిగా వినియోగించుకున్నారు. అయినా ఫలితం కలుగలేదు. ప్రజల సంపూర్ణ మద్దతుతో ఇంగ్లీషు మీడియంతో పాటు అనేక విద్యాసంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిన తర్వాత, ఐఎఫ్‌పీ స్క్రీన్లను అందుబాటులోకి తెచ్చిన తర్వాత ఆ యా విద్యార్థుల నాణ్యతా ప్రమాణాలు పెరిగినట్టుగా అసెస్‌మెంట్ పరీక్షల్లో ఉపాధ్యాయులు గుర్తించారు. ఈ స్ఫూర్తితో దశలవారీగా ఐబీ సిలబస్‌ను కూడా అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిశ్చయించింది.

ఇక లాభం లేదనుకున్న పెత్తందారీ ముఠా ఎన్నికలకు ఇంకో ఆరు నెలల సమయం ఉండగా ఆఖరు కృష్ణుడిని రంగంలోకి దించింది. పవన్ కల్యాణ్: ది లాస్ట్ కృష్ణా తన సహచరుడు నాదెండ్ల మనోహర్‌తో కలిసి శుక్రవారం నాడు ఇంగ్లీష్ మీడియంపై, విద్యాసంస్కరణలపై విరుచుకుపడ్డారు. తాము అధికారంలోకి రాగానే ఈ విద్యావిధానంపై కేసులు పెట్టి దీంతో సంబంధం ఉన్న వారందరినీ జైలుకు పంపుతారట! తమ పిల్లల్ని ఏ స్కూల్లో, ఏ మీడియంలో, ఏ సిలబస్‌తో చదివించారో కూడా పవన్, మనోహర్‌లు ఈ సమావేశంలో చెబితే బాగుండేది. కానీ చెప్పలేదు. పవన్ హెచ్ఎమ్‌వి రికార్డులాంటోడు. అందులో రికార్డయిందే చెప్పగలడు. కానీ, పేద విద్యార్థుల ప్రగతికి ఉద్దేశించిన ఇంగ్లీష్ మీడియంపై యుద్ధం ప్రకటించి తాను ఏ వర్గం తరఫున పనిచేస్తున్నాడో చాటి చెప్పుకున్నాడు. లంకలో పుట్టిన ప్రతివాడూ రాక్షసుడే అన్నట్టు ఇంగ్లీష్ మీడియాన్ని వ్యతిరేకించే ప్రతివాడూ పెత్తందార్ల తాబేదారే! నీవారెవరో పరవారెవరో గుర్తించడానికి ఇది మాత్రమే లిట్మస్ టెస్ట్ తల్లీ!

ఇంగ్లిష్ మీడియం విద్యకు వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడేందుకు చంద్రబాబు, ఆయన ముఠా వెనుకడుగు వేసినా పరోక్ష ప్రయత్నాలను మాత్రం ఆపలేదు. తెలుగు భాషా సంస్కృతుల ముసుగులో వివిధ వేదికల ద్వారా ఇంగ్లిష్ మీడియంపై విషం చల్లుతూనే వస్తున్నారు. రాజ్యాంగబద్ధ పదవుల్లో పనిచేసిన పెద్దమనుషుల సేవలను కూడా ఇందుకోసం విరివిగా వినియోగించుకున్నారు. అయినా ఫలితం కలుగలేదు. ప్రజల సంపూర్ణ మద్దతుతో ఇంగ్లీషు మీడియంతో పాటు అనక విద్యాసంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిన తర్వాత, ఐఎఫ్‌పీ స్క్రీన్లను అందుబాటులోకి తెచ్చిన తర్వాత ఆ యా విద్యార్థుల నాణ్యతా ప్రమాణాలు పెరిగినట్టుగా అసెస్‌మెంట్ పరీక్షల్లో ఉపాధ్యాయులు గుర్తించారు. ఈ స్ఫూర్తితో దశలవారీగా ఐబీ సిలబస్‌ను కూడా అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిశ్చయించింది.

ఇక లాభం లేదనుకున్న పెత్తందారీ ముఠా ఎన్నికలకు ఇంకో ఆరు నెలల సమయం ఉండగా ఆఖరు కృష్ణుడు పవన్‌కల్యాణ్‌ని రంగంలోకి దించింది.

గురితప్పిన రాహుల్జీ బాణాలు

జనతంత్రం



వర్ధెల్లి మురళి

కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ మూడు రోజులపాటు ఉత్తర తెలంగాణలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సభలకు జనం బాగానే వచ్చారు. స్పందన కూడా బాగుందని కాంగ్రెస్ వర్గాలు సంబరపడ్డాయి. అంతా బాగానే ఉంది గానీ, ఒక ముఖ్యమైన లోపం మాత్రం కనబడింది. మత్స్య యంత్రాన్ని కొట్టడానికి ఒక నియమం ఉన్నది. ఆ యంత్రం పైన గిరగిరా తిరుగుతుంటే కింద నీటిలో దాని నీడను చూసి పైనున్న చేపను కొట్టాలి. రాహుల్ పద్ధతి ఇందుకు విరుద్ధంగా కనిపించింది. ఆయన పైనున్న చేప వంక చూస్తూ నీటిలోని దాని నీడపైకి బాణాన్ని ఎక్కుపెట్టారు. ఆ బాణాన్ని వదిలితే ఏమవుతుంది? నీళ్లు కదులుతాయి గనుక కాసేపు నీడ కనిపించదు. చేప మాత్రం నిక్షేపంగా తిరుగుతూనే ఉంటుంది.



రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారంటీల పేరుతో ఇచ్చిన హామీలను పరిశీలిస్తే అసలు ఇవ్వాల్సిన ముఖ్యమైన గ్యారంటీని విస్మరించినట్టు బోధపడుతుంది. అట్లాగే రాష్ట్ర ప్రభుత్వం పైనా, బీఆర్ఎస్ పైనా ఆయన చేస్తున్న విమర్శలు చూస్తుంటే ఆయన పొలిటికల్ నరేటివ్ లేదా రాజకీయ భాషణ అప్‌డేట్ అయినట్టు కనిపించడం లేదు. రాజకీయాల్లో గెలవాలంటే ఈ భాషణే ముఖ్యం. ఆ భాషణ కొత్త భావాలతో కూర్చి ఉండాలి. జనాన్ని ఉత్తేజపరిచేదిగా ఉండాలి. వారికి ఊరటనిచ్చేదిగా ఉండాలి.

ఈ మూడు రోజుల రాహుల్ ప్రసంగాల్లోని భాషణ కంటే, పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ నేతల భాషణే మెరుగ్గా కనిపిస్తున్నది. వాళ్లలో రాజకీయ స్పష్టత ఉన్నది. వారి భాషణ కూడా అందుకు అనుగుణంగా ఉన్నది. ఆర్థికాభివృద్ధిలోనూ, సంక్షేమ రంగంలోనూ ఈ తొమ్మిదిన్నరేళ్ల పాలన ఒక విజయగాథగా గణాంకాల ఆధారంతో వారు చెప్పుకొస్తున్నారు. ఈ జైత్రయాత్రను కొనసాగిద్దామని సూటిగా సుత్తి లేకుండా, వారు సందేశాన్నివ్వగలిగారు. పరిపాలనా రథం జైత్రయాత్ర సాగించాలంటే రాజకీయ సుస్థిరత అత్యంత అవసరమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

కాంగ్రెస్ పార్టీకి మైనస్ మార్కులు పడేది ఇక్కడే. వారు చెబుతున్న ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి కూడా రాజకీయ సుస్థిరత అనే ప్రధానమైన గ్యారంటీ అత్యంత అవసరం. ఈ గ్యారంటీని ఇచ్చే స్థితిలో కాంగ్రెస్ పార్టీ లేదని దాని ట్రాక్ రిపోర్టే కుండబద్దలు కొట్టి చెబుతున్నది. 2004 ఎన్నికల నాటికే రాష్ట్ర కాంగ్రెస్‌లో తిరుగులేని నేతగా ఎదిగిన వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో మాత్రమే కాంగ్రెస్ రాజకీయ సుస్థిరతను సాధించగలిగింది. ఫలితంగానే అభివృద్ధి – సంక్షేమాల్లో రాష్ట్రాన్ని పరుగులు పెట్టించి 2009 ఎన్నికల్లో కూడా గెలవగలిగింది. ఈ ఒక్క ఛాప్టర్‌ను మూసేస్తే కాంగ్రెస్ కథలో మిగిలిన భాగాలన్నీ కుమ్ములాటల కథలే!

కాంగ్రెస్ కీచులాటల ఫలితంగానే తెలుగుదేశం పార్టీ పుట్టుకొచ్చి అధికారం చేపట్టిన ఉదంతం తెలిసిన విషయమే. 1978–83 మధ్యకాలంలో నలుగురు ముఖ్యమంత్రులు మారడం, పాలన అటకెక్కడం మూలంగా జనం మార్పు కోరుకున్నారు. 1989లో మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే కథ పునరావృతమైంది. ముగ్గురు ముఖ్యమంత్రుల్ని మార్చాల్సి వచ్చింది. ఇలా మార్చకపోయినట్లయితే సైబర్ టవర్స్ (హైటెక్ సిటీ)కి శంకుస్థాపన చేసిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే దాన్ని పూర్తిచేసి ఉండేది. చంద్రబాబు డప్పు వాయించుకోవడానికి అవకాశమే ఉండేది కాదు.

2009 ఎన్నికల తర్వాత రెండోసారి అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ దురదృష్టవశాత్తు నాలుగు నెలల్లోనే చనిపోయారు. కాంగ్రెస్ అసలు కథ మళ్లీ మొదలైంది. ఏడాదిపాటు సీనియర్ నేత రోశయ్యను ముఖ్యమంత్రిగా చేశారు. ఆ తర్వాత ఆయన్ను మార్చి కిరణ్‌కుమార్ రెడ్డిని తీసుకొచ్చారు. ఆ తర్వాత ఇంకో మార్పు జరగకపోవడానికి కారణం పార్టీలో వచ్చిన ఐక్యత కాదు. అప్పటికే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉద్ధృతం కావడం, రాష్ట్ర విభజన అనివార్యమని తేలడంతో ఆ పదవికి ఎవరూ పోటీపడలేదు.

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో రెండుసార్లు ప్రధాన ప్రతిపక్ష హోదాను ప్రజలు కాంగ్రెస్‌కు కట్టబెట్టారు. ఆ బాధ్యత నిర్వహణలో కూడా ఆ పార్టీ ఘోరంగా విఫలమైంది. మొదటిసారి 21 మందిని గెలిపిస్తే చివరకు 10 మంది మిగిలారు. రెండోసారి 19 మందిని గెలిపిస్తే ఐదుగురు మిగిలారు. అధికారం అప్పజెప్పినప్పుడు కొట్లాడుకుని పరిపాలనను పడకేయించారు. ప్రతిపక్షంలో కూర్చోబెడితే సంత బేరాలకు లొంగిపోయారు. మరి ఏ ధైర్యంతో ఇప్పుడు ప్రజలు ఓటేయాలి?

రాజకీయ సుస్థిరతను అందిస్తామనే గ్యారంటీ కదా కాంగ్రెస్ పార్టీ నుంచి జనం ఆశించేది? ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలో కనీసం డజన్ మంది ముఖ్యమంత్రి పదవి ఆశావహులున్నారు. ఓ ఆరేడు మందయితే గట్టి పట్టుదలతో పోటీలో ఉన్నట్టు సమాచారం. ఇటువంటి పరిస్థితిలో రాజకీయ సుస్థిరతను ఎలా ఆశించాలి! తెలంగాణ రాష్ట్ర పురోగతికి రాజకీయ సుస్థిరత ప్రాణాధారం. హైదరాబాద్ నగరం రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్. గడిచిన పదేళ్లలోనే ఐదు లక్షలమందికి ఐటీ రంగంలో ఉద్యోగాలిచ్చిన నగరం. ఫార్మా తదితర రంగాల్లో ఇంకో ఆరేడు లక్షలమందికి కొత్తగా ఉపాధినిచ్చింది. రాష్ట్రం నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరలివస్తున్న లక్షలాది మంది పేద కార్మికులకు కడుపు నింపుతున్న నగరం. రాజకీయ అస్థిర పరిస్థితులు ఏర్పడితే దాని ప్రభావం ఉపాధి రంగం మీద పడుతుంది.

చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా ఆయన సామాజిక వర్గానికి చెందిన కొందరు యువతీ యువకులు ఐటీ కారిడార్‌లో ప్రదర్శన చేసినప్పుడు రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ ఉలికిపడింది ఇందుకే. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉద్ధృతంగా జరుగుతున్న రోజుల్లో కూడా ఉపాధి రంగాన్ని ఆందోళనలకు దూరంగా ఉంచారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలంటే ఇవ్వాల్సిన అసలైన గ్యారంటీ రాజకీయ సుస్థిరత. దాని ట్రాక్ రికార్డ్ దృష్ట్యా నామ్‌కే వాస్తే హామీ ఇస్తే జనం నమ్మరు. జనాన్ని నమ్మించడానికి ఏం చేయాలో ఆ పార్టీ నిర్ణయించుకోవాలి. అప్పుడు మాత్రమే ఆరు గ్యారంటీల గురించి జనం ఆలోచిస్తారు. ఈ ఆరు గ్యారంటీల్లో కొన్ని పాత పథకాలే. వేలంపాటలో పెంచినట్టు కేటాయింపులను కొంచెం పెంచి కొత్త పథకాలుగా స్టాంప్ వేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి 'విద్యావికాసం' అనే కొత్త పేరు పెట్టారు. గృహిణులకు 2,500 రూపాయల ఆర్థిక సాయానికి సంబంధించిన విధానాలను అధికారంలోకి వస్తే అప్పుడు తయారు చేస్తారట! కర్ణాటక నుంచి దిగుమతి చేసుకున్న ఈ పథకం అక్కడే ఇంకా బాలారిష్టాలను దాటలేదు.

రాజకీయ సుస్థిరత అనే గ్యారంటీ ఇవ్వలేని పార్టీ ఇచ్చే ఆరు గ్యారంటీలకైనా... పన్నెండు గ్యారంటీలకైనా విలువ లేదు. గురితప్పిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహంలో ఇది మొదటి భాగం. ఇక రెండో భాగం దాని రాజకీయ భాషణ. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నిత్యం చేస్తున్న విమర్శలనే ఈ మూడు రోజుల్లో రాహుల్ గాంధీ వల్లెవేశారు. 'కాళేశ్వరం'లో లక్ష కోట్ల అవినీతి జరిగింది. కుటుంబ పెత్తనం నడుస్తున్నది. 'ధరణి' పేరుతో వేలాది ఎకరాలు కబ్జా పెడుతున్నారు. 'దొరల తెలంగాణ'గా మార్చారు. సామాజిక న్యాయం కరువైంది. బీఆర్ఎస్ బీ–టీమ్‌గా బీజేపీ పనిచేస్తున్నది. వగైరా వగైరా. వీటిలో కొన్ని ఆరోపణలు 2018 ఎన్నికల్లోనే కాంగ్రెస్ కూటమి ప్రజల ముందుంచింది. అయినా ఆ ఎన్నికల్లో కేసీఆర్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేయగలిగింది. ఇప్పుడు మరోసారి చైనా యుద్ధ కాలం నాటి త్రీ నాట్ త్రీ రైఫిళ్లను, డబ్బా ట్యాంకులను తీసుకొచ్చి కాల్పులు జరుపుతున్నారు.

ఈ ప్రచారంలో రాహుల్ గాంధీకి బాగా నచ్చిన మాట... దొరల తెలంగాణకూ, ప్రజల తెలంగాణకూ మధ్య పోరాటం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దగ్గర్నుంచి రాహుల్ కాపీ కొట్టినట్టున్నారు. రాష్ట్రంలో పేదలకూ, పెత్తందార్లకూ మధ్యన యుద్ధం జరుగుతున్నదని జగన్‌మోహన్‌రెడ్డి పదే పదే ప్రజలకు గుర్తు చేస్తున్నారు. అందుకు అక్కడ సహేతుకమైన కారణం ఉన్నది. ప్రాతిపదిక ఉన్నది. పేదల సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయాన్ని అక్కడి పెత్తందారీ శక్తులు తెలుగుదేశం రాజకీయ కూటమి రూపంలో అడ్డుకుంటున్నారు. యెల్లో మీడియా రూపంలో అడ్డుకుంటున్నారు. రకరకాల వేదికల పేర్లతో అడ్డుకుంటున్నారు. కేవలం రాజకీయ విమర్శలతోనే ఆటంకాలు సృష్టించలేదు. కోర్టు మెట్లెక్కి మరీ అడ్డుకుంటున్నారు. పేద పిల్లలకు ఇంగ్లీష్ మీడియం విద్యను అందించినా, సర్కారు బళ్ల ప్రమాణాలను పెంచినా, ప్రజల ఇంటి ముంగిటకు పరిపాలనను చేర్చినా, ధర్మాసుపత్రుల నాణ్యతను పెంచినా, ఊరూరా 'రైతు భరోసా కేంద్రాల'ను తెరిచినా, 30 లక్షలమంది మహిళలకు ఇళ్లు కట్టించే కార్యక్రమం చేపట్టినా సహించలేకపోయారు. వీటన్నింటి మీద కేసులు వేశారు. ఈ నేపథ్యంలో జనాన్ని జాగృతం చేయడం కోసం జరుగుతున్న కుట్రలను విడమర్చి చెప్పడం కోసం జగన్‌మోహన్‌రెడ్డి ఆ నినాదాన్ని అందుకున్నారు.

ఇక్కడ బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల్లో దొరలకు మేలు చేస్తున్నవేమిటి? పేద ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటాలేమిటి? ఆ పార్టీ దగ్గర ఉన్న పీడిత ప్రజల సాధికారతా కార్యక్రమం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల్లో దొరలు మాత్రమే లబ్ధి పొంది అంగరంగ వైభవంగా పెళ్లిళ్లు చేసుకుంటున్నారా? పేద కుటుంబాలకు ఈ పథకం దక్కడం లేదా? పద్దెనిమిది వందలకు పైగా ఏర్పాటైన గురుకుల పాఠశాలలు – కళాశాలల్లో ఏడున్నర లక్షలమంది దొరల బిడ్డలే నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నారా? ఇటువంటి గణాంకాలేవో ఉండాలి కదా విమర్శ చేయడానికి! అందుకు తగిన ప్రాతిపదికను చూపెట్టాలి గదా. అప్పుడే ఆ నినాదాన్ని జనం అందిపుచ్చుకుంటారు. అంతే తప్ప పదాలు బలంగా ఉన్నాయి, వాక్యం బరువుగా ఉందని ముచ్చటపడి ఔత్సాహిక కవిలా ఉత్సాహపడితే రాజకీయాల్లో అభాసుపాలవుతారు సుమా!

ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక భూస్వామ్య కులంలో పుట్టాడు కనుక ఆయనది దొరల పాలన అనడం ఆమోదయోగ్యం కాదు. నిజమే, ఉత్తర తెలంగాణలోని భూస్వామ్య కులం వారు ఎక్కువమంది బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. అట్లానే దక్షిణ తెలంగాణ భూస్వామ్య కుటుంబాల వారు ఎక్కువమంది కాంగ్రెస్‌లో ఉన్నారు. నాయకుల పుట్టుక కారణంగా వారు దొరల పక్షమా, పేదల పక్షమా అని నిర్ధారించగలమా? తెలుగునాట దొరతనానికి వ్యతిరేకంగా, భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించినవారెవరు? పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, చండ్ర రాజేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చెన్నమనేని రాజేశ్వరరావు... వీరంతా భూస్వాముల బిడ్డలే కదా?

గత ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ పుంజుకున్న మాట వాస్తవం. ఇందుకు కర్ణాటక ఫలితాలు కొంత దోహదపడ్డాయి. వ్యూహాలు సవరించుకొని బీజేపీ బలం పుంజుకోకపోతే అది కాంగ్రెస్‌కు మరింత మేలు చేస్తుంది. కొన్ని సీట్లు పెరగొచ్చు, కానీ పరిణామాలు కొంత భిన్నంగా మారుతున్న సూచనలు కన్పిస్తున్నాయి. అభ్యర్థుల ఎంపికలో బీసీలకు అన్యాయం జరిగిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మరోపక్క బీజేపీ బీసీలకు పెద్దపీట వేస్తున్న సూచనలు కనబడుతున్నాయి. ఇప్పుడు కనిపించిన వాపును బలుపుగా భ్రమిస్తే కాంగ్రెస్‌కు మరోసారి భంగపాటు తప్పదు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ బలంగా పోటీలో నిలబడాలంటే రెండు షరతులు – 1. రాజకీయ సుస్థిరతను ఇవ్వగలమన్న భరోసాను కల్పించాలి. 2. కాలానుగుణమైన, తెలంగాణ అభివృద్ధికి ఆలంబన కాగల రాజకీయ ఎజెండాను జనం ముందుంచాలి. కర్ణాటక మేనిఫెస్టో తారక మంత్రం కాదు!

vardhelli1959@gmail.com

రాజకీయ సుస్థిరత అనే గ్యారంటీ ఇవ్వలేని పార్టీ ఇచ్చే ఆరు గ్యారంటీలకైనా... పన్నెండు గ్యారంటీలకైనా విలువ లేదు. గురితప్పిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహంలో ఇది మొదటి భాగం. ఇక రెండో భాగం దాని రాజకీయ భాషణ. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నిత్యం చేస్తున్న విమర్శలనే ఈ మూడు రోజుల్లో రాహుల్ గాంధీ వల్లెవేశారు. 'కాళేశ్వరం'లో లక్ష కోట్ల అవినీతి జరిగింది. కుటుంబ పెత్తనం నడుస్తున్నది. 'ధరణి' పేరుతో వేలాది ఎకరాలు కబ్జా పెడుతున్నారు. 'దొరల తెలంగాణ'గా మార్చారు. సామాజిక న్యాయం కరువైంది. బీఆర్ఎస్ బీ–టీమ్‌గా బీజేపీ పనిచేస్తున్నది. వగైరా వగైరా. వీటిలో కొన్ని ఆరోపణలు 2018 ఎన్నికల్లోనే కాంగ్రెస్ కూటమి ప్రజల ముందుంచింది. అయినా ఆ ఎన్నికల్లో కేసీఆర్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేయగలిగింది. ఇప్పుడు మరోసారి చైనా యుద్ధ కాలం నాటి త్రీ నాట్ త్రీ రైఫిళ్లను, డబ్బా ట్యాంకులను తీసుకొచ్చి కాల్పులు జరుపుతున్నారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.అష్టమి సా.5.21 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ సా.5.13 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** రా.8.57 నుండి 10.28 వరకు, **దుర్ముహూర్తం:** సా.3.58 నుండి 4.44 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.10 నుండి 12.41 వరకు, దుర్గాష్టమి; **రాహుకాలం:** సా.4.30 నుంచి 6.00 వరకు, **యమగండం:** ప.12.00 నుంచి 1.30 వరకు, **సూర్యోదయం:** 5.58, **సూర్యాస్తమయం:** 5.33.

తక్కువ ధరకే విజయ డెయిరీ ఉత్పత్తులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో జరిగే మిల్లెట్ మేళా, ఉత్సవ్–23 ఈవెంట్, పండుగల సందర్భంగా తగ్గింపు ధరలకు విజయ డెయిరీ పలు ఉత్పత్తులను అందించనుందని తెలంగాణ విజయ డెయిరీ జనరల్ మేనేజర్ తెలిపారు. నెయ్యి, లస్సీ, మజ్జిగ, దూద్‌పేడా, మిల్క్‌కేక్, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, తాజా పన్నీర్, వెన్న మొదలగు ఉత్పత్తులను సరఫరా చేస్తామని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బల్క్ ఆర్డర్ల కోసం gmmkt. tsddcf@gmail.com కు మెయిల్ చేయాలని కోరారు.

ఎంపీహెచ్‌ఏ పరీక్ష వాయిదా

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖలో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మహిళ) ఉద్యోగాల భర్తీలో భాగంగా నవంబర్ 10వ తేదీన నిర్వహించాల్సిన పరీక్షను తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వాయిదా వేసింది. తదుపరి పరీక్ష నిర్వహించే తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు వివరించింది. ఈ మేరకు బోర్డు సభ్య కార్యదర్శి శనివా రం ఒక ప్రకటన విడుదల చేశారు.

మరో రెండు నెలలు నిరీక్షణే...!

- సంక్షేమ శాఖల్లో పెండింగ్‌లో పలు రకాల బిల్లులు
- కొన్ని నెలలుగా ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, డైట్ చార్జీలు నిలుపుదల
- క్షేత్రస్థాయిలో సంక్షేమాధికారులు ఆమోదించినా ఖజానా విభాగంలో బ్రేక్
- ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో క్లియరెన్స్ కష్టమే
- కొత్త ప్రభుత్వం కొలువుదీరేవరకు ఇంతే సంగతంటూ అధికారుల సూచన

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ శాఖల్లో బిల్లుల క్లియరెన్స్‌కు నిరీక్షణ తప్పేలా లేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో నిధుల విడుదలకు కొంతకాలం బ్రేక్ పడనున్నట్లు అధికారవర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. సాధారణంగా ప్రభుత్వం నుంచి చెల్లింపులకు రెండు, మూడు త్రైమాసికాలు అత్యంత కీలకం. తొలి త్రైమాసికంగా బడ్జెట్ సర్దుబాట్లు, ఇతరాత్రా కారణాలతో చెల్లింపుల ప్రక్రియ మందకొడిగా సాగుతుంది. ఆ తర్వాత నుంచి నిధుల లభ్యత, ప్రాధాన్యతలకు అనుగుణంగా చెల్లింపుల్లో వేగం పుంజుకుంటుంది. కానీ ఈసారి సంక్షేమ శాఖలకు రెండో త్రైమాసికంలో నిధులు విడుదల కాలేదు. పలు రకాల చెల్లింపులు నిలిచిపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. ప్రధానంగా పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు భారీగా పేరుకుపోయాయి. సంక్షేమ శాఖలు ఆమోదించి ఖజానా విభాగానికి పంపించినప్పటికీ అక్కడ క్లియరెన్స్ రాని బిల్లులు దాదాపు రూ.1,175 కోట్లు ఉన్నాయి. ఇవిగాకుండా సంక్షేమ వసతిగృహాలు, గురుకుల విద్యా సంస్థలకు సంబంధించిన డైట్ చార్జీలు మరో రూ.675 కోట్లు ఉన్నాయి. మొత్తంగా రూ.1,850 కోట్లు ఖజానా విభాగంలో పెండింగ్‌లో ఉండగా... ఇవి రెండో త్రైమాసికంలో వస్తాయని అధికారులు భావించారు. చివరి నిమిషం వరకు సంక్షేమాధికారులు వేచిచూసినప్పటికీ నిరాశే మిగిలింది. ఈ క్రమంలో మూడో త్రైమాసికంలోనైనా ఈ నిధులకు మోక్షం కలుగుతుందని భావించినప్పటికీ ఎన్నికల నేపథ్యంలో వాటి విడుదలలో జాప్యం జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

చివరి క్వార్టర్‌పైనే ఆశలు...

విద్యార్థుల ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల కింద దాదాపు 12.65లక్షల మంది లబ్ధిదారులుంటారు. వీరితో పాటు మరో 10 లక్షల మంది గురుకుల విద్యా సంస్థలు, సంక్షేమ వసతిగృహాల్లో ఉంటున్నారు. ఈ విద్యార్థులకు ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు ఎంతో కీలకం. కోర్సును ముందుకు సాగించాలన్నా... వసతిగృహంలో ఉండాలన్నా ప్రభుత్వం నుంచి వచ్చే నిధులే దిక్కు. కొంతకాలంగా ఈ రెండు పథకాలకు, డైట్ చార్జీల విడుదలలోనూ జాప్యం చేస్తూ వచ్చింది. క్షేత్రస్థాయి నుంచి గురుకులాలు, వసతిగృహాలు, సంక్షేమ అధికారుల ద్వారా ఆమోదం పొందిన బిల్లులన్నీ ఖజానా విభాగంలో నిలిచిపోయాయి. గతేడాది నవంబర్ నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఉపకారవేతన నిధుల విడుదల నిలిచిపోయింది. ఇవన్నీ 2021–22 విద్యా సంవత్సరానికి సంబంధించినవే. ఇవిగాకుండా 2022–23 విద్యా సంవత్సరం దరఖాస్తు పరిశీలన, 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ఇంకా కొనసాగుతోంది. ఇప్పటివరకు బిల్లులు రూపొందించి ఆమోదించిన బిల్లులకు గత రెండు త్రైమాసికాల్లో రిక్తహస్తం చూపిన ప్రభుత్వం మూడో త్రైమాసికంలోనైనా నిధులు విడుదల చేస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత... చివరి త్రైమాసికంలోనే నిధులు విడుదలయ్యే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు.



హైదరాబాద్-వరంగల్ హైవేపై గూడురు టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

రహదారులు.. రద్దీ

- దసరా, బతుకమ్మల ప్రభావం
- స్వస్థలాలకు వెళ్తున్న ప్రజలు

బీబీనగర్/చౌటుప్పల్: విజయదశమి, బతుకమ్మల పండుగల ప్రభావం జాతీయ రహదారులపై పడింది. హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారులపై శనివారం వాహనాలు భారీగా బారులు తీరాయి. పండుగలకు హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు స్వస్థలాలకు వెళ్తున్నారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు రద్దీ కొనసాగింది. జాతీయ రహదారిపై మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల కూడళ్ల వద్ద రోడ్డు దాటేందుకు ప్రజలు, వాహనదారులు అవస్థలు పడ్డారు.

త్యాగాల నుంచే గొప్ప విజయాలు

- పోలీసు అమరవీరుల దినోత్సవంలో డీజీపీ అంజనీకుమార్



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న డీజీపీ అంజనీకుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): పౌరులకు అందించే పోలీసు సేవల్లో తెలంగాణ ముందంజలో ఉందని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ తెలిపారు. శనివారం గోషామహల్ స్టేడియంలో పోలీసు అమరవీరుల దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్యాగాల నుంచే గొప్ప విజయాలు లభిస్తాయని అన్నారు. దేశంలోనే ఉత్తమ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని వెల్లడించారు. షీటీమ్స్, భరోసా కేంద్రాలు, పాస్‌పోర్టు క్లియరెన్స్, సీసీటీవీ ప్రాజెక్టుల నిర్వహణ వంటి విషయాలు ఇందుకు ఉదాహరణగా నిలుస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత, శిశుసంక్షేమం వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అలాగే దేశంలోనే అత్యధిక సీసీ కెమెరాలు ఉన్న రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. రాష్ట్రంలో క్రైమ్‌రేటు తగ్గుతూ వస్తోందని, తెలంగాణను నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. పౌర రక్షణ విధులలో అమరులైన 189 మంది పోలీసులకు నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 'అమరులు వారు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, ఏడీజీ శ్రీనివాస్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య, అడిషనల్ డీజీలు సౌమ్యమిశ్రా, శివధర్‌రెడ్డి, సంజయ్‌కుమార్ జైన్, మహేశ్ భగవత్‌లతో పాటు పలువురు సీనియర్ పోలీసు ఉన్నతాధికారులు, విశ్రాంత ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


గోదావరి-కావేరి అనుసంధానంపై మళ్లీ కదలిక

- ఇచ్చంపల్లి వద్దే బ్యారేజీ నిర్మాణానికి నిర్ణయం
- నవంబర్ 3న హైదరాబాద్‌లో స్టాండింగ్ కమిటీ, టాస్క్‌ఫోర్స్ భేటీలు
- అదే రోజు రాష్ట్రాలకు ఎంఓయూ ముసాయిదాల పంపిణీ
- సంబంధిత రాష్ట్రాల సమ్మతి కోసం కేంద్రం ప్రయత్నాలు

సాక్షి, హైదరాబాద్: గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు విషయంలో ముందడుగు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. నవంబర్ 3న హైదరాబాద్‌లో ఇందుకు సంబంధించిన రెండు కీలక సమావేశాలను నిర్వహించతలపెట్టింది. ఉదయం 11.30 గంటలకు నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఎన్‌డబ్ల్యూడీఏ) డైరెక్టర్ జనరల్ భోపాల్ సింగ్ ఆధ్వర్యంలో గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై వేసిన స్టాండింగ్ కమిటీ ఐదో సమావేశం నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు నదుల అనుసంధానంపై ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం కూడా చైర్మన్ వెదిరే శ్రీరామ్ అధ్యక్షతన జరగనుంది. ఉదయం జరిగే సమావేశంలో మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంఓయూ)ముసాయిదాను ఆయా రాష్ట్రాలకు అందజేయనున్నారు. చివరిసారిగా జరిగిన 4వ స్టాండింగ్ కమిటీ సమావేశంలో గోదావరిపై ఎక్కడ బ్యారేజీ నిర్మించి నీళ్లను తరలించాలనే అంశంపై ఎన్‌డబ్ల్యూడీఏ ఆధ్వర్యంలో అధ్యయనం జరపాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇచ్చంపల్లి వద్దే గోదావరిపై బ్యారేజీ నిర్మించాలని తాజాగా ఎన్‌డబ్ల్యూడీఏ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. దీనిపై నవంబర్ 3న జరగనున్న స్టాండింగ్ కమిటీ, టాస్క్‌ఫోర్స్ సమావేశాల్లో విస్తృతంగా చర్చించి అన్ని రాష్ట్రాల సమ్మతి పొందాలని ఎన్‌డబ్ల్యూడీఏ భావిస్తోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వినియోగించుకోని 141 టీఎంసీల గోదావరి జలాలను గోదావరి-కావేరి అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా తరలించాలని గతంలో నిర్ణయం తీసుకోగా, తాజాగా ఆ పరిమాణాన్ని 151 టీఎంసీలకు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో కర్ణాటక కోటాను 19 టీఎంసీలకు పెంచనున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వాడుకోని 151 టీఎంసీల నీళ్లను తరలించడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం నిరభ్యంతర పత్రం జారీ చేస్తేనే ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకు వెళ్లాలని ఇప్పటికే తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు కోరాయి. ఈ నేపథ్యంలో నవంబర్ 3న జరగనున్న సమావేశాల్లో ఎలాంటి నిర్ణయాలు ఉంటాయోనన్నది ఆసక్తికరంగా మారింది.

మహారాష్ట్ర సరిహద్దులో పులి

- పెన్‌గంగ పరీవాహక ప్రాంతీయుల భయాందోళన



తాంసి: తెలంగాణ– మహారాష్ట్ర సరిహద్దు లోని పెన్‌గంగ పరీవాహక ప్రాంతం వెంట పులి సంచారం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ పులుల అభయారణ్యం నుంచి వచ్చిన పులి పెన్‌గంగ ఒడ్డున మహారాష్ట్ర వైపున్న గ్రామాల్లో సంచరిస్తూ శుక్రవారం రాత్రి కనిపించింది. నదికి అవతల మహారాష్ట్ర వైపు చిన్నార్లి గ్రామానికి సమీపంలోని పంటచేల వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తూ కనిపించగా.. వాహనాల డ్రైవర్లు వీడియో తీశారు. ప్రస్తుతం ఇది వైరల్‌గా మారింది. నదికి అటువైపు సంచరిస్తున్న పులి నది దాటి తెలంగాణ వైపు వచ్చే అవకాశం లేకపోలేదు. గత ఫిబ్రవరిలో ఒకపులి, మూడు పిల్లలతో భీంపూర్ మండలంలోని పలు గ్రామాల శివారులో సంచరించడం తెలిసిందే. ఈ క్రమంలో సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

పాస్‌పోర్టు కార్యాలయానికి 24న సెలవు

రాంగోపాల్‌పేట్: ఈ నెల 24వ తేదీ మంగళవారం దసరా పండుగ సందర్భంగా పాస్‌పోర్టు కార్యాలయానికి సెలవు ఉంటుందని, 23వ తేదీన యథావిధిగా కార్యాలయం పనిచేస్తుందని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పాస్‌పోర్టు కార్యాలయంలోని విచారణ కౌంటర్లు, అన్ని సేవా కేంద్రాలు, పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాలు 23వ తేదీ సోమవారం పనిచేస్తాయని, దరఖాస్తుదారులు సేవలను ఆ రోజు వినియోగించుకోవచ్చని తెలిపారు. అలాగే ఈ నెల 28వ తేదీ శనివారం ప్రత్యేక డ్రైవ్ ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. పాస్‌పోర్టు సేవా పోర్టల్‌లో అపాయింట్‌మెంట్లు విడుదల చేస్తామని, కొత్తగా దరఖాస్తు చేసుకునేవాళ్లు, రీ షెడ్యూల్ చేసుకునే వాళ్లు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

హెచ్‌-1బీ ప్రోగ్రాంలో మార్పులు

బైడెన్ సర్కారు ప్రతిపాదనలు

వాషింగ్టన్: ఐటీ తదితర కీలక రంగాలకు చెందిన విదేశీ వృత్తి నిపుణులకు అమెరికాలో పని చేసేందుకు వీలు కల్పించే కీలకమైన హెచ్‌-1బీ వీసా ప్రోగ్రాంలో మార్పుచేర్పులను బైడెన్ సర్కారు ప్రతిపాదించింది. అర్హత ప్రమాణాలు తదితరాలను మరింత క్రమబద్ధం చేయడం, తద్వారా వీసా ప్రక్రియ సామర్థ్యాన్ని పెంచడం , ఎఫ్‌-1 స్టూడెంట్లకు, పారిశ్రామికవేత్తలకు, నాన్ ఇమ్మిగ్రెంట్ వర్కర్లకు మెరుగైన పరిస్థితులు కల్పించేందుకు ఈ మార్పులు దోహద పడతాయని చెబుతోంది. సదరు నిబంధనలను సోమవారం విడుదల చేయనున్నారు...

- ప్రస్తుత ప్రక్రియలో ఒక దరఖాస్తుదారు తరఫున ఎన్ని ఎక్కువ రిజిస్ట్రేషన్లు నమోదయితే లాటరీలో ఎంపికయ్యే అవకాశాలు అంత పెరుగుతాయి.
- ప్రతిపాదిత విధానంలో ఒకరి తరఫున ఎన్ని రిజిస్ట్రేషన్లు నమోదైనా ఎంపిక ప్రక్రియలో ఒక ఎంట్రీగానే పరిగణిస్తారు.
- తద్వారా కొందరికే ఎక్కువ అడ్వాంటేజీకి బదులు అర్హులందరికీ సమానావకాశం దక్కుతుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోం ల్యాండ్ సెక్యూరిటీ పేర్కొంది.
- ఈ ప్రతిపాదనలపై అందరూ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు వెల్లడించవచ్చని డీహెచ్ఎస్ పేర్కొంది.
- అమెరికా ఏటా విడుదల చేసే 60 వేల హెచ్‌-1బీ వీసా కోటాలో మార్పుండదు.

దౌత్యాధికారుల తగ్గింపు వ్యవహారం.. కెనడాకు అమెరికా, యూకేల మద్దతు

లండన్/వాషింగ్టన్: కెనడాకు చెందిన 41 మంది దౌత్యాధికారుల హోదాను రద్దు చేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయంతో తాము విభేదిస్తున్నట్లు అమెరికా, యుకేలు ప్రకటించాయి. సిక్కు వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య అనంతరం రెండు దేశాల మధ్య కొనసాగుతున్న ప్రతిష్టంభన నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని భారత్ తీసుకున్నట్లు భావిస్తున్నామని తెలిపాయి. వియన్నా ఒప్పంద సూత్రాలకు భారత్ ప్రభుత్వ నిర్ణయం వ్యతిరేకమని యూకే పేర్కొనగా, విభేదాల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో దౌత్యాధికారుల అవసరం ఉంటుందని అమెరికా విదేశాంగ శాఖ నొక్కి చెప్పింది. 'దౌత్య సంబంధాలపై 1961 వియన్నా ఒప్పందం ప్రకారం అన్ని దేశాలు తమ బాధ్యతలను గుర్తిస్తాయని మేం ఆశిస్తున్నాం. దౌత్యవేత్తల భద్రత కోసం కల్పించాల్సిన అధికారాలు, ఇతర హక్కులను ఏకపక్షంగా తొలగించడం వియన్నా సూత్రాల విరుద్ధం. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యపై స్వతంత్ర దర్యాప్తులో కెనడాతో పాలుపంచుకోవాలని భారత్‌ను కోరుతూనే ఉన్నాం'అని యూకే విదేశాంగశాఖ పేర్కొంది.'భారత్‌లో దౌత్యాధికారులను గణనీయంగా తగ్గించాలని భారత ప్రభుత్వం డిమాండ్ చేయడం, కెనడా తన దౌత్యవేత్తలను వెనక్కి తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. విభేదాలను పరిష్కరించడానికి క్షేత్ర స్థాయిలో దౌత్యవేత్తలు అవసరం. దౌత్యాధికారులను తగ్గించాలంటూ కెనడాపై ఒత్తిడి తేవద్దని, నిజ్జర్ హత్యపై కెనడా ప్రభుత్వం చేపట్టిన దర్యాప్తులో సహకరించాలని భారత ప్రభుత్వాన్ని కోరాం'అని అమెరికా విదేశాంగ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ తెలిపారు.

ఆరు నెలల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

దీపావళి తర్వాత 2.7 లక్షల పంచాయతీల్లో మెగా డ్రైవ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ పూర్తి స్థాయిలో వేగంగా అందించేందుకు ప్రధాని మోదీ ఆరు నెలలు గడువు విధించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరుతో మెగా డ్రైవ్ చేపట్టనుంది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా రూపకల్పన చేసిన 'రథా'ల్లో దేశంలోని మొత్తం 2.7 లక్షల పంచాయతీల్లోని అర్హులైన లబ్ధిదారులను కలుసుకుని, వారి పేర్లను నమోదు చేయనుంది. ఈ బృహత్తర కార్యక్రమం వచ్చే నెలలో దీపావళి తర్వాత ప్రారంభమై కొన్ని వారాలపాటు కొనసాగుతుందని శనివారం అధికారవర్గాలు తెలిపాయి.

గాంధీ శాంతి పురస్కార గ్రహీత ఎంపిక కమిటీ

సభ్యుడిగా వెంకయ్య

సాక్షి, న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక గాంధీ శాంతి పురస్కార గ్రహీత ఎంపిక కమిటీ సభ్యుడిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకం పట్ల ప్రధాని మోదీకి వెంకయ్య కృతజ్ఞతలు తెలిపారు. 1995లో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభ సభాపతి, లోక్‌సభలో విపక్షనేత, ఇద్దరు ప్రముఖ వ్యక్తులు సభ్యులుగా ఉంటారు. అహింసాయుత పద్ధతుల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ పరివర్తన తీసుకురావడంలో కీలక పాత్ర పోషించే వ్యక్తులు, సంస్థలకు ఏటా గాంధీ శాంతి పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. గ్రహీతలకు రూ. కోటి నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారు.

పాకిస్తాన్‌కు షరీఫ్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ముస్లిం లీగ్‌–నవాజ్ అధినేత, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ (73) నాలుగేళ్ల స్వీయ ప్రవాసం అనంతరం స్వదేశానికి తిరిగొచ్చారు. జనవరిలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శనివారం ప్రత్యేక విమానంలో ఇంగ్లండ్ నుంచి బయల్దేరి ఇస్లామాబాద్ చేరుకున్నారు. కోర్టుకు సమర్పించాల్సిన బెయిల్ పత్రాలపై సంతకం తదితరాల అనంతరం అదే విమానంలో లాహోర్ వెళ్లి భారీ ర్యాలీలో పాల్గొన్నారు. తన తల్లి, భార్య రాజకీయాలకు బలయ్యారని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. వారి చివరిచూపుకూ నోచుకోలేదంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

'గగన' విజయం

- మానవ సహిత ప్రయోగాలకు ఈ ప్రయోగం తొలి మెట్టు
- కొంత మేర ఇబ్బందులు పడినా ప్రయోగాన్ని సక్సెస్ చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు
- అభినందించిన ప్రధాని మోదీ



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): మానవసహిత అంతరిక్ష ప్రయోగాల దిశగా అడుగులు వేస్తున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఆ ప్రయత్నంలో తొలి విజయం సాధించింది. విజయసోపానాల్లో తొలిమెట్టుగా భావిస్తున్న గగన్‌యాన్ ప్రాజెక్టు సన్నాహకాల్లో భాగంగా ఇస్రో చేపట్టిన మానవరహిత క్రూ ఎస్కేప్ సిస్టమ్(సీఈఎస్) పరీక్ష విజయవంతమైంది. సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక ఇందుకు వేదికై ంది. ప్రయోగ వేదిక నుంచి శనివారం ఉదయం 10 గంటలకు గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ (టీవీ–డీ1) వాహకనౌకను విజయవంతంగా పరీక్షించారు. దాదాపు 16.9 కి.మీ.ల ఎత్తులో అందులోంచి క్రూ ఎస్కేప్ మాడ్యూల్, ఎస్కేప్ మాడ్యూల్‌లు విడిపోయి వేర్వేరు పథాల్లో ప్రయాణించి బంగాళాఖాతంలో సురక్షితంగా పడ్డాయి. క్రూ ఎస్కేప్ మాడ్యూల్‌ను డ్రోగ్ పారాచూట్‌లు సురక్షితంగా సముద్రజలాలపై ల్యాండ్ అయ్యేలా చేశాయి. మానవసహిత ప్రయోగాలు చేపట్టినపుడు అందులోని వ్యోమగాములను క్రూ మాడ్యూల్ ఎలా సురక్షితంగా బయటపడేయగలదన్న అంశాన్ని పరీక్షించేందుకే ఈ ఎస్కేప్ మాడ్యూల్ పరీక్ష చేశారు.

17 కిలోమీటర్ల ఎత్తుకెళ్లి తిరిగి సముద్రంలోకి ..

టెస్టు వెహికల్ (టీవీ–డీ1) ప్రయోగాన్ని 10.10 నిమిషాల వ్యవధిలో పూర్తి చేశారు. ఇందులో భాగంగా సింగిల్ స్టేజీ ద్రవ ఇంధన రాకెట్(టీవీ–డీ1)పై క్రూ ఎస్కేప్ మాడ్యూల్, ఎస్కేప్ మాడ్యూల్‌లను అమర్చారు. రాకెట్‌ను ప్రయోగించాక అత్యవసర స్థితి(అబార్ట్)ను సిములేట్ చేశారు. దీంతో రాకెట్ 11.7 కిలోమీటర్ల దూరం ప్రయాణించాక క్రూ ఎస్కేప్ మాడ్యూల్, ఎస్కేప్ మాడ్యూల్‌లు వేరువడటం ప్రారంభమైంది. రాకెట్ 16.6 కిలోమీటర్ల ఎత్తులోకి చేరుకున్నాక క్రూ ఎస్కేప్ మాడ్యూల్, ఎస్కేప్ మాడ్యూల్‌లు రాకెట్ నుంచి విడివడి వేర్వేరు మార్గాల్లో ప్రయాణిస్తూ బంగాళాఖాతంలో పడ్డాయి. అయితే క్రూ ఎస్కేప్ మాడ్యూల్‌ను సేకరించే ఉద్దేశంతో అది సురక్షితంగా సముద్రంలో పడేలా తొలుత రెండు డ్రోగ్ పారాచూట్లు విచ్చుకుని నెమ్మదిగా కిందకు దిగేందుకు సాయపడ్డాయి. తర్వాత మరో పెద్ద పారాచూట్ విచ్చుకుని ల్యాండింగ్‌ను దిగ్విజయం చేసింది. సమీప సముద్ర జలాల్లో ప్రత్యేక లాంచీలో వేచి ఉన్న కోస్టల్ నేవీ బలగాలు ఆ మాడ్యూల్‌ను సురక్షితంగా శ్రీహరికోటకు చేర్చారు. అయితే మానవ సహిత గగన్‌యాన్ ప్రయోగాలు భవిష్యత్తులో చేయడానికి ఇలాంటి ప్రయోగాలు మరో మూడు చేయాలని ఇస్రో శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. నాలుగోసారి క్రూ మాడ్యూల్‌లో వ్యోమగాములను పోలిన బొమ్మలను అమర్చి క్రూ ఎస్కేప్ మాడ్యూల్‌ను పరీక్షిస్తారు. ఇవన్నీ పూర్తయిన తర్వాత 2024 చివర్లో లేదా 2025 ప్రథమార్ధంలో మానవ సహిత ప్రయోగాలు చేయనున్నారు. గగన్‌యాన్ టీవీ–డీ1 ప్రయోగం విజయవంతం కావడంపై ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మిషన్ డైరెక్టర్ శివకుమార్, డైరెక్టర్ సునీల్, వీఎస్ఎస్‌సి డైరెక్టర్ ఉన్ని కృష్ణన్‌నాయక్, డైరెక్టర్ నారాయణ పాల్గొన్నారు.


గగన్‌యాన్ సాకారం దిశగా మరింత చేరువకు: ప్రధాని మోదీ

'టెస్ట్ వెహికల్ అబార్ట్ మిషన్ (టీవీ–డీ1)' పరీక్షను ఇస్రో విజయవంతంగా నిర్వహించడంతో ప్రధాని మోదీ సంతోషం వ్యక్తంచేశారు. ' ప్రతిష్టాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టు సాకారం దిశగా ఈ ప్రయోగం మనల్ని మరింత చేరువ చేసింది. ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు' అంటూ వారిని అభినందిస్తూ ప్రధాని మోదీ శనివారం ట్వీట్లు చేశారు.

మొదట తడబడినా..

మొదట శుక్రవారం రాత్రి ఏడింటికి మొదలైన 13 గంటల కౌంట్‌డౌన్ శనివారం ఉదయం 8 గంటలకు ముగిశాక ప్రయోగం చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో శనివారం తెల్లవారుజామున వర్షం పడడంతో వాతావరణం అనుకూలించని కారణంగా కౌంట్‌డౌన్ సమయాన్ని మరో 30 నిమిషాలు పెంచారు. తర్వాత 15 నిమిషాల వ్యవధిలోనే అంటే 8.15 గంటలకు రాకెట్ ప్రయోగాన్ని ప్రయోగించేందుకు సన్నాహాలు చేసి 8.45గంటలకు కౌంట్‌డౌన్ మొదలు పెట్టారు. హఠాత్తుగా ఇంజన్‌ను మండించే ప్రక్రియలో లోపం తలెత్తింది. దీంతో రాకెట్ ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్లకుండా ఆగిపోయింది. దీంతో ప్రయోగాన్ని ఆటో మేటిక్ లాంచ్ సీక్వెన్స్‌లోని ఆన్ బోర్డు కంప్యూటర్ ఆపేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి ప్రయోగం వాయిదా వేసినట్లు ఇస్రో అధికారికంగా ప్రకటించింది. అయితే దీన్ని సవాల్‌గా తీసుకున్న ఇస్రో శాస్త్రవేత్తల టైగర్ సేఫ్టీ బృందం వెంటనే లాంచ్ ప్యాడ్ వద్దకు వెళ్లి సాంకేతిక లోపాన్ని సరిచేసింది. దీంతో మళ్లీ 9.33 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. ఎట్టకేలకు 10.03 గంటలకు గగన్‌యాన్ టీవీ–డీ1 విజయవంతంగా ప్రయోగించారు. 10 నిమిషాల 10 సెకన్లలో మొత్తం ప్రయోగం విజయవంతంగా పూర్తయింది.

సముద్ర జలాల నుంచి ఐఎన్ఎస్ శక్తి ఓడలో తీసుకొస్తున్న క్రూ ఎస్కేప్ మాడ్యూల్





పారాచూట్‌తో కిందికి దిగుతున్న క్రూ ఎస్కేప్ మాడ్యూల్



బంగాళాఖాతం జలాల్లో దిగిన క్రూ ఎస్కేప్ మాడ్యూల్



పీవీ నుంచి వాజ్‌పేయికి

రహస్య చీటీ!

- ఆ చీటీలో ఏముందంటే..
- అశోక్ టాండన్ పుస్తకంలో పలు అంశాలు వెల్లడి

న్యూఢిల్లీ: దిగ్గజ నేత అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సమయంలో మాజీ ప్రధాని, కాంగ్రెస్ నేత పీవీ నరసింహా రావు ఆయనకు ఓ చీటీ అందించారని తాజాగా విడుదలైన ఒక పుస్తకం ద్వారా వెల్లడైంది. వివరాల్లోకి వెళ్తే.. వాజ్‌పేయి ప్రధానిగా కొనసాగిన కాలంలో అంటే 1998–2004 కాలంలో అశోక్ టాండన్ అనే అధికారి ప్రధానమంత్రి కార్యాలయంలో మీడియా వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన రాసిన 'ది రివర్స్ స్వింగ్: కలోనియలిజం టు కోఆపరేషన్' అనే పుస్తకంలో ఇటీవల విడుదలైంది. దానిని పెట్రోలియం, సహజవాయు, గృహ, పట్టణవ్యవహారాల కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పురీ ఢిల్లీలో ఆవిష్కరించారు. ఆ పుస్తకంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి గురించి కొన్ని ఆసక్తికరమైన అంశాలను టాండన్ పంచుకున్నారు. రాష్ట్రపతిభవన్‌లో ప్రమాణస్వీకారం వేళ వాజ్‌పేయి ప్రధానమంత్రి పదవి చేపట్టినపుడు అదే సమయంలో అక్కడే ఉన్న మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు ఒక చీటీని వాజ్‌పేయికి రహస్యంగా అందించారు. 'అసంపూర్తిగా మిగిలిపోయిన ఒక పనిని మీరు పూర్తిచేయాలి' అని ఆ చీటిలో రాసి ఉందట. 1996 సంవత్సరంలో ఈ ఘటన జరిగిందని పుస్తకంలో పేర్కొన్నారు. ' పీవీ తాను ప్రధానిగా కొనసాగిన కాలంలో అమెరికా నుంచి తీవ్ర ఒత్తిళ్ల కారణంగా అణు పరీక్షలను విజయవంతంగా నిర్వహించలేకపోయారు. ఆ బాధ్యతలను పీవీనే స్వయంగా వాజ్‌పేయికి అప్పగించి ఉంటారు' అని ఆ పుస్తకంలో టాండర్ రాసుకొచ్చారు. 1996లో వాజ్‌పేయి ప్రధాని పదవి చేపట్టడం 13 రోజులకే ప్రభుత్వం కూలడం, 1998లో ప్రధాని పగ్గాలు చేపట్టి విజయవంతంగా ఐదేళ్ల పాలన వాజ్‌పేయి పూర్తిచేసుకోవడం తెల్సిందే. 1996లో అణుపరీక్షలకు ప్రయత్నించి విఫలమైన ప్రభుత్వం 1998లో పోఖ్రాన్‌లో విజయవంతంగా పూర్తిచేసి అమెరికాను సైతం విస్మయానికి గురిచేసిన సంగతి తెల్సిందే.

రాష్ట్రపతి పదవి తిరస్కరణ!

2002 సంవత్సరంలో ప్రధాన మంత్రిగా దిగిపోయి రాష్ట్రపతి పదవి చేపట్టాలని వాజ్‌పేయికి సూచనలు వచ్చాయని, కానీ వాజ్‌పేయి అందుకు ససేమిరా అన్నారని పుస్తకంలో ఉంది. ప్రధానిగా వాజ్‌పేయి దిగిపోతే ఆ బాధ్యతలు అద్వానీకి అప్పగించాలని చూశారని పేర్కొన్నారు. ' ప్రధానిగా ఉన్న వ్యక్తి వెంటనే రాష్ట్రపతి పదవి చేపడితే అది ప్రజాస్వామ్య దేశానికి ఎంతమాత్రం మంచిదికాదు. పరిణామాలు దారుణంగా ఉంటాయి' అని తన తోటి మంత్రులతో వాజ్‌పేయి అన్నారట.

1996 తర్వాత మెజారిటీ ప్రభుత్వం అమెరికాకు నచ్చలేదట

పుస్తకంలో పీవీ ఆలోచనలనూ పొందుపరిచారు. ' 1996 సార్వత్రిక ఎన్నికల తర్వాత ఇండియాలో పటిష్టమైన ప్రభుత్వం ఏర్పడటం అమెరికాకు ఇష్టంలేదట. వాజ్‌పేయి ప్రధాని కావడం అమెరికాకు ఇష్టం లేదనుకుంటా. వాజ్‌పేయి ముక్కుసూటి తనం, ఆయన వ్యవహార శైలి చూస్తుంటే ఆయన అణుపరీక్షలకు పచ్చజెండా ఊపేలా ఉన్నారని అమెరికా ప్రభుత్వానికి ఢిల్లీలోని ఆ దేశ రాయబారి సమాచారం చేరవేశారు' అని పీవీ అప్పట్లో అన్నట్లు పుస్తకంలో పేర్కొన్నారు.

మొయిత్రా ఢిల్లీలో ఉంటే.. దుబాయ్‌లో ఆమె లాగిన్ ఐడీని వాడారు

బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే ఆరోపణలు

న్యూఢిల్లీ: టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే పరోక్షంగా మరికొన్ని ఆరోపణలు చేశారు. ఎంపీ మొయిత్రా ఢిల్లీలో ఉన్న సమయంలో ఆమె పార్లమెంట్ ఐడీని దుబాయ్‌లో కొందరు ఉపయోగించుకుని లాగిన్ అయిన విషయాన్ని నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్(ఎన్ఐసీ) దర్యాప్తు సంస్థలకు సమాచారం అందించిందని వెల్లడించారు. ఎంపీ దుబే శనివారం 'ఎక్స్'లో' ..'కొంత డబ్బు కోసం ఆమె జాతీయ భద్రతను పణంగా పెట్టారు. ఇదే ఎన్ఐసీని ప్రధానమంత్రి, ఆర్థిక శాఖ, వివిధ కేంద్ర విభాగాలు వాడుతుంటాయి. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), ప్రతిపక్షాలు ఇంకా దీనిపై రాజకీయాలు చేయాలా? దీనిపై ఇక ప్రజలే నిర్ణయం తీసుకుంటారు' అని దూబే పేర్కొన్నారు. కానీ, దర్యాప్తు విభాగం పేరును ఆయన పేర్కొనలేదు. అంతేకాకుండా, ఆమె ఎవరి నుంచి లంచం తీసుకున్నారు? వ్యాపారవేత్త దర్శన్ హీరా నందాని తరఫున అదానీ గ్రూప్, ప్రధాని మోదీ లక్ష్యంగా లోక్‌సభలో ఆమె ఎలాంటి ప్రశ్నలు అడిగారు? వంటి విషయాలను దుబే వివరించలేదు.

ఎంపీ దుబేకి ఎథిక్స్ కమిటీ పిలుపు

అదానీ గ్రూప్‌ను, ప్రధాని మోదీని లక్ష్యంగా లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు లంచం తీసుకున్నారంటూ టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై ఎంపీ దుబే ఇటీవల లోక్‌సభ స్పీకర్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై లోక్‌సభ నైతిక వ్యవహారాల కమిటీ విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా, ఈ నెల 26న తమ ముందు హాజరై మౌఖిక సాక్ష్యం ఇవ్వాలని దుబేను కోరింది. అదానీ గ్రూప్ గుజరాత్‌లోని తన కంపెనీకి బదులుగా ఒడిశాలోని ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందిన విభాగంలో ఎల్ఎన్‌జీ నిల్వ చేసుకునేందుకు అనుమతి పొందిన అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించేందుకు ఎంపీ మహువా పార్లమెంటరీ ఐడీని లాగిన్ చేసినట్లు వివరిస్తూ హీరా నందాని స్వయంగా సంతకం చేసిన ఒక సీల్డు కవర్‌ను ఈ కమిటీకి అందజేశారు. ఈ వివరాలు కూడా బయటకు వెల్లడి కావడం గమనార్హం. ఎంపీ మొయిత్రాపై ఆరోపణల విషయంలో సొంత పార్టీ టీఎంసీ మౌనంగా ఉంటోంది. అయినప్పటికీ మొయిత్రా ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ అదానీ గ్రూప్‌పైనా, ఎంపీ దుబేపైనా ఆరోపణలు ఎక్కుపెడుతూనే ఉన్నారు.


ఎంపీలందరి లాగిన్ వివరాలను ఎన్ఐసీ వెల్లడించాలి: మొయిత్రా

తను ఢిల్లీలో ఉండగా పార్లమెంటరీ లాగిన్ ఐడీని దుబాయ్‌లో వాడారంటూ బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే చేసిన ఆరోపణలపై ఎంపీ మహువా మొయిత్రా తీవ్రంగా స్పందించారు. ఎంపీలందరి లాగిన్ వివరాలను కూడా ఎన్ఐసీ బహిరంగ పర్చాలని, వారు ఏ సమయంలో ఏ ప్రదేశంలో ఉన్నారో కూడా పరిశీలించాలని ఆమె డిమాండ్ చేశారు. తన కంటే జాతీయ భద్రతకు అత్యంత ప్రమాదకరం అదానీ గ్రూపేనని ఆమె ఎదురుదాడికి దిగారు. అదానీ గ్రూప్ కంపెనీ బొగ్గు దిగుమతులపై సీబీఐ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాద ఘటనల్లో

పదేళ్లలో 65% తగ్గుదల

కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాదం, ఈశాన్య రాష్ట్రాల్లో విద్రోహ చర్యలు గత దశాబ్ద కాలంలో 65 శాతం మేర తగ్గుముఖం పట్టాయని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. దేశంలోని మూడు హాట్ స్పాట్లుగా ఉన్న వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాలు, ఈశాన్య ప్రాంతం, జమ్మూకశ్మీర్‌ల్లో పరిస్థితులు ప్రశాంతంగా మారాయన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకురావడంతోపాటు ఉగ్రవాదాన్ని కఠినంగా అణచివేస్తుండడమే దీనికి కారణమన్నారు. శనివారం నేషనల్ పోలీస్ మెమోరియల్ వద్ద పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మంత్రి అమిత్ షా మాట్లాడారు. పోలీస్ టెక్నాలజీ మిషన్ ఏర్పాటు చేసి పోలీసు బలగాలను తీవ్రవాదులను ఎదుర్కోవడంలో ప్రపంచంలోనే అత్యుత్తమంగా తయారు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. దాదాపు 150 ఏళ్లనాటి క్రిమినల్ జస్టిస్ విధానాన్ని సమూలంగా మార్చేందుకు ప్రభుత్వం పార్లమెంట్‌లో మూడు బిల్లులను ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విధి నిర్వహణలో 36,250 మంది పోలీసులు ప్రాణాలర్పించారు. 2022 సెప్టెంబర్ నుంచి 2023 ఆగస్ట్ వరకు 188 మంది పోలీసులు విధుల్లో ఉండగా అమరులయ్యారు. పోలీసు స్మారకం కేవలం చిహ్నం కాదు, దేశ నిర్మాణం కోసం పోలీసు సిబ్బంది చేసిన త్యాగం, అంకితభావానికి గుర్తింపు'అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అంతర్గత రక్షణతోపాటు దేశ సరిహద్దుల భద్రతకు సైతం సమర్థమంతమైన పోలీసు విధానం అవసరం ఎంతో ఉందని చెప్పారు.

దద్దరిల్లుతున్న దక్షిణ గాజా

క్షిపణి దాడులతో విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్

- ఇరువైపులా ఇప్పటికే 5,500 దాటిన మరణాలు

జెరూసలేం: ఇజ్రాయెల్ దాడులతో దక్షిణ గాజా గజగజలాడుతోంది. ఉత్తర గాజాను ఖాళీ చేసి తక్షణం దక్షిణాదికి వెళ్లాల్సిందిగా 11 లక్షల మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ హెచ్చరించడం తెలిసిందే. దాంతో అంత మందీ నానా పాట్లు పడి అతి ప్రమాదకరమైన 20 కిలోమీటర్లకుపైగా ప్రయాణించి దక్షిణ గాజాకు చేరుకున్నారు. ఇంతా చేసినా రోజుల వ్యవధిలోనే దక్షిణ గాజాపైనా ఇజ్రాయెల్ తీవ్ర దాడులకు తెగబడడటంతో పాలస్తీనియన్ల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. అక్కడి ఖాన్ యూనిస్ నగరంతో పాటు పలు ప్రాంతాలపై ఎడతెరిపి లేకుండా ఇజ్రాయెల్ క్షిపణులు వచ్చి పడుతున్నట్టు స్థానికులు వాపోతున్నారు. దాడుల్లో ఇప్పటికే కనీసం 4,200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్య శాఖ తాజాగా ప్రకటించింది. 13 వేల మందికి పైగా తీవ్రంగా గాయపడినట్లు వివరించింది. ఇజ్రాయెల్‌లో ఇప్పటిదాకా 1,500 మంది మరణించినట్లు వార్తలొచ్చాయి. మరోవైపు గాజాపై భూతల దాడికి అన్ని విధాలా ఇజ్రాయెల్ సిద్ధమవుతోంది. లెబనాన్ వైపు సరిహద్దుల్లో ఉన్న పెద్ద పట్టణాలను ఆగమేఘాల మీద ఖాళీ చేయిస్తోంది. ఈ నేపథ్యంలో లెబనాన్ ముందుజాగ్రత్త చర్యగా సరిహద్దుల వెంబడి తన నగరాలు, ఆవాసాలను ఖాళీ చేయిస్తోంది. హమాస్‌కు నేరుగా దన్నుగా బరిలో దిగాలని లెబనీస్ ఉగ్ర సంస్థ హెజ్బొల్లా నిర్ణయం తీసుకుందని ఇజ్రాయెల్ తాజాగా ఆరోపించింది. ఇందుకు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించింది. హెజ్బొల్లా ఇప్పటికే దక్షిణ లెబనాన్ నుంచి ఇజ్రాయెల్‌పై ఎడతెరిపి లేకుండా క్షిపణి దాడులకు దిగుతోంది. ఇజ్రాయెల్‌పై అక్టోబర్ ఏడో తేదీన మెరుపుదాడికి దిగిన సందర్భంగా బందీలుగా పట్టుకున్న వందలాది మందిలో ఇద్దరు అమెరికన్లను హమాస్ తాజాగా విడుదల చేసింది. జుడిత్ రానన్, ఆమె 17 ఏళ్ల కూతురు నటాలీ హమాస్ చెర నుంచి బయటపడ్డట్టు ఇజ్రాయెల్ పేర్కొంది.



హమాస్ చెర నుంచి విడుదలై ఇజ్రాయెల్ చేరుకున్న నటాలీ, జూడిత్‌లు శుక్రవారం అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న దృశ్యం

కీలక భేటీ

యుద్ధాన్ని ఆపే మార్గాంతరాలపై డజనుకు పైగా ప్రాంతీయ, పాశ్చాత్య దేశాలకు అధినేతలు, నేతలు, ఉన్నతాధికారులతో ఈజిప్ట్ శనివారం సమావేశం నిర్వహించింది. యుద్ధానికి తెర వేయడం, వీలుకాని పక్షంలో కనీసం కాల్పుల విరమణకైనా ఇరు వర్గాలను ఒప్పించే మార్గాంతరాలపై నేతలు చర్చించారు. ఇందులో ఇటలీ, స్పెయిన్, గ్రీస్, కెనడా ప్రధాన మంత్రులతో పాటు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు పాల్గొన్నట్టు ఈజిప్ట్ ప్రభుత్వం పేర్కొంది. ఖతర్, యూఏఈ తదితర దేశాల ఉన్నత స్థాయి నేతలు కూడా పాల్గొన్నారు. మరోవైపు, ఇరాక్ నుంచి తక్షణం అమెరికా బలగాలు పూర్తిగా వైదొలగాలని ఇరాన్ దన్నున్న స్థానిక మిలిటెంట్ సంస్థలు హెచ్చరించాయి.

థన్‌బర్గ్ ట్వీట్‌కు దీటుగా బదులిచ్చిన ఇజ్రాయెల్

పర్యావరణ ఉద్యమకారిణి గ్రేటా థన్‌బర్గ్ చేసిన ట్వీట్‌కు ఇజ్రాయెల్ గట్టి సమాధానం ఇచ్చింది. యుద్ధంపై పర్యావరణ ఉద్యమకారిణి గ్రేటా థన్‌బర్గ్ చేసిన ట్వీట్‌కు ఇజ్రాయెల్ దీటుగా బదులిచ్చింది. గాజాకు మద్దతుగా కొందరు వ్యక్తులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తోన్న చిత్రాన్ని థన్‌బర్గ్ ట్వీట్‌చేశారు. 'పాలస్తీనా, గాజాకు మద్దతిస్తున్నాం. పోరుపై ప్రపంచం స్పందించాలి. పాలస్తీనా ప్రజలు, ఇతర బాధితుల కోసం కాల్పుల విరమణ ప్రకటించాలి. న్యాయం, స్వేచ్ఛ కోసం పిలుపు ఇవ్వాలి' అని గ్రేటా ట్వీట్‌చేశారు. దీనిపై ఇజ్రాయెల్ స్పందించింది. 'హమాస్ దాడుల వల్ల ఎంతోమంది అమాయకులైన ఇజ్రాయెల్ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఆ నరమేధ బాధితుల్లో మీ స్నేహితులూ ఉండొచ్చు. వారి కోసం పోరాడండి' అని వ్యాఖ్యానించింది.

ఎట్టకేలకు గాజాకు సాయం షురూ

ఐరాస, అంతర్జాతీయ సంస్థల వారం రోజుల పై చిలుకు ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. గాజాకు సహాయ సామగ్రి అందించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించింది. దాంతో వాటిని చేరవేసేందుకు వీలుగా సరిహద్దులను తెరిచేందుకు ఈజిప్ట్ రఫా క్రాసింగ్‌ను హుటాహుటిన తెరిచింది. కానీ 20 ట్రక్కులను మాత్రమే అనుమతించారు. గాజాలో రోడ్డు మార్గాలు పూర్తిగా ధ్వంసం కావడంతో వాటికి మరమ్మతులు కొనసాగుతున్నాయి. ట్రక్కుల్లోని సామగ్రిని చిన్న చిన్న మోటార్లపై తరలిస్తున్నారు. వందలాది ట్రక్కులు సహాయ సామగ్రితో వారం రోజులకుపైగా ఈజిప్ట్ సరిహద్దుల వద్ద వేచి చూస్తున్నాయి. తినేందుకు, తాగేందుకు దిక్కులేక 23 లక్షల మంది గాజావాసులు అల్లాడుతున్నారు. ఉప్పు నీరు తాగి ప్రాణాలు నిలబెట్టుకుంటున్నారు! గాజాలో పరిస్థితి ఘోర మానవీయ విపత్తు దిశగా సాగుతోందని ఐరాస ఆహార పథకం ఆందోళన వెలిబుచ్చింది.

- సహాయ సామగ్రితో 200కు పైగా ట్రక్కులు ఈజిప్ట్ సరిహద్దు వద్ద వేచి చూస్తున్నాయి.
- వాటిల్లో 3,000 టన్నులకు పైగా అత్యవసరాలు, ఔషధాలు తదితరాలున్నాయి.
- గాజాలోకి వెళ్లిన 20 ట్రక్కుల్లో 44 వేల తాగు నీటి బాటిళ్లున్నాయి. కానీ అవి 22 వేల మందికి ఒక్క రోజు కంటే చాలవు!



గాజా సిటీలో ఇజ్రాయెల్ దాడుల్లో నామరూపాల్లేకుండా ధ్వంసమైన ఇల్లు



ఈజిప్ట్ నుంచి రఫా వద్ద గాజాలోకి ప్రవేశిస్తున్న నిత్యావసరాల ట్రక్కులు

ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం.. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో సీఎం వైఎస్ జగన్



సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ మన విధానం. శాంతి భద్రతల పరిరక్షణే ఈ ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండవు. అసాంఘిక శక్తులను ఏమాత్రం ఉపేక్షించవద్దు'.

– సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'ప్రశాంతంగా సాగిపోతున్న ప్రజా జీవితాన్ని తమ స్వార్థం కోసం దెబ్బతీసే శక్తులన్నీ కూడా అసాంఘిక శక్తులే. ప్రభుత్వం, సమాజం మీద దాడిచేసి మనుగడ సాగించే శక్తులన్నీ అడవుల్లోనో అజ్ఞాతంలోనో కాకుండా ఇప్పుడు ప్రజా జీవితంలో ఉండటాన్ని మనం చూస్తున్నాం. ప్రజల మధ్యే ఉంటూ ప్రజల మీదే దాడిచేస్తున్నాయి. అటువంటి అసాంఘిక శక్తులను ఏమాత్రం ఉపేక్షించవద్దు. అసాంఘిక శక్తులు అనే పదాన్ని పునర్నిర్వచించాల్సిన అవసరం ఏర్పడింది'.. అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్బోధించారు. ప్రజాస్వామ్యం, పౌర హక్కులు, పత్రికా స్వేచ్ఛ వంటి పదాలకు అర్థం.. ఒక ముఠా, ఒక వర్గం పోలీసుల నుంచి, న్యాయస్థానాల నుంచి చట్టాన్ని లాక్కోవడం కాదని ఆయన తేల్చిచెప్పారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 1959 అక్టోబరు 21న చైనా సైనికులను ఎదిరించి పోరాడిన ఎస్సై కరణ్‌సింగ్ ఆయన సహచరుల ధైర్యాన్ని, త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ ఆ రోజును అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా దేశం గత 64 ఏళ్లుగా జరుపుకుంటూ వారిని గుర్తు చేసుకుంటోందన్నారు. అలాగే, రాష్ట్రంలో విధినిర్వహణలో ప్రాణాలు త్యాగం చేసిన పోలీసు కుటుంబాలకు మనందరి ప్రభుత్వం అన్నిరకాలుగా అండగా, తోడుగా ఉంటుందని పునరుద్ఘాటిస్తూ గత ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 188 మంది అమరులైన పోలీసులకు శ్రద్ధాంజలి అర్పించారు.

నలుగురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణం

- హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్‌తో ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- హాజరైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

సాక్షి, అమరావతి: హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నూనేపల్లి హరినాథ్, మండవ కిరణ్మయి, జగడం సుమతి, న్యాపతి విజయ్ శనివారం ప్రమాణం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఈ నలుగురిచేత గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణస్వీకారం చేయించారు. మొదట హరినాథ్, ఆ తర్వాత కిరణ్మయి, సుమతి, విజయ్ ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం అదనపు న్యాయమూర్తులుగా ప్రమాణస్వీకారం చేసిన నలుగురికి గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ప్రమాణస్వీకారం పూర్తయిన తర్వాత నలుగురు కూడా గవర్నర్, ముఖ్యమంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. అంతకుముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ ప్రమాణస్వీకార కార్యక్రమం ప్రొసీడింగ్స్ నిర్వహించారు. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు ప్రమాణం చేసిన నలుగురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జారీ చేసిన ఉత్తర్వులను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన అదనపు న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తేనీటి విందులో అందరూ పాల్గొన్నారు. కాగా, హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్‌లను హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమిస్తూ రాష్ట్రపతి ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. వీరిలో హరినాథ్ 2034 వరకు, కిరణ్మయి 2032 వరకు, సుమతి 2033 వరకు, విజయ్ 2036 వరకు హైకోర్టు న్యాయమూర్తులుగా కొనసాగుతారు.

సూర్య,చంద్రప్రభలపై తేజోమయుడు



తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం సూర్యప్రభ వాహనంపై మలయప్ప ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి చంద్రప్రభపై చల్లని చంద్రకాంతుల్లో భక్తులను అనుగ్రహించారు. వాహనసేవల్లో భజన బృందాల కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి పాల్గొన్నారు. కాగా, శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీనివాసుడు స్వర్ణరథాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహించనున్నారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

సీఎం వైఎస్ జగన్ ఆకాంక్ష..ప్రజలకు దసరా శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి పండుగలను పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ సీఎం వైఎస్ జగన్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. అమ్మలగన్నయమ్మ.. ముగ్గురమ్మల మూలపుటమ్మ అనుగ్రహం కోసం.. నవరాత్రుల్లో 9 రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో దుర్గామాతను పూజిస్తారని సీఎం పేర్కొన్నారు. చెడుపై.. మంచి, దుష్ట శక్తులపై.. దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగే విజయదశమి అని తెలిపారు. ఆ జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించాలని, ఆ కనకదుర్గమ్మవారి దీవెనలు, ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

మరింత ఎత్తైన కక్ష్యలోకి ఇస్రో దూసుకెళ్తోంది: ఇస్రో బృందానికి సీఎం వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు. గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ డీ1 మిషన్ విజయవంతం అవడంపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంలో మరింత ఎత్తైన కక్ష్యలోకి ఇస్రో దూసుకెళ్తోందని ఆయన కొనియాడారు.

ఏపీ ఉద్యోగులకు డీఏ విడుదల

- 2022 జూలై 1నుంచి 3.64 శాతం డీఏ వర్తింపచేస్తూ ఉత్తర్వులు
- నవంబర్ 1 నుంచి డీఏ అమలు
- బకాయిలు మూడు విడతలుగా జీపీఎఫ్ ఖాతాలో జమ
- కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ మరో జీవో

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మరో రెండు హామీలను నెరవేర్చారు. దసరా పండుగకు 3.64 శాతం డీఏను విడుదల చేయడంతోపాటు రాష్ట్ర విభజన నాటికి ప్రభుత్వ శాఖల్లో నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ప్రభుత్వం రెండు వేర్వేరు ఉత్తర్వులను జారీ చేసింది. ఉద్యోగులకు వారి బేసిక్ పేలో 22.75 శాతం నుంచి 26.39 శాతానికి పెంచిన కరువు భత్యాన్ని 2022 జూలై 1 నుంచి అమల్లోకి తీసుకొస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పెరిగిన కరువు భత్యం నవంబర్ 2023 నుంచి అమల్లోకి వస్తుందని, పెరిగిన డీఏను నగదు రూపంలో డిసెంబర్ జీతంలో అందుకుంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2022 జూలై1 నుంచి ఈ ఏడాది అక్టోబర్31 వరకు ఉన్న బకాయిలను మూడు దఫాలుగా జనరల్ ప్రావిడెంట్ ఫండ్‌లో జమ చేయనున్నట్లు తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు బకాయిల్లో 10 శాతం ప్రాన్ అకౌంట్‌లో జమ చేసి మిగిలిన 90 శాతం మూడు దఫాలుగా అందజేస్తారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో ఈ బకాయిలను జమ చేస్తారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు, అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీలు, జిల్లా గ్రంథాలయ సమితులు, రివైజ్డ్ పేస్కేల్ 2022 కింద రెగ్యులర్‌గా జీతాలు అందుకుంటున్న వారు, ఎయిడెడ్ పాలిటెక్నిక్ కాలేజీలతో పాటు అన్ని ఎయిడెడ్ విద్యాసంస్థల్లోని బోధన, బోధనేతర సిబ్బంది, యూనివర్సిటీల్లో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందికి ఈ డీఏ పెంపు వర్తిస్తుంది. ఈ మేరకు ట్రెజరీ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్ర విభజన జరిగిన తేదీ 2–6–2014కు ముందు వివిధ ప్రభుత్వ శాఖల్లో నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులను ఆయా శాఖల్లో ఖాళీల ఆధారంగా భర్తీ చేయాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేవలం ప్రభుత్వ శాఖల్లోని నియామకాలకే ఇది వర్తిస్తుందని వివిధ పథకాలు, ప్రాజెక్టులు కింద పనిచేసే వారికి ఇది వర్తించదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయా శాఖాధిపతులు నిబంధనల ప్రకారం అర్హత కలిగిన కాంట్రాక్ట్ ఉద్యోగులను గుర్తిస్తూ ఉత్తర్వులు ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుస్తూ డీఏతో పాటు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాగా.. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ స్టేట్ కాంట్రాక్ట్ ఫార్మాసిస్ట్స్ అండ్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రత్నాకర్‌బాబు, ప్రధాన కార్యదర్శి వీఎస్‌వీఆర్ కిషోర్ హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాల బానిసత్వానికి విముక్తి కల్పిస్తూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా...

సీఎం సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ పండుగ చివరి రోజు 'సద్దుల బతుకమ్మ'ను పురస్కరించుకొని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానంలోనుంచి పుట్టిన ప్రకృతి పండుగే బతుకమ్మ అని, సబ్బండ వర్గాలు సమష్టిగా జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైనదని అన్నారు. పచ్చదనం, పాడి పంటలు, పశుసంపద, ప్రకృతి వనరుల సమృద్ధితో నేడు తెలంగాణ రాష్ట్రం నిండైన బతుక మ్మను తలపిస్తున్నదని పేర్కొన్నారు. బతుకమ్మల నిమజ్జన సమయంలో స్వీయ జాగ్రత్తలతో పాటు, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఆనందోత్సాహాలతో సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకోవాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు.

నేడు 'జూలూరు పథం' పుస్తక ఆవిష్కరణ

లక్డీకాపూల్(హైదరాబాద్): తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ రచించిన 'జూలూరు పథం'దీర్ఘకావ్యం పుస్తక ఆవిష్కరణసభ ఆదివారం ఇక్కడి రవీంద్ర భారతిలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి 'సాక్షి'సంపాదకుడు వర్ధెల్లి మురళి ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. జూలూరు పథం పుస్తకాన్ని ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, టీఎస్పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి పరిచయం చేయనున్నారు. కార్యక్రమంలో వివిధ పత్రికల సంపాదకులు కూడా పాల్గొననున్నట్టు రచయిత గౌరీశంకర్ తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్లు నిర్మించి ఇస్తాం

డీజేహెచ్ఎస్‌కు కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు హామీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రస్థాయిలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలే కాకుండా ఇళ్లు నిర్మించి ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎన్నికల ప్రణాళికలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని పొందుపరుస్తామని స్పష్టం చేశారు. శనివారం డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ (డీజే హెచ్ఎస్) ప్రతినిధులు గాంధీభవన్‌లో శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పలు పార్టీలను కలిసి మేనిఫెస్టోలో జర్నలిస్టుల ఇళ్ల అంశం చేర్చాలని డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రయత్నాలు చేస్తోంది.

బీఆర్ఎస్‌కు కోదాడ నాయకుల రాజీనామా

కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు అసంతృప్త నాయకుల ప్రకటన

కోదాడ: కోదాడ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొల్లం మల్లయ్యయాదవ్‌ను మార్చాలని అధిష్టానానికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోకపోవడంతో తామంతా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరడానికి నిర్ణయించుకున్నట్లు కోదాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అసమ్మతి నేతలు ప్రకటించారు. శనివారం కోదాడలోని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో బీఆర్ ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏర్నేని బాబు, మాజీ మార్కెట్ చైర్మన్ ఎండీ మహబూబ్ జానీ, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి, అసంతృప్త నేత కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డిని అధిష్టానం హైదరాబాద్‌కు పిలిచింది. ఆయన ప్రగతిభవన్‌కు వెళ్లి మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులతో మాట్లాడి నట్లు తెలిసింది. వారు ఆదివారం వరకు ఆగాలని చెప్పారని, తమ కు అనుకూలంగా నిర్ణయం రాకపోతే అప్పుడే నిర్ణయం తీసుకుంటామని శశిధర్‌రెడ్డి 'సాక్షి'తో అన్నారు.

కాంగ్రెస్, బీజేపీ ఆలుమగలు!

కేసీఆర్‌ను విమర్శించడంలో మోదీ, రాహుల్‌ది ఒకే గొంతు: కేటీఆర్

కాంగ్రెస్ పార్టీకి కలలు కనడం కొత్తకాదు.. బీజేపీ దుకాణం ఇక బంద్ అయినట్టే

- 40 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు అభ్యర్థులే లేరు
- బీజేపీ అయితే యుద్ధానికి ముందే రేసు నుంచి తప్పుకొంది
- ఆ పార్టీ ఒక్క సీటుకే పరిమితమయ్యే సూచనలు ఉన్నాయి
- బీఆర్ఎస్ అభ్యర్థుల మీద ఉన్న అసంతృప్తిని అధిగమిస్తాం
- ప్రగతిభవన్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి వెల్లడి



నేను సీఎం అనే ప్రచారంలో పస లేదు..

➤ తనను సీఎం చేసేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారన్న ప్రచారంలో పస లేదని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో తనకంటే తెలివైన వారు, సమర్థులు అనేక మంది ఉన్నారన్నారు. తనకు సీఎం కావాలనే పిచ్చి ఆలోచనలు, ఎజెండాలు లేవన్నారు. కేసీఆర్ తమ నాయకుడని, ఈ విషయంలో బీఆర్ఎస్‌లో ఎవరికీ రెండో ఆలోచన లేదని చెప్పారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల ఆస్తి అన్నారు. కామారెడ్డి సహా ఆయన ఎక్కడ పోటీ చేసినా ప్రజలు ఆదరిస్తారని చెప్పారు.

సాక్షి, హైదరాబాద్: "శివసేనతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ తెలంగాణలో సెక్యులర్ విలువల గురించి మాట్లాడటం విడ్డూరం. మేం ఎవరికీ బీ టీమ్ కాదు. కాంగ్రెస్ పార్టీయే చోర్ టీమ్. మైనారిటీలను పేదరికంలో ముంచిందే కాంగ్రెస్ పార్టీ. పార్లమెంటులో కౌగిలించుకున్న కాంగ్రెస్, బీజేపీ ఆలుమగలు లాంటివి. కేసీఆర్‌ను విమర్శించడంలో రాహుల్, మోదీలది ఒకే గొంతు. మోదీ, రాహుల్ తెలంగాణ ఆత్మగౌరవం మీద దాడి చేస్తున్నారు. రోషం లేని బానిసలు మాత్రమే కాంగ్రెస్, బీజేపీ వెంట నడుస్తారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు పేర్కొన్నారు. ముస్లిం పార్టీ అని ఎంఐఎం ఎక్కడా చెప్పుకోలేదని.. అయినా ఎంఐఎంతో తమకు పొత్తులేదని చెప్పారు. శనివారం ఆయన ప్రగతిభవన్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అభ్యర్థుల ఖరారు, బీఫారాల పంపిణీ, ప్రచారంలో ముందున్న బీఆర్ఎస్ ఎన్నికల ఫలితాల్లోనూ ముందు ఉంటుందని కేటీఆర్ చెప్పారు. అక్కడక్కడా బీఆర్ఎస్ అభ్యర్థుల మీద అసంతృప్తి ఉన్నా సీఎం కేసీఆర్ మీద ప్రజలు అచంచల విశ్వాసం చూపుతున్నారన్నారు. గతంలో సాధించిన 88 సీట్ల కంటే ఈసారి ఎక్కువే సాధిస్తామన్నారు.

కాంగ్రెస్‌వన్నీ కలలు..

అధికారంలోకి వస్తామని కలలు కనడం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని.. కాంగ్రెస్‌కు 40 నియోజకవర్గాల్లో అభ్యర్థులు లేక వెతుకులాడుతోందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌తో కొంత పోటీ ఉన్నా ఆ పార్టీ చరిత్ర, పనితీరు వారికి గుదిబండగా మారిందని పేర్కొన్నారు. "ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కూడా పక్కనపెట్టి రాహుల్‌గాంధీ ఏ హోదాలో తెలంగాణ ప్రజలకు హామీలు ఇస్తున్నారు. ఉదయ్‌పూర్, వరంగల్ డిక్లరేషన్లను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ఇచ్చే హామీలకు గ్యారంటీ ఎక్కడుంది? అన్ని రంగాల్లోనూ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల కంటే తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. తెలంగాణ కంటే మెరుగైన నమూనాను కాంగ్రెస్, బీజేపీ అందించలేవు.." అని కేటీఆర్ పేర్కొన్నారు. బీజేపీ యుద్ధానికి ముందే చేతులెత్తేసి రేసు నుంచి తప్పుకుందని విమర్శించారు. పసుపుబోర్డు, గిరిజన యూనివర్సిటీ వంటివి బీజేపీ ఆపద మొక్కులని ప్రజలు గుర్తించారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై ఆర్థిక ఆంక్షలు విధిస్తూ ప్రజల దృష్టిలో బీఆర్ఎస్‌ను చెడుగా చూపే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. బీజేపీ వెకిలి రాజకీయాలను నిలువరించేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తామని చెప్పారు. బీజేపీ తెలంగాణలో ఒక్క సీటుకు మాత్రమే పరిమితమయ్యే సూచనలు కనిపిస్తున్నాయని.. రాష్ట్రంలో బీజేపీ దుకాణం బంద్ అవుతుందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రాంతీయ పార్టీల కూటమికి జాతీయ పార్టీలు బయట నుంచి మద్దతు ఇవ్వాల్సిన పరిస్థితి వస్తుందేమోనని వ్యాఖ్యానించారు.

వ్యక్తులు కాదు.. వ్యవస్థ ముఖ్యం

నాయకులు పార్టీ మారినంత మాత్రాన ఓటర్లు మారబోరని.. గతంలో బీఆర్ఎస్‌లో ఖమ్మం నేతలు ఎంతోమంది నాయకులున్నా అక్కడ ఒక్క సీటు మాత్రమే వచ్చిందని కేటీఆర్ చెప్పారు. ఈసారి కొందరు నాయకులు బయటికి వెళ్లినందున ఎక్కువ సీట్లు సాధిస్తామన్నారు. ప్రజలు ఎటువైపు ఉన్నారన్నదే ముఖ్యమన్నారు. నాయకులు వెళ్లినా ఎటువంటి ప్రతికూల ప్రభావం లేదని ఇటీవల మంథని, రామగుండంలలో తమ పార్టీ నిర్వహించిన అంతర్గత సర్వేలలో తేలిందని చెప్పారు. ఆలోచించి, తర్కించి, చర్చించాక గెలిచే అభ్యర్థులకు టికెట్లు ఇచ్చామని.. ఖమ్మంలో కొందరు నాయకులు పార్టీని శాసించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. వ్యక్తులు కాదు వ్యవస్థ ముఖ్యమనే ఉద్దేశంతో కఠిన నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. స్వల్ప సంఖ్యలో అభ్యర్థులను మార్చినా ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు పార్టీ మారారని.. రాజకీయాల్లో ఎవరితోనూ జీవిత కాల ఒప్పందాలు ఉండవని స్పష్టం చేశారు. బడ్జెట్ సామర్థ్యాన్ని బట్టి దళితబంధు, ఇతర పథకాలను క్రమపద్ధతిలో అందరికీ వర్తించేలా చూస్తామని కేటీఆర్ చెప్పారు. మేనిఫెస్టోను దసరా పండుగ తర్వాత ప్రజల్లోకి బలంగా తీసుకెళతామని.. దీనిపై పార్టీ ఇన్‌చార్జులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో బయటికి వెళ్లిన కొందరు ఉద్యమకారులతో మాట్లాడి పార్టీలోకి ఆహ్వానిస్తున్నామన్నారు.

ప్రవల్లిక కుటుంబాన్ని ఆదుకున్నాం

కొందరు ప్రవల్లిక ఆత్మహత్యను రాజకీయం చేయాలని చూస్తే.. తాము మానవీయంగా ఆదుకున్నామని కేటీఆర్ చెప్పారు. ముదిరాజ్‌లకు భవిష్యత్తులో రాజ్యసభ, శాసనమండలి, ఇతర పదవుల్లో ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే పారదర్శకంగా పనిచేస్తోందని.. ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని ప్రయత్నించినా ప్రతిపక్షాలు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నాయని ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక టీఎస్‌పీఎస్సీ లోపాలను సవరించి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామన్నారు. బీసీ కులగణన గురించి ఇప్పటికే పార్టీ ప్లీనరీలో, అసెంబ్లీలో తీర్మా నం చేశామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

కాంగ్రెస్‌లో ఇంకా ఎదురుచూపులే!

- అభ్యర్థుల ఎంపికపై ఏకాభిప్రాయానికి రాని స్క్రీనింగ్ కమిటీ
- తుది జాబితాపై మరోసారి భేటీ కావాలని నిర్ణయం
- దసరా తర్వాతే అభ్యర్థుల ప్రకటన ఉంటుందన్న పార్టీ వర్గాలు
- ఢిల్లీలో కేసీ వేణుగోపాల్ నివాసంలో స్క్రీనింగ్ కమిటీ భేటీ
- అభ్యర్థులు, వామపక్షాలతో పొత్తులపై సుదీర్ఘంగా చర్చలు
- మిగతా అన్ని సీట్లకు ఒకేసారి అభ్యర్థులను ప్రకటిస్తామన్న ఠాక్రే



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థుల ఖరారు మరింత జాప్యం అవుతోంది. ఇప్పటికే 55 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినా.. మిగతా సీట్లపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతూనే ఉంది. మిగిలిన అభ్యర్థులందరితో శనివారం ఒకేసారి తుది జాబితా ప్రకటిస్తామని కాంగ్రెస్ పెద్దలు తొలుత పేర్కొన్నా... వామపక్షాలతో పొత్తు, మిగతా అభ్యర్థుల ఖరారుపై కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. కొన్ని నియోజకవర్గాల విషయంలో నెలకొన్న పోటీ ఓవైపు.. కమ్యూనిస్టు పార్టీలు అడుగుతున్న సీట్లలో పోటీకి కాంగ్రెస్ అభ్యర్థులు సిద్ధంగా ఉండటం మరోవైపు ఈ పరిస్థితికి కారణమని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి. కమ్యూనిస్టులకు సీట్లు కేటాయించే అంశంలో కమిటీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయని అంటున్నాయి. దీంతో పోటీ తీవ్రంగా ఉన్న నియోజకవర్గాల అభ్యర్థులను ఢిల్లీకి పిలిచి మాట్లాడాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు కాంగ్రెస్ తుది జాబితా ఖరారు కోసం మరోసారి భేటీ కావాలని స్క్రీనింగ్ కమిటీ నిర్ణయించింది.

సుదీర్ఘంగా చర్చించినా తేలని లెక్క

కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు 55 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేసింది. మిగతా చోట్ల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై పార్టీ రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ శనివారం ఢిల్లీలో భేటీ అయింది. కమిటీ చైర్మన్ మురళీధరన్ నేతృత్వంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పార్టీ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే తదితరులు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో సమావేశమయ్యారు. రాత్రి 10 గంటల వరకు సుదీర్ఘంగా చర్చలు జరిపినా అభ్యర్థుల లెక్క తేలలేదు.

పోటీ ఎక్కువ ఉన్నచోట్ల పీటముడి

దాదాపు 20 నియోజక వర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై స్క్రీనింగ్ కమిటీ సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగినట్టు సమాచారం. పార్టీ మాజీ ఎంపీలు, పలువురు సీనియర్ నాయకులు పోటీకి సిద్ధమైన చోట్ల ఎవరి పేరు ఖరారు చేయాలన్న దానిపై పీటముడి పడినట్టు తెలిసింది. ఎల్లారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్, బాన్స్‌వాడ, డోర్నకల్ వంటి స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్టు సమాచారం. ఆయా నియోజకవర్గాల్లో వలస వాదులు, కాంగ్రెస్ వాదులనే వాదన కొనసాగుతోంది. దీనికితోడు కమ్యూనిస్టు పార్టీలు అడుగుతున్న మునుగోడు, వైరా, మిర్యాలగూడ, కొత్తగూడెం, చెన్నూర్, పాలేరు స్థానాలపై సందిగ్ధత కొనసాగుతోంది. మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, మధుయాష్కీ గౌడ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, షబ్బీర్ అలీ వంటి సీనియర్లు కోరుతున్న స్థానాల్లో పోటీ ఎక్కువగా ఉండటంతో.. ఆయా సీట్లపై స్క్రీనింగ్ కమిటీలో సమీక్షించినట్టు తెలిసింది.

పార్టీ సీఈసీ భేటీ తర్వాతే తుది జాబితా..

కేసీ వేణుగోపాల్ నివాసంలో భేటీ తర్వాత కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే మీడియాతో మాట్లాడారు. భేటీలో అభ్యర్థుల ఎంపికపై చర్చించామని, మరోసారి స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరిగే అవకాశం ఉందని తెలిపారు. రెండో జాబితాలోనే మిగతా అన్ని స్థానాల అభ్యర్థులను ఖరారు చేయాలని భావిస్తున్నట్టు వివరించారు. తుది జాబితాను కాంగ్రెస్ సీఈసీకి పంపిస్తామని, అక్కడ ఆమోదం పొందాక విడుదల చేస్తామని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీలతో చర్చలు కొనసాగుతున్నాయని, ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వివరించారు. తెలంగాణలో బీజేపీ పరిస్థితి ఏమిటో అందరికీ తెలుసని, ఏ వర్గానికి ఎన్ని సీట్లు అయినా ఇవ్వడానికి వారికి అసలు అభ్యర్థులు ఉంటే కదా అని విమర్శించారు. కేవలం కాంగ్రెస్ పార్టీనే అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు.

సెక్షన్ 22ఏ సమర్థనీయమే..

- ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ఆ నిబంధన ఉండాల్సిందే
- హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండాలంటే రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ ఉండాల్సిందేనని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం తేల్చిచెప్పింది. సెక్షన్ 22ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు తమ అధికారాన్ని వినియోగించుకోవచ్చని చెప్పింది. ప్రభుత్వ భూములు, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములను ఆక్రమించి అక్రమార్కులు రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ఉంది. ఇలా భూములు ఇతరులకు బదిలీ చేయడాన్ని రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22ఏ నిరోధిస్తుంది. సెక్షన్ 22ఏను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని శాసనసభ ఆమోదం ద్వారా చేర్చారు. అయితే ఈ సెక్షన్ 22ఏ చెల్లుబాటును సవాల్ చేస్తూ ఇన్వెక్టా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఇతరులు దాఖలు చేసిన పలు రిట్ పిటిషన్‌లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం కొట్టివేసింది.

వాదనలు సాగాయిలా..

రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 17ను.. సెక్షన్ 22ఏ ఉల్లంఘిస్తోందని, ఇది చట్టవిరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. 'ఉమ్మడి ఏపీలో మార్పు చేసిన చట్టంలోని నంబర్ 19కి రాష్ట్రపతి ఆమోదం లభించలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 245 ప్రకారం ఇది చెల్లుబాటుకాదు. సెక్షన్ 22ఏ ప్రకారం సదరు భూములపై శాశ్వత నిషేధాన్ని జారీ చేయడం, సెక్షన్ 17 ప్రకారం పిటిషనర్ హక్కులను ఉల్లంఘించడమే అవుతుంది' అని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. 'రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తూ శాసనసభ చట్టాలు చేస్తే.. వాటిని మాత్రమే సవాల్ చేయడానికి అవకాశం ఉంది. ఇతర చట్టాలను సవాల్ చేయలేరు. రిజిస్ట్రేషన్ చట్టంలో సెక్షన్ 22ఏను చేర్చిన తర్వాత రాష్ట్రపతి ఆమోదం పొందింది. ఏదైనా డాక్యుమెంట్ చట్టబద్ధతను నిర్ణయించే అధికారం అధికారులకు 22ఏ కింద ఇవ్వలేదు. అందువల్ల రాజ్యాంగంలోని ఆర్టికల్ 300ఏను ఉల్లంఘిస్తుందనే వాదన తప్పు. ఇది సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘిస్తున్నట్లు కాదు. నిషేధిత జాబితాలో ఎవరైనా బాధితులు ఉంటే చట్టంలోని సెక్షన్ 22ఏ(4) ప్రకారం పరిష్కరించుకోవచ్చు' అని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. సెక్షన్ 22ఏను సమర్థిస్తూ పలు రిట్ పిటిషన్లను కొట్టివేసింది.

అందుబాటులోకి మన 'ఆక్సిజన్-18'

మణుగూరు భారజల కర్మాగారంలో ఉత్పత్తి ప్రపంచ దేశాల సరసన భారత్

అశ్వాపురం: దేశ శాస్త్ర, పారిశ్రామిక రంగంలో భారత్ సరికొత్త చరిత్ర లిఖించింది. ఆక్సిజన్-18 ఐసోటోప్ సమృద్ధిగా ఉండే నీటిని ఉత్పత్తి చేసి ఈ సామర్థ్యంగల అతికొన్ని దేశాల సరసన నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని మణుగూరు భారజల కర్మాగారంలో ఆక్సిజన్-18 ఐసోటోప్ సమృద్ధిగా ఉండే నీటి ఉత్పత్తి జరుగుతోంది. ఇప్పటికే ఉత్పత్తి చేసిన ఈ నీటి నాణ్యత అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు దాన్ని వినియోగిస్తున్న సంస్థలు వెల్లడించాయి. అలాగే అమెరికాకు చెందిన ఓ ప్రైవేటు టెస్టింగ్ లేబొరేటరీ సైతం ఈ నీటిని నాణ్యమైనదిగా నిర్ధా రించింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ హెడ్ డాక్టర్ రాజేష్ వత్స ఓ ప్రకటన విడు దల చేశారు. కేన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలకు ఉప యోగించే పీఈటీ స్కాన్‌లతోపాటు జీవ క్రియలపై పరిశోధన, ఆమ్ల వర్షాల వంటి ప్రతికూల పర్యావరణ పరిస్థితులపై అధ్యయనం కోసం ఆక్సి జన్-18 ఐసోటోప్ సమృద్ధిగా ఉండే నీటిని విని యోగిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ నీటి కోసం భారత్ పూర్తిగా దిగుమతులపై ఆధారపడుతోంది.

చెన్నూర్‌కు వస్తే సుమన్‌ను గెలిపించడానికే!

సీపీఐ నారాయణతో కాంగ్రెస్ నాయకుడి సంభాషణ.. వైరల్‌గా ఫోన్ కాల్

జైపూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ అసెంబ్లీ సీటు సీపీఐకి కేటాయించినట్లుగా వస్తున్న వార్తలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. ఇప్పటికే 'సేవ్ కాంగ్రెస్.. సేవ్ చెన్నూర్'పేరిట నిరసన వ్యక్తం చేస్తున్నారు. సీపీఐ సీనియర్ నాయకుడు నారాయణకు మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఫయాజ్ ఫోన్ చేసి మాట్లాడిన ఆడియో సంభాషణ వైరల్‌గా మారింది. "సార్ నేను చెన్నూర్ నియోజకవర్గం నుంచి మాట్లాడుతున్నాను. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిని. మీరంటే చాలా గౌరవం. మీరు ఉద్యమనాయకులు.. సార్ మీరు చెన్నూర్ టికెట్ తీసుకుంటున్నారు.."అని అనగానే నారాయణ స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ కేటాయించిందని, ఏదైనా ఉంటే మీరు కాంగ్రెస్ పార్టీలో మాట్లాడుకోవాలని సూచించారు. "మీరు చెన్నూర్‌కి వస్తే బాల్క సుమన్‌ను గెలిపించడానికే వచ్చినట్లు అవుతుంది. మీరు ఎక్కడైనా గెలిచే కాడ కొట్లాడండి గెల్వనికాడ ఎందుకు.."అని ప్రశ్నించారు. దీనికి నారాయణ స్పందిస్తూ.. "నేను గెలిచినా ఓడిపోయినా నీకెందుకయ్యా! ఏదైనా ఉంటే మీరు కాంగ్రెస్ పార్టీతో మాట్లాడుకోండి.."అనగానే "అంటే మీరు బాల్క సుమన్‌తో కుమ్మక్కయినట్లే కదా అంటే.. నువ్వు అమ్ముడుపోయావ్.."అంటూ వారిద్దరి మధ్య ఘాటైన సంభాషణ సాగింది. ఈ ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

బీఆర్ఎస్‌కు ఎన్నికల్లో గుణపాఠం చెబుతాం

మాజీమంత్రి ఎం.రవీంద్రనాయక్



సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో గిరిజనుల జీవితాలు అధోగతి పాలయ్యాయని, గిరిజన బిడ్డలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తు న్నారని బీజేపీ నేత, మాజీమంత్రి ఎం.రవీంద్ర నాయక్ ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు రాక పోవడం, పలు పరీక్షలు రద్దవుతుండటంతో మన స్తాపానికి గురైన గిరిజన యువతి ప్రవల్లిక ఆత్మహ త్యకు పాల్పడిన ఘటనలోనూ ఒక లంబాడా పోలీసు అధికారిని ఉపయోగించుకుని మరో బంజారా బిడ్డ రాథోడ్‌ను బలిపశువును చేశారని ఆరోపించా రు. శనివారం పార్టీ నాయకులు వెల్లంగి రాజు, రవి నాయక్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రేమవ్యవహారం కారణంగా ఈ ఆత్మహత్య జరిగిందంటూ ప్రవల్లిక తల్లిదండ్రులను ప్రగతి భవన్‌కు పిలిపించుకుని ప్రభుత్వం నాటకం ఆడటాన్ని తెలంగాణ సమాజమంతా చూసిందన్నారు. ప్రభుత్వంపై విమర్శలు రాకుండా తప్పించుకునేందుకే దీనిని ప్రేమవ్యవహారంగా చిత్రీకరించారని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్‌కు గిరిజన, బంజారా సమాజం గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.

దసరా విరాళాలు ఇవ్వలేకపోతున్నాం!

పరిశ్రమల వద్ద నోటీసులు అంటించిన యాజమాన్యాలు



చౌటుప్పల్ మండలంలోని ఓ పరిశ్రమ వద్ద అంటించిన నోటీసు

చౌటుప్పల్: దసరా వచ్చిందంటే కంపెనీలకు దడదడ.. కొందరికి మాత్రం పండుగే.. ఎందుకంటే.. దసరా మామూళ్లు మామూలుగా ఉండవ్ మరి! యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పలు పరిశ్రమల వద్ద ప్రతి ఏటా ఇదే పరిస్థితి. కంపెనీల యాజమాన్యాలు దసరా పండుగ విరాళాల బాధలు భరించలేక ఈసారి చేతులెత్తేశాయి. అనివార్య కారణాల వల్ల ఈ ఏడాది విరాళాలు ఇవ్వలేకపోతున్నామంటూ ఏకంగా గేట్ల వద్ద నోటీసులు అంటించారు. దసరా పండుగ వచ్చిందంటే వివిధ వర్గాల వ్యక్తులు విరాళాల కోసం కంపెనీల వద్దకు వెళ్తుంటారు. స్థానికులే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం వస్తుంటారు. ఒక్కో సందర్భంలో కంపెనీల వద్ద విరాళాల కోసం గొడవలు సైతం జరుగుతుంటాయి. విరాళాలు తీసుకువెళ్లే వారు పదుల సంఖ్య నుంచి వందల సంఖ్యకు చేరారు. దీంతో యాజమాన్యాలు లక్షలాది రూపాయలు ఇవ్వాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు చేతులెత్తేశాయి. ఈ నోటీసులు చర్చనీయాంశంగా మారాయి.

రూ.307 కోట్లకు పెరిగిన జప్తులు

శనివారం రూ.18.01 కోట్ల నగదు, వస్తువుల స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: శాసనసభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు శనివారం నాడు రూ.18.01 కోట్లు విలువ చేసే నగదు, మద్యం, ఇతర వస్తువులను జప్తు చేశారు. దీంతో ఇప్పటి వరకు రాష్ట్రంలో జప్తు చేసిన నగదు, ఇతర వస్తువుల మొత్తం విలువ రూ.307.02 కోట్లకు పెరిగిపోయింది. శనివారం రూ.9.69 కోట్ల నగదు పట్టుకోగా, ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న మొత్తం నగదు రూ.105.58 కోట్లు. పూర్తి వివరాలను ఈ కింది పట్టికలో చూడవచ్చు.




ఇబ్రహీంపట్నంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

	శనివారం	మొత్తం
నగదు	రూ.9.69 కోట్లు	రూ.105.58 కోట్లు
మద్యం	రూ.1.35 కోట్లు (31,961 లీటర్లు)	రూ.13.58కోట్లు (72,302 లీటర్లు)
డ్రగ్స్	రూ.72.34లక్షలు (232కిలోల గంజాయి)	రూ.13.58 కోట్లు(3,672కిలోల గంజాయి)
బంగారం ఇతరాలు	రూ.3.81 కోట్లు (3.16కిలోల బంగారం)	రూ.145.67 కోట్లు(894.52కిలోల బంగారం)
ఇతర వస్తువులు	రూ.2.4 కోట్లు (18,460 కిలోల బియ్యం)	రూ.26.93 కోట్లు(1,89,202కిలోల బియ్యం)
మొత్తం	రూ.18.01 కోట్లు	రూ.307.02 కోట్లు

(ఇతర వస్తువుల్లో ల్యాప్‌టాప్, వాహనాలు, కుక్కర్లు, శారీలు ఉన్నాయి. బంగారం, ఇతరాలలో బంగారంతో పాటు వెండి, వజ్రాలు, ప్లాటినం వంటి విలువైన లోహాలున్నాయి)

జప్తు చేస్తే రసీదు తప్పనిసరి..

ఎన్నికల అధికారులతో సమీక్షలో సీఈఓ వికాస్‌రాజ్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ అక్కడక్కడా ఇంకా అసంపూర్తి ఛాయలు కనిపిస్తున్నాయని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈఆర్‌ఓలు, ఆర్‌ఓలు, సీనియర్ అధికారులతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నుంచి అక్కడక్కడా వస్తున్న ఫిర్యాదులను వారి దృష్టికి తెచ్చారు. జిల్లా గ్రీవెన్సెస్ కమిటీని అవసరాన్నిబట్టి సమావేశపరిచి హేతుబద్ధమైన కేసులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. జిల్లా ఫిర్యాదుల కమిటీ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రతి జప్తునకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా జప్తునకు సంబంధించి అసంతృప్తితో ఉంటే ఎవరికి అప్పీలు చేసుకోవాలో తెలియజేయాలన్నారు. నగదు, మద్యం, బంగారం వంటివి పట్టుబడ్డప్పుడు తప్ప కుండా రసీదులు ఇవ్వాలని రాష్ట్ర వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి మహేశ్ భగవత్ సైతం ఆదేశించారు. అసంపూర్తి నివేదికలు కాకుండా స్పష్టమైన తీర్మానాలు పంపాలని అదనపు సీఈఓ లోకేష్‌కుమార్ సూచించారు. వివిధ దరఖాస్తు ఫారాల వినియోగాన్ని జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్ వివరించారు. పోస్టల్ బ్యాలెట్ అవసరమైన వారి కోసం 12డీ ఫారాన్ని ప్రభుత్వ వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయాలని డిప్యూటీ సీఈఓ సత్యవాణి జిల్లా సీనియర్ అధికారులకు సూచించారు.

బీజేపీ నేతను హతమార్చిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో ఘటన

చర్ల: అసెంబ్లీ ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో దారుణానికి ఒడిగట్టారు. బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శిని కాల్చిచంపి భయోత్పాతం సృష్టించారు. జిల్లాలోని మొహ్లా-మాన్‌పూర్ మార్గంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన సర్కెడా గ్రామంలో నివాసముంటున్న బిర్జు తారమ్ ఇంటికి శుక్రవారంరాత్రి పదిమంది సాయుధులైన మావోయిస్టులు వచ్చారు. వీరిలో ముగ్గురు తారమ్‌పైకి మూడురౌండ్ల కాల్పులు జరిపారు. దీంతో ఆయన అక్కడే కుప్పకూలారు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం ఉదయం గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

వాగులో ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురు స్నేహితుల దుర్మరణం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మరణం కూడా వారి స్నేహబంధాన్ని విడదీయలేకపోయింది. ట్రాక్టర్ మరమ్మతుల కోసం బయలుదేరిన ముగ్గురు స్నేహితులని మార్గమధ్యలో మృత్యువు కబళించింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట రూరల్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఈటల రామన్న (45), మంగళి గోపాల్ (36), ఎంపల్లి మల్లేశం (30) ట్రాక్టర్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ముగ్గురికీ సొంత ట్రాక్టర్లు ఉన్నాయి. శనివారం ట్రాక్టర్ మరమ్మతులకోసం బయలుదేరిన రాజన్న ట్రాక్టర్‌లోనే మల్లేశం కూడా పంచర్ చేయించాల్సిన తన ట్రాక్టర్ టైరు ఎక్కించాడు. అనంతరం ముగ్గురూ సదాశివపేటకు పయనమయ్యారు. రామన్న ట్రాక్టర్‌ను నడుపుతుండగా కొల్లూరు శివారులో అదుపు తప్పి మంజీర నది బ్యాక్ వాటర్‌లో బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్ కింద చిక్కుకొని ముగ్గురూ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వారి కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కాగా ఘటనా స్థలం నుంచి మృతదేహాలను సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ నవీన్ తెలిపారు.



నదిలో నుంచి వెలికి తీసిన ముగ్గురి మృతదేహాలు, ట్రాక్టర్

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



పండగ ప్రయాణం.. ప్రమాద రహితం

దసరా సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లేవారితో హైవేలపై వాహనాల రద్దీ పెరిగింది. ఈ క్రమంలో రహదారి భద్రతపై వాహనదారుల్లో అవగాహన పెంచేందుకు ఆర్టీఏ అధికారులు చర్యలు చేపట్టారు.

-10లో

పోలీసు విధులపై వీడియో ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా నగర సీపీ సందీప్ శాండిల్య ప్రత్యేక వీడియో ఆవిష్కరించారు. పోలీసుల విధులను ఇందులో వివరించారు.

ధ్రువీకరణ పత్రం సమర్పించాలి

సాక్షి, సిటీబ్యూరో: జంటనగరాల పరిధిలోని ప్రభుత్వ పింఛనుదారులు నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు వార్షిక ధ్రువీకరణ పత్రం సమర్పించాలని నగర పింఛను చెల్లింపు కార్యాలయం సంయుక్త సంచాలకులు వసుంధర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువీకరణ పత్రంపై పాస్ ఫొటో అంటించి బ్యాంక్ అధికారి లేదా గెజిటెడ్ అధికారిచే సంతకం చేయించాలన్నారు.





సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు



జేబీఎస్‌లో..



ఎలాగైనా.. ఊరికి పోవాల్సిందే!

నగర దారులన్నీ పల్లెటూరు' దారి పడుతున్నాయ్. బస్సూ, రైలూ, కారూ, బైకూ.. ఏదైనా సరే ఊరికి పోవడమే లక్ష్యం. ఆదివారం సద్దుల బతుకమ్మ, సోమవారం దసరా పండగ కావడంతో శనివారం పట్నవాసులు పల్లెలకు పయనమయ్యారు. సొంతూరిని ఓసారి మనసారా చూసొద్దామని ఆశగా బయలుదేరారు. నగరంలోని ఎంజీబీఎస్, జేబీఎస్ తదితర బస్టాండ్లు, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. - సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్

అప్పుడేం చేశారు..?

ఇప్పుడేం చేస్తారు?

గల్లీ ప్రశ్నిస్తోంది..!

ఎన్నికల వేళ రాజకీయ పార్టీలపై బస్తీల అస్త్రాలు

- గ్రేటర్‌లో సుమారు 1,500 మురికి వాడలు, బస్తీలు
- మౌలిక సమస్యలపై పార్టీలకు ప్రశ్నావళి
- నేతలను నిలదీసేందుకు బస్తీ ప్రజల సమాఖ్య సన్నద్ధం



సాక్షి సిటీబ్యూరో: నగరంలో ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. ప్రధాన పార్టీలు సమరభేరి మోగించి కదన రంగంలో ప్రచారాస్త్రాలను సంధిస్తున్నాయి. సభలు, సమావేశాలు, భారీ ప్రదర్శనలు సమరోత్సాహంతో ఉన్నాయి. ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు పరుగులు తీస్తున్నాయి. ఈ క్రమంలోనే ఏళ్లకు ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధికి, సంక్షేమానికి నోచుకోని ఓటర్లు కూడా తమ వద్ద ఉన్న ఏకైక పాశుపతాస్త్రాన్ని సంధించేందుకు సన్నద్ధమవుతున్నారు. మౌలిక సమస్యలపై నిలదీసేందుకు, ప్రశ్నించేందుకు బస్తీ సంక్షేమ సంఘాలు సరికొత్త ప్రశ్నావళితో ముందుకొస్తున్నాయి. బస్తీలు, మురికివాడల్లో నివసించే ప్రజలను కేవలం ఓటు బ్యాంకులుగా భావించే పార్టీల ధోరణి మారాలంటున్నాయి. స్థానిక నాయకులు మొదలుకొని బరిలోకి దిగిన అభ్యర్థుల వరకు బస్తీల్లోకొచ్చే వారిపై ఈ ప్రశ్నాస్త్రాలను సంధించనున్నారు.

బస్తీలపై వివక్ష ఎందుకు?

బస్తీలు అంటే వెంటనే గుర్తుకొచ్చేది కంకర తేలిన సిమెంట్ రోడ్లు, ఇరుకు గల్లీలు. ఒకదానికొకటి అతికించినట్లుగా ఉండే అగ్గిపెట్టెల్లాంటి ఇళ్లు. వాటిని ఆనుకొని నురగలు కక్కుతూ ప్రవహించే నాలాలు. ముక్కుపుటాలదిరే దుర్గంధం గుర్తుకొస్తుంది. దోమల స్వైరవిహారం కళ్ల ముందు కనిపిస్తుంది. ఫుట్‌పాత్‌లు, పేవ్‌మెంట్‌లను ఆశ్రయించుకొని జీవనం సాగించే చిరువ్యాపారులు కనిపిస్తారు. దశాబ్దాలుగా అనేకసార్లు ఎన్నికలొచ్చాయి. కానీ బస్తీ ముఖచిత్రం మారలేదు. మరోసారి ఎన్నికలు వచ్చాయి. అన్ని గల్లీల్లో ఇప్పుడు పార్టీల జెండాలు ఎగురుతున్నాయి. మైకుల్లో ప్రచారం హోరెత్తుతోంది. నాయకులు హామీలు గుప్పిస్తున్నారు. ఈ హామీలు అప్పుడు, ఇప్పుడు, భవిష్యత్‌లోనూ ఉంటాయని బస్తీవాసులకు తెలుసు. అందుకే 'గత ఎన్నికల్లో ఓటేస్తే ఏం చేశారు. ఇప్పుడు ఓటెందుకు వేయాలి' అనే మౌలికమైన ప్రశ్నతో వివిధ పార్టీల నాయకులను నిలదీసేందుకు బస్తీ సంఘాలు, కాలనీ సంఘాలు సన్నద్ధమవుతున్నాయి.

- గ్రేటర్‌లో సుమారు 1,500కు పైగా మురికి వాడలు, బస్తీలు ఉన్నాయి. లక్షలాది మంది నివసించే ఈ మురికివాడలే అన్ని రాకీయ పార్టీలకు ప్రధాన ఓటుబ్యాంకులు. బాధ్యతగా ఓటు వేసేది కూడా వాళ్లే. ఈ నేపథ్యంలో అనేక సంవత్సరాలుగా బస్తీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం, వారి నివాస హక్కుల కోసం పోరాడుతున్న హైదరాబాద్ బస్తీ ప్రజల సమాఖ్య వివిధ పార్టీల అభ్యర్థులపై ఈ అస్త్రాలను సంధిస్తోంది. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించే ఎమ్మెల్యే కావాలి? అని హైదరాబాద్ బస్తీ ప్రజల సమాఖ్య ప్రతినిధి బ్రదర్ వర్గీస్ అన్నారు.

ఇప్పటి వరకు ఏం చేశారు?

స్థానిక సమస్యల పట్ల ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు బస్తీసంఘాలు విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. కరపత్రాలను పంపిణీ చేస్తున్నాయి. ఇప్పటి వరకు గెలిచిన ఎమ్మెల్యేలు ఎన్నిసార్లు బస్తీల్లో పర్యటించారు. ఏయే సమస్యలను పరిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలేంటి అనే అంశాలపై చర్చిస్తున్నారు. బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యేలకు ఏ మేరకు అవగాహన ఉందనే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని బస్తీ సంఘాలు భావిస్తున్నాయి. డబుల్‌బెడ్రూం ఇళ్ల మంజూరుపైనా ప్రశ్నించనున్నారు.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

- బస్తీల్లో ప్రచారానికి వచ్చే నాయకులను, పార్టీలను నిలదీసేందుకు బస్తీ సంఘాలు సిద్ధం చేస్తున్న ప్రశ్నావళి ఇలా ఉంది.
- బస్తీ ప్రజల ఉపాధి కోసం ఎలాంటి అవకాశాలు కల్పిస్తారు. ఎప్పటి వరకు ఇళ్లు కట్టించి ఇస్తారు. బ్యాంకుల నుంచి రుణసదుపాయం కల్పిస్తారా?
- వర్షాకాలంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి మీ వద్ద ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయి. బస్తీలు నీటమునగకుండా ఎలాంటి ఏర్పాట్లు చేస్తారు?
- నగరంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో పేదప్రజలకు ఇళ్లు కట్టించి ఇచ్చేందుకు మీరు సిద్ధమేనా?
- బస్తీల్లోని యువతను నిర్వీర్యం చేసేందుకు మోహరించి ఉన్న మాదకద్రవ్యాల అమ్మకాలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?
- నాలాలను కబ్జా చేసిన వాళ్లను, బస్తీల్లో ప్రజలపై దౌర్జన్యం చేసే వారిని కట్టడి చేయగలరా?
- వరదల నివారణకు ఎలాంటి కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తారు?
- వివిధ రకాల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం మంజూరు చేసే నిధులను పారదర్శకంగా ప్రజల ముందు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారా?
- గత ఎన్నికల్లో మీ పార్టీ ఇచ్చిన హామీలు గుర్తున్నాయా? ఇప్పుడు కొత్తగా ఎలాంటి హామీలు ఇస్తున్నారు? హామీలను నిలబెట్టుకోలేని పార్టీలకు ఓటెందుకు వేయాలి?

గీత దాటొద్దు!

పార్టీలు.. అభ్యర్థులకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రచార పర్వం, సభల్లో ఎన్నికల ప్రవర్తన, నియమావళిని అనుసరించి రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు జిల్లా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని సూచించింది.

మార్గదర్శకాలిలా ఉన్నాయి..

- ప్రచారం, సభల్లో రాజకీయ పార్టీ, అభ్యర్థి కుల, మత, భాషా ద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దు. ఎన్నికల ప్రచారంలో విధానాలు, పథకాలు, కార్యక్రమాలపై మాత్రమే విమర్శలుండాలి. వ్యక్తిగత జీవితంపై విమర్శలు చేయకూడదు. కుల, మత ప్రాతిపదికన ఓట్లు అడగటం, మందిరాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థనా ప్రదేశాలను ఎన్నికల ప్రచారానికి వాడుకోవద్దు.
- ఓటు కోసం డబ్బులు ఇవ్వడం, బెదిరించటం నిషేధం. ఒక వ్యక్తి ఓటును మరొక వ్యక్తి వేయటం చట్ట వ్యతిరేకం. సంబంధిత వ్యక్తుల అనుమతి లేనిదే వాళ్ల భూములు, భవనాలను ప్రచారానికి ఉపయోగించకూడదు. ఇతర పార్టీల ఎన్నికల ప్రచారాలకు, సమావేశాలకు ఆటంకం కలిగించకూడదు.
- ఎన్నికల ప్రచార సమావేశాలకు పోలీసుల నుంచి ముందుగా లిఖితపూర్వకంగా అనుమతి పొందాలి. నిషేధాజ్ఞలు, ఆంక్షలున్న ప్రదేశాల్లో సమావేశాలు నిర్వహించకూడదు. ఎన్నికల సమావేశాల్లో మైక్, లౌడ్ స్పీకర్ల వినియోగానికి ముందుగా అనుమతి తీసుకోవాలి. సమావేశానికి ఎవరైనా ఆటంకం కలిగిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.
- ఊరేగింపులు, ప్రదర్శనల రూటు మ్యాప్‌ను ముందుగానే పోలీసులకు చెప్పాలి. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఊరేగింపులు, ప్రదర్శనలు నిర్వహించాలి.
- ఎన్నికల ప్రచారంలో ఎలాంటి దిష్టిబొమ్మల దహనం చేయరాదని పేర్కొంది.
- మంత్రులు పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించకూడదు. అధికార పార్టీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని అధికారిక పర్యటనలతో కలిపి చేయరాదు. అధికార యంత్రాంగాన్ని కూడా వాడుకోవద్దు. ప్రభుత్వ వాహనాలు వినియోగించవద్దు. అతిథి గృహాలు అందరికీ ఇవ్వాలి. వీటిపై ఎవరి పెత్తనం ఉండొద్దు. రోడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని వాగ్దానాలు చేయొద్దు.
- ఉద్యోగుల బదిలీలపై పూర్తి నిషేధం ఉంటుంది. మంత్రులు ఎన్నికల అధికారులను పిలవకూడదు. ప్రైవేటు పనిపై వచ్చిన మంత్రులను ఏ అధికారి కలవకూడదు. మంత్రులు పైలట్ కార్లు, ఎర్ర బుగ్గ కార్లు ఉపయోగించకూడదు. ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేయొద్దు. కొత్త పనులు చేపట్టకూడదు. ఆమోదం తెలపకూడదు.

తాగిన మైకం.. ఆటో బీభత్సం

- ప్రమాదంలో ఓ మహిళ మృతి
- పలువురికి తీవ్ర గాయాలు
- డ్రైవర్‌ను చితకబాదిన స్థానికులు



ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలింపు

జీడిమెట్ల: ఆటో డ్రైవర్ తప్పతాగి ఆటో నడుపుతూ ఢీకొట్టడంతో ఓ మహిళ మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల, ప్రత్యక్షసాక్షుల వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 7 గంటలకు కూకట్‌పల్లికి చెందిన ఆటో డ్రైవర్ రాజు మద్యం తాగి ఆటో నడుపుతూ చింతల్ నుండి కుత్బుల్లాపూర్ వైపు వస్తున్నాడు. ఈక్రమంలో ఆటోను వేగంగా నడిపి కుత్బుల్లాపూర్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బైకుపై ఉన్న భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు కిందపడిపోయారు. ఈ ప్రమాదంతో కంగారుపడిన రాజు మరింత వేగంగా ఆటోను నడపగా...కొద్ది దూరం వెళ్లాక మరో బైకును, ముగ్గురు మహిళల్ని ఢీకొట్టడంతో వారంతా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలిస్తుండగా సంతోషి (35) అనే మహిళ మార్గమధ్యలో మృతి చెందింది. ఈ ప్రమాదాలను గమనించిన స్థానికులు ఆటో డ్రైవర్‌ను పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. గాయపడిన మరికొందర్ని పోలీసులు, స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు.

డబ్బే డబ్బు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ తనిఖీలలో 178 మంది నుంచి రూ. 7,97,87,782 సీజ్ చేసినట్లు కలెక్టర్ భారతి హోళికేరి ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో 77 కేసులకు అప్పీల్ చేసుకోగా, 34 కేసులు పరిష్కరించి రూ.1,25,66,074ల నగదును విడుదల చేసినట్లు తెలిపారు. రూ.10 లక్షలకు పైగా ఉన్న కేసును ఇన్ కమ్ టాక్స్ విభాగానికి అప్పగించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సీజ్ చేసిన నగదు విడుదలకు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగదు సీజ్‌కు గురైన వారు పూర్తి ఆధారాలతో జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సంప్రదించాలని సూచించారు. మిగిలిన వ్యక్తులు కూడా సీజ్ చేసిన నగదుకు సంబంధించి ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పించి తమ డబ్బును విడుదల చేసుకోవాలని సూచించారు.

ఇష్టంగా 'కస్టమైజ్డ్'

ఎన్నికల ప్రచార రథాలు సిద్ధం

సాక్షి, సిటీ బ్యూరో: శాసనసభ ఎన్నికలు సమీపస్తుండటంతో అన్ని రాజకీయ పార్టీలు ప్రజలకు చేరువయ్యేందుకు సిద్ధమయ్యాయి. యువత, ప్రవాస ఓటర్లను ఆకర్షించేందుకు సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేస్తుండగా.. మహిళలు, వృద్ధులను చేరుకునేందుకు బహిరంగ ప్రచారం, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రచార రథాలకు డిమాండ్ ఏర్పడింది. కస్టమైజ్డ్ వాహనాల రూపకల్పనపై నేతలు దృష్టి సారిస్తున్నారు. ఎన్నికల ప్రచారానికి వాహనాలను డిజైన్ చేయడంలో డెక్కన్ కోచ్ బిల్డర్స్ పెట్టింది పేరు. 1973 నుంచి ఈ కంపెనీ రాజకీయ పార్టీలు, నేతలకు కస్టమైజ్డ్ వాహనాలను తయారు చేసి ఇస్తుంది. ఇప్పటికే 8 కస్టమైజ్డ్ వాహనాలను తయారు చేసి వినియోగదారులకు అందించామని సంస్థ ప్రతినిధి ఒకరు తెలిపారు.

రూపకల్పన ఇలా..

వాహనాన్ని కస్టమైజ్డ్ చేయడానికి 3 రోజుల సమయం పడుతుంది. వాహనానికి పోడియం, బుల్లెట్ ప్రూఫ్ స్టేజ్, ఫ్లడ్ లైట్లు, ఆడియో స్పీకర్లు, వీఐపీ లైటింగ్, లార్జ్ స్క్రీన్, కెమెరా, పార్టీ గుర్తులు, బ్యాకిట్ పోస్టర్ వంటివి ఏర్పాటు చేస్తారు. వాహనం చుట్టూ పార్టీ లోగో ప్రకాశిస్తూ కనిపించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. దీని చుట్టూ కెమెరాలను బిగిస్తారు. ఇవన్నీ సైలెంట్ జనరేటర్ సహాయంతో పనిచేసేలా ఏర్పాట్లు చేస్తారు. ఈ అదనపు ఫీచర్లను బోల్ట్, నట్లతో బిగిస్తారు. దీంతో ఎన్నికలు, ప్రచారం పూర్తయ్యాక వీటిని తొలగించేందుకు వీలుంటుంది. దీంతో వాహనం మళ్లీ యథావిధిగా తయారవుతుంది. చిన్న వాహనాలను కస్టమైజ్డ్ క్యాంపెయిన్ వెహికిల్‌గా మార్చేందుకు రూ.3 లక్షల నుంచి రూ.12 లక్షలు వరకు ఖర్చవుతుంది. పెద్ద వాహనాలకైతే రూ.కోటి వరకూ వ్యయం అవుతుంది.

జోరుగా ఫిరాయింపులు

అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు

- నేడిక్కడ.. రేపెక్కడో..
- అసంతృప్తులకు గాలం
- ఇప్పటికే కొందరు..
- వీరి బాటలో మరికొందరు



ఎంపిక పూర్తి చేసే సమయానికి ఏ పార్టీ నేత ఎక్కడ ఉంటారో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే వివిధ పార్టీల్లోని అసంతృప్త నేతలను ఆకర్షించేందుకు అన్ని పక్షాలు ప్రయత్నాలు చేస్తుండటంతో ఫిరాయింపుల పర్వం కొనసాగుతోంది.

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులు జోరందుకుంటున్నాయి. అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడిన నేతలతో పాటు కొందరు ఏళ్ల తరబడిగల అనుబంధాన్ని తెంచుకొని ప్రత్యర్థి పార్టీలోకి వెళ్తున్నారు. అధికార బీఆర్‌ఎస్‌తో పాటు కరడుగట్టిన కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం వెనుకాడటం లేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇప్పటికే అధికార బీఆర్‌ఎస్ నాంపల్లి, గోషామహల్ మినహా అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్ పార్టీ తొలి జాబితాలో కొన్ని స్థానాల అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. రెండో జాబితాలో మరి కొన్ని స్థానాల అభ్యర్థిత్వాలు ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి టికెట్ ఆశించి భంగపడిన కొందరు పార్టీలు ఫిరాయించారు. మరికొందరు రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా పార్టీలో కొనసాగాలా? బయటకు వెళ్లిపోవాలా? అనే డైలమాలో పడ్డారు. ఇక ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థుల

కాంగ్రెస్‌లోకి...

నగర శివారులోని మేడ్చల్‌కు చెందిన బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎం. శరత్ చంద్రారెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరో బీఆర్‌ఎస్ నేత నక్కా ప్రభాకర్ గౌడ్‌లో కాంగ్రెస్‌లో చేరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ టికెట్ ఆశించిన జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌లీడర్ మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ , హఫీజ్ పేట కార్పొరేటర్ గా ఉన్న ఆయన భార్య పూజితలు కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ నేత బండి రమేశ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఎల్‌బీనగర్ టికెట్ ఆశించిన ముద్దగాని రామ్మోహన్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీలో ఉప్పల్ టికెట్ ఆశించిన భంగపడిన రాగి లక్ష్మారెడ్డి ఆ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరగా, అదే నియోజకవర్గానికి చెందిన సోమశేఖర్‌రెడ్డి తన భార్య ఎస్‌ఆర్‌నగర్ కార్పొరేటర్ శిరీషారెడ్డితో కలిసి కాంగ్రెస్‌ను వీడారు.



కొత్తపేటలో...

పూల ధరలకు రెక్కలు

సద్దుల బతుకమ్మ, దసరా నేపథ్యంలో డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: సద్దుల బతుకమ్మ, విజయదశమి నేపథ్యంలో పూలు, గుమ్మడికాయల ధరలకు రెక్కలొచ్చాయి. నగరంలోని గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌లో సాధారణ రోజుల్లో కిలో బంతిపూల ధర రూ.40 నుంచి రూ.60 పలికితే.. శనివారం ఏకంగా రూ.150కి చేరింది. చామంతి సాధారణ రోజుల్లో కిలో రూ.80లోపే ఉండగా, తాజాగా రూ.250పైగా ఎగబాకింది. రిటైల్ షాపుల్లో ఇవే పూలకు రూ.400పైగా డిమాండ్ ఏర్పడింది. గులాబీ పూల ధరలదీ ఇదే పరిస్థితి. వాహన, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ఆయుధ పూజకు ఎక్కువగా ఉపయోగించే మంచి గుమ్మడి కాయ (మీడియం సైజు) సాధారణ రోజుల్లో రూ.వందలోపే లభించేది. తాజాగా వీటి ధర రూ.150 నుంచి రూ.200కు పెరిగింది. బూడిద



గుమ్మడి కాయ సాధారణ రోజుల్లో సైజును బట్టి రూ.100 నుంచి రూ.150కే లభించేది. ప్రస్తుతం చిన్న సైజు కాయ ధర సైతం రూ.150 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు. సద్దుల బతుకమ్మ, విజయ దశమి నేపథ్యంలో శనివారం నగరంలోని పూలు, పండ్లు, ఇతర మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరిట మోసగించారు



నిందితులకు ఇచ్చిన నగదు ఫోటో చూపిస్తున్న బాధిత ఎన్ఆర్ఐలు

- ఇద్దరు ఎన్ఆర్ఐల ఆవేదన
- పోలీసులకు ఫిర్యాదు

పంజగుట్ట: రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో తమను కొందరు వ్యక్తులు మోసగించారని ఇద్దరు ఎన్ఆర్ఐలు ఆరోపించారు. ఈ మేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్ట్రేలియన్ సీనియర్ సిటిజన్ డాక్టర్ ప్రకాష్ పొట్లూరి, అమెరికన్ సీనియర్ సిటిజన్ మారియా ఇగ్నేషియాలు మాట్లాడుతూ తాము ఆస్ట్రేలియాలో స్థిరపడ్డామని, 2020 జనవరిలో కొచ్చిలో జరిగిన ఓ అంతర్జాతీయ సదస్సుకు హాజరై..హైదరాబాద్‌ను సందర్శించామని చెప్పారు. ఈ సమయంలో సయ్యద్ ఖాజా అనే వ్యక్తి తమను పరిచయం చేసుకని..ఎంతో మంచివాడిలా నటించి..గుంటూరుకు చెందిన శ్రీనివాస్ గుంటుపల్లి, అతని భార్య పద్మజలతో పరిచయం చేయించాడని తెలిపారు. వారు తాము రియల్ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నామని చెప్పి మొదట రూ.2 కోట్లు, ఆ తర్వాత విడతలవారీగా మొత్తం రూ.5.82 కోట్లు తీసుకున్నారని తెలిపారు. తాము గ్రీన్‌కార్డు ఎక్స్‌పైర్ అవుతుందని చెప్పి 2021, జనవరిలో ఆస్ట్రేలియా వెళ్లిపోయామని చెప్పారు. ఆ తర్వాత ఫోన్ చేసినా స్పందించలేదని, డబ్బు విషయం అడిగితే చంపేస్తామని బెదిరించారని ఆరోపించారు. ఇదే విషయమై నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశామని, వారు కేసు నమోదు చేసుకుని ముగ్గురు నిందితులపై ఎఫ్ఐఆర్ చేశారని తెలిపారు.

పండగ ప్రయాణం..ప్రమాద రహితం

- రెండు మూడు రోజులుగా పెరిగిన దసరా రద్దీ
- రైళ్లు, బస్సులతో పాటు సొంత వాహనాల్లో ప్రయాణం
- రోడ్డు భద్రతపై ఆర్టీఏ ప్రత్యేక అవగాహన
- రహదారులపైన రద్దీ దృష్ట్యా ప్రమాదాలు పెరిగే అవకాశం
- నిరంతరం అప్రమత్తతే ఎంతో కీలకం..



సాక్షి, సిటీబ్యూరో: దసరా సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీ పెరిగింది. రెండు మూడు రోజులుగా నగరవాసులు సొంత ఊళ్లకు తరలివెళ్తున్నారు. రైళ్లు, బస్సులతో పాటు సొంత వాహనాల్లోనూ ఊళ్లకు వెళ్తున్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి తదితర పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణమధ్య రైల్వే సుమారు 600 వరకు ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. అలాగే ఆర్టీసీ సైతం 5 వేలకు పైగా అదనపు బస్సులను నడిపేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది. బస్సులు, రైళ్లలో రద్దీని దృష్టిలో ఉంచుకొని చాలా మంది సొంత వాహనాల్లో వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రత్యేకించి హైదరాబాద చుట్టుపక్కల జిల్లాలకు చెందిన నగరవాసులు కార్లు, ద్విచక్ర వాహనాలు, టాటా ఏస్‌లు వంటి వాహనాల్లో తరలి వెళ్తున్నారు. దీంతో ఇటు విజయవాడ, అటు కరీంనగర్, వరంగల్ హైవేలపైన వాహనాల రద్దీ పెరిగింది. ముఖ్యంగా దసరా నాటికి వాహనాల రాకపోకలు భారీగా పెరగనున్నాయి. దీంతో ఓవర్‌టేక్, ఏమరుపాటు, హైస్పీడ్ వంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నట్లు రవాణా అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో రహదారి భద్రతపైన వాహనదారుల్లో అవగాహన పెంచేందుకు చర్యలు చేపట్టారు.

అధిక వేగంతోనే ప్రమాదాలు....

- రోడ్డు ప్రమాదాల్లో సింహభాగం వాహనాల ఓవర్ స్పీడ్ వల్లనే జరుగుతున్నట్లు ఆర్టీఏ అంచనా. చాలా మంది వాహనదారులు త్వరగా గమ్యం చేరుకోవాలనే దృష్టితో అతివేగంతో నడుపుతారు. మరోవైపు వాహనంలో ప్రయాణం చేసేవారిని ఉత్సాహపరిచేందుకు కూడా స్పీడ్ పెంచేస్తున్నారు.
- హైవేల పైన గంటకు 80 కిలోమీటర్ల వేగం ఎంతో సురక్షితమని అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ అంతకంటే ఎక్కువ వేగంతో వెళ్లవలసి వస్తే ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు.
- రోడ్లన్నీ వాహనాల రద్దీతో నిండి ఉంటాయి. అలాగే పాదచారులు రోడ్డు దాటుతూంటారు. దీంతో అతివేగంతో వెళ్లే వాహనాన్ని అదుపు చేయడం కష్టమవుతుంది.

ఓవర్‌టేక్...తస్మాత్ జాగ్రత్త...

- రోడ్డు మలుపుల వద్ద, వంపులవద్ద వాహనాలను దాటి ముందుకు వెళ్లడం ప్రమాదకరం. అలాగే రోడ్డు కొంత దూరం వరకు కనిపించినప్పుడు ఓవర్‌టేక్ చేయకపోవడం మంచిది. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరగా ఉన్నప్పుడు, రోడ్డుపైన ఇతరత్రా అడ్డంకులు ఉంటే ఎట్టిపరిస్థితుల్లోనూ ఓవర్‌టేక్ చేయరాదు.
- సాధారణంగా స్నేహితులతో కలిసి లాంగ్‌జర్నీ చేసే యువత వాహనంలోనే మద్యం సేవిస్తారు. ఇలా సేవించి వాహనాలు నడుపడం చాలా ప్రమాదం. హైస్పీడ్ తరువాత ఎక్కువ ప్రమాదాలు మద్యం సేవించి వాహనాలు నడుపడం వల్లనే జరుగుతున్నట్లు ఆర్టీఏ విశ్లేషిస్తోంది.
- రహదారి భద్రతకు ముప్పు తెచ్చే మరో పరిణామం డ్రైవింగ్ నుంచి దృష్టిని మళ్లించడం. మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం, రోడ్డు నుంచి పక్కలకు చూడడం వంటివి ప్రమాదకరం.ఒక చేత్తో బండి నడుపుతూ మరో చేత్తో వాటర్ బాటిల్ తీసుకొని నీళ్లు తాగడం, వాహనంలో పిల్లల అల్లరి, రేడియో, సీడీ ప్లేయర్ వంటివి ఆపరేట్ చేయడం, స్క్రీన్‌పైన సినిమా చూడడం ఎంతో ప్రమాదకరమని అధికారులు పేర్కొన్నారు.పక్కన కూర్చున్నవాళ్లతో మాట్లాడినా, రోడ్డుకు రెండువైపులా ఉండే వ్యాపార ప్రకటనలు చూస్తూ బండి నడిపినా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంటుంది.

అలసిపోతే ఆపేయండి...

- రహదారి భద్రతా నిబంధనల మేరకు ప్రతి రెండు గంటలకు ఒకసారి కొద్దిసేపు ఆగి ప్రయాణం చేయాలి. దానివల్ల ఏకాగ్రతతో బండి నడిపేందుకు అవకాశం ఉంటుంది. అలాగే నిద్రలేమికి అవకాశం లేకుండా ముందు రోజు రాత్రి తగినంత నిద్రపోవాలి. బాగా అలసిపోయి వాహనాలు నడపడం వల్ల నిద్రలోకి జారుకొనే అవకాశం ఉంది. దీంతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంటుంది. ఒకే లేనులో ప్రయాణం చేయడం అన్ని వేళల్లో ఎంతో క్షేమం. లేన్‌లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటే కొద్దిసేపు ఆగితే మంచిది.

సంతోషంగా గమ్యం చేరండి



బంధుమిత్రులతో కలిసి ఎంతో సంతోషంగా ప్రయాణం చేస్తారు. అదే సంతోషంతో ఇంటికి చేరుకొని అందరూ కలిసి ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకోవాలంటే రోడ్డు భద్రతా నిబంధనలు తప్పకుండా పాటించాలి. ప్రయాణంలో జాగ్రత్తలు పాటించడమే కాదు.. ఇతరులకు కూడా అవగాహన కల్పించాలి. రోడ్డు భద్రతను ప్రతి వాహనదారుడు బాధ్యతగా భావించాలి. – డాక్టర్ పుప్పాల శ్రీనివాస్, ఉప రవాణా కమిషనర్, రవాణాశాఖ

బ్రెయిన్‌స్ట్రోక్‌కు ర్యాపిడ్ ఏఐతో ఉత్తమ చికిత్స

రాంగోపాల్‌పేట్: బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వ్యక్తికి ర్యాపిడ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ద్వారా అత్యుత్తమ చికిత్స అందించవచ్చని కిమ్స్ ఆస్పత్రి ఎండీ భాస్కర్‌రావు అన్నారు. శనివారం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని మెడికల్ డైరెక్టర్ సంబిత్ సాహు, న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మానస్ పాణిగ్రాహి, సీనియర్ న్యూరాలజిస్టులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సుభాష్ కౌల్, రేడియాలజి విభాగాధిపతి డాక్టర్ అనంతరామ్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వ్యక్తిని గోల్డెన్ అవర్‌లో తీసుకుని వచ్చి చికిత్స అందిస్తే మంచి ఫలితాలు వచ్చేవని, ఈ సాంకేతిక పరిజ్ఞానంతో గోల్డెన్ డేలో తీసుకుని వచ్చినా మంచి చికిత్స అందించే అవకాశం దక్కిందన్నారు. సుమారు 80 శాతం బ్రెయిన్ స్ట్రోక్‌లు మెదడులోని రక్తనాళం పూడుకుని పోవడం వలన సంభవించే ఎపిమిక్ స్ట్రోక్‌లేనని, దీని వలన మెదడుకు ఆక్సిజన్ సరఫరా ఆగిపోతుందన్నారు. సంప్రదాయ సీటీస్కాన్, ఎంఆర్ఐ స్కాన్లను కంటితోనే చూసి మెదడు ఎంత మేర దెబ్బతిందో అంచనా వేస్తారని దీని వలన పూర్తిస్థాయి కచ్చితత్వంతో ఉండదన్నారు. ఎంఆర్ఐకు ఈ సాఫ్ట్‌వేర్ అనుసంధానించడం ద్వారా మెదడులో కోర్ ప్రాంతం, పెనంబ్రా ప్రాంతాలను గుర్తించి వైద్యులు సమర్థవంతంగా చికిత్స అందిస్తారని వివరించారు.

'బైకర్'..బతుకమ్మలు..

సాక్షి, సిటీబ్యూరో:రయ్యిమంటూ బైక్‌ల మీద దేశాలన్నీ చుట్టేసే మహిళలు మన బతుకమ్మని చూసేందుకు మన దేశానికి వచ్చేశారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలతో పాటు అచ్చ తెలంగాణ పల్లెల్లో బతుకమ్మ సంబరాలనూ ఆస్వాదించారు. అమెరికా, జర్మనీ, థాయ్‌ల్యాండ్, ఫ్రాన్స్ తదితర దేశాలకు చెందిన 8 మంది రాష్ట్రానికి వచ్చారు. గత 14వ తేదీన మీట్ విమెన్ ఆఫ్ తెలంగాణ పేరిట 9 రోజుల పాటు మహబూబ్‌నగర్, వికారాబాద్,, నిర్మల్, వరంగల్, పోచంపల్లి వంటి ప్రాతాల్ని సందర్శించారు. ఘన పర్యాటకంతో పాటు మన బతుకమ్మ ఆటలూ ఆస్వాదించారు. ఈ పర్యటన శనివారంతో ముగిసింది. ఈ పండుగ–పర్యాటక యాత్రను తామంతా అద్భుతంగా ఆస్వాదించామని బైకర్ల బృంద సారథి ఫ్రెంచ్ మహిళ అలిసన్ గ్రుస్ చెప్పారు. వీరంతా.. ఆదివారం ట్యాంక్ బండ్ మీద జరిగే బతుకమ్మ సంబరాలలో పాల్గొని పండుగ పంచిన మధురానుభూతుల్ని పదిలం చేసుకోనున్నట్టు ఈ బైక్ టూర్‌లో నగరం నుంచి పాల్గొన్న బైకర్ జై భారతి తెలిపారు.



బతుకమ్మ వేడుకల్లో సీఎస్



అమీర్‌పేట: అమీర్‌పేటలోని నేచర్‌క్యూర్ ఆస్పత్రి ఆవరణలో శనివారం బతుకమ్మ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి హాజరయ్యారు. మహిళా అధికారులు, సాధారణ ప్రజలతో కలిసి ఆమె బతుకమ్మ ఆడారు. కాగా ఎన్నికల నేపథ్యంలో ఈ వేడుకలకు మీడియాను అనుమతించలేదు. అంతకు ముందు ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రీన్ మేళాను సీఎస్ సందర్శించారు. కార్యక్రమంలో కమిషనర్ హరిచందన, అడ్మినిస్ట్రేషన్ అధికారి అల్లం నిర్మల తదితరులు పాల్గొన్నారు. కాగా బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం వద్ద బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వేడుకలకు హాజరయ్యారు.

బీజేపీలోకి కానిస్టేబుల్ శ్రీశైలం ముదిరాజ్

మేడ్చల్ రూరల్: రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమకారులను సీఎం కేసీఆర్ అణచివేశాడని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో హైదరాబాద్‌లో సమైక్యాంధ్ర పేరుతో చేపట్టిన సభలో ఉద్యోగాన్ని సైతం లెక్కచేయకుండా 'జై తెలంగాణ' అంటూ నినాదాలు చేసిన కానిస్టేబుల్ శ్రీశైలం ముదిరాజ్ శనివారం శామీర్‌పేటలో ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ..తెలంగాణలో బీఆర్ఎస్‌ను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు అన్యాయం చేశారనడానికి కానిస్టేబుల్ శ్రీశైలం ముదిరాజ్ నిదర్శనమన్నారు.

'కూన'కు టిక్కెట్ ఖాయం?



కుత్బుల్లాపూర్: బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్‌కు కుత్బుల్లాపూర్ టిక్కెట్ ఖరారైనట్లు తెలిసింది. ఈ మేరకు శనివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, సునీల్ బన్సల్‌లు కూనకు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలియడంతో కార్యకర్తల్లో జోష్ కన్పించింది. పార్టీ ఇంకా అధికారికంగా అభ్యర్థులను ప్రకటించకున్నా..నేరుగా కొందరు అభ్యర్థులకు ఫోన్లు చేస్తూ సమాచారం ఇస్తున్నట్లు తెలిసింది. ఇదే విషయంపై శ్రీశైలంగౌడ్‌ను 'సాక్షి' పలకరించగా..ఫోన్ చేసిన విషయం వాస్తవమేనని పేర్కొన్నారు. దాదాపు టికెట్ ఖరారు కావడంతో ప్రచారాన్ని మరింత వేగం చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. తప్పకుండా కుత్బుల్లాపూర్ లో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

విద్యుత్ బకాయి చెల్లించాలన్నందుకు.. కత్తితో బెదిరింపు


బెదిరింపులకు పాల్పడుతున్న మహమ్మద్ ఉమర్

డబీర్‌పురా: పెండింగ్ విద్యుత్ బిల్లులను చెల్లించమన్నందుకు కత్తితో చంపుతానని బెదిరింపులకు పాల్పడిన కేసులో మీర్‌చౌక్ పోలీసులు ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పురానీ హవేలి ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఉమర్ గత మార్చి నుంచి ఇప్పటి వరకు రూ.9,348 విద్యుత్ బకాయిలను చెల్లించలేదు. దీంతో మొఘల్‌పురా విద్యుత్ కార్యాలయానికి చెందిన సిబ్బంది మహ్మద్ అబ్దుల్ సలీమ్ రుహి ఈ నెల 19వ తేదీన విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో మహమ్మద్ ఉమర్ కోపంతో..అబ్దుల్ సలీమ్‌కు ఫోన్ చేసి బెదిరించాడు. అనంతరం ఈ నెల 20వ తేదీన అబ్దుల్ సలీమ్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) జి.ఎల్.ఎన్.రాజు, షేక్ ఖలీల్‌తో కలిసి మహ్మద్ ఉమర్ ఇంటికి వెళ్లగా... అక్కడ మహ్మద్ ఉమర్ కత్తితో అబ్దుల్ సలీమ్‌ను చంపుతానంటూ దౌర్జన్యానికి దిగాడు. దీనిపై బాధితుని ఫిర్యాదు మేరకు మీర్‌చౌక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడు మహ్మద్ ఉమర్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మురళి ముకుంద్‌పై అట్రాసిటి కేసు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ మాజీ చైర్మన్ మురళీ ముకుంద్‌తో పాటు ఆయన తనయుడు ఆకర్ష్‌పై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదైంది. తనపై అత్యాచారం చేశాడంటూ ఓ యువతి (22) రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వీరిద్దరిపై ఐపీసీ సెక్షన్ 376(1), 324, 354, 354(బి), 354(సి),506, 509, రెడ్‌విత్ 109 కింద కేసు నమోదు చేశారు. బాధితురాలిని శుక్రవారం సాయంత్రం భరోసా సెంటర్‌కు పంపించగా తనపై బంజారాహిల్స్ రోడ్ నెం.12 మిథిలానగర్‌లో నివసించే మురళి ముకుంద్‌తో పాటు ఆయన కుమారుడు ఆకాష్ అత్యాచారం చేశారని, తాను దళితురాలినని వెల్లడించింది. దీంతో వీరిద్దరిపై అట్రాసిటి కేసు కూడా బంజారాహిల్స్ పోలీసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివరామ్‌ను కోర్టుకు తరలించిన చిక్కడపల్లి పోలీసులు

చిక్కడపల్లి: ప్రవల్లిక హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న శివరామ్‌ను చిక్కడపల్లి పోలీసులు శనివారం కోర్టుకు తరలించారు. శుక్రవారం శివరామ్‌కు రిమాండ్ విధిచేందుకు కోర్టు నిరాకరించడంతో చిక్కడపల్లి పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. కాగా శనివారం అడ్మిన్ ఎస్ఐ నాగరాజు తదితర సిబ్బంది శివరామ్‌ను కోర్టుకు తరలించారు.

క్లుప్తంగా...

ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

పంజగుట్ట: తెలంగాణ ఫార్మసిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సతీష్ రాయన వేన నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బత్తిన సత్యనారాయణ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు సతీష్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫార్మసిస్టులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని వారం దరినీ సంఘటితం చేసి వారి సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చనందుకు రాష్ట్ర అధ్యక్షునికి, కార్యవర్గానికి ధన్యవాదాలు తెలిపారు.

'క్లాతింగ్ స్టూడియో' ప్రారంభం



బంజారాహిల్స్: పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ప్రముఖ బ్రాండ్ల దుస్తులన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి స్టూడియో వన్ 12 పేరుతో జూబ్లీహిల్స్‌లో మల్టీబ్రాండ్ దుస్తుల క్లాథింగ్ స్టూడియోను శనివారం సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ మేఘన ప్రారంభించారు. భారతీయ, అంతర్జాతీయ బ్రాండ్ల శైలికి అనుగుణంగా పిల్లల ఫ్యాషన్లను దృష్టిలో పెట్టు కొని ఈ దుస్తులను తీర్చిదిద్దారు. పండుగల సీజన్ నేపథ్యంలో సరికొత్త డిజైన్‌తో పిల్లలను ఆకర్షించే దుస్తులను ఇక్కడ అందుబాటులో ఉంచారు.

23 నుంచి రొమ్ము కేన్సర్‌పై అవగాహన

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ సమీపంలో ఉన్న ఫెమ్మీకేర్ ఆసుపత్రిలో ఈనెల 23వ తేదీ నుంచి ఉచితంగా రొమ్ము కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆస్పత్రి నిర్వాహకురాలు డాక్టర్ ఫెహ్మీదాబాను తెలిపారు. శనివారం ఆస్పత్రిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి ఆస్పత్రిలోని రోగులకు రొమ్ము కేన్సర్‌ను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తాము రొమ్ము కేన్సర్‌పై చేపడుతున్న పోరాటంలో యువతులు, మహిళలు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఇందులో భాగంగానే ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సమాజంలోని ప్రతి 28 మందిలో ఒకరు రొమ్ము కేన్సర్ బారిన పడుతున్నారని, దీనిని ముందుగానే గుర్తించి మంచి ఫలితాలు ఉంటాయని తెలియజేశారు. నగరంలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అమీర్‌పేటలో బెనకా గోల్డ్ కంపెనీ ప్రారంభం



సనత్‌నగర్: అమీర్‌పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన బెనకా గోల్డ్ కంపెనీని సహజ నటి జయసుధ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బెంగుళూరులో అందిస్తున్న సేవలను చూసి తాను ఈ సంస్థ యాడ్‌లో నటించానన్నారు. బెంగుళూరులో తమ సేవలతో ఎంతో మంచి పేరు తెచ్చుకున్న బెనకా గోల్డ్ కంపెనీ హైదరాబాద్‌లో కూడా అందరి మన్ననలు అందుకోవాలని ఆకాంక్షించారు. సంస్థ ఎండీ భరత్‌కుమార్ మాట్లాడుతూ... అతి తక్కువ రోజుల్లోనే తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని బ్రాంచ్‌లు ప్రారంభించాలని కోరుకుంటున్నామని, 20 బ్రాంచ్‌ల ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు రూపొందించామన్నారు.



రాజరాజేశ్వరిగా పెద్దమ్మతల్లి



మాగంటి కాలనీలో శ్రీ మహాలక్ష్మి దేవిగా...



దుర్గా దేవిగా ఫిలింనగర్ రాజరాజేశ్వరి దేవి



దుర్గా దేవిగా శ్రీనగర్‌కాలనీ భ్రమరాంబికాదేవి



మహాలక్ష్మీ దేవిగా దైవసన్నిధానం అమ్మవారు

వైభవంగా శరన్నవరాత్రులు



ఎన్టీటీ నగర్‌లో దుర్గా మాత మండపంలో ఎమ్మెల్యే దానం తదితరులు



శ్రీ లలితాదేవిగా బంజారాహిల్స్ కనకదుర్గాదేవి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ తల్లి శనివారం శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం 18లోని శ్రీ సీతారామ స్వామి ఆలయంలో కొలువుదీరిన పర్వత వర్ధనీదేవి అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొలువుదీరిన శ్రీ భ్రమ రాంబికా దేవి అమ్మవారు దుర్గా దేవిగా దర్శనమిచ్చారు. – బంజారాహిల్స్



తాజ్‌దెక్కన్‌లో దాండియాలో పాల్గొన్న ఎమ్మెల్యే



జూబ్లీహిల్స్ సీతారామస్వామి ఆలయంలో పర్వతవర్ధని దేవి...



ఇందిరానగర్‌లో దుర్గామాత మండపం వద్ద కార్పొరేటర్ వెంకటేష్



ఇందిరానగర్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల

ఘనంగా బతుకమ్మ వేడుకలు



సాక్షి, సిటీబ్యూరో: డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ కార్యాలయంలో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. అకౌంట్స్ విభాగం డైరెక్టర్ ఫణిభూషణ్ శర్మ ఈ వేడుకలకు హాజరయ్యారు. జాయింట్ డైరెక్టర్లు శైలజారాణి, రజిని,తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.ఎండీ ఆరిఫ్, ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది బతుకమ్మ వేడుకల సందర్భంగా హాజరయ్యారు.

బతుకమ్మ పోటీలు

బంజారాహిల్స్: బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళల్ని మరింత ప్రోత్సహించే దిశలో ఐటీసీ ఆశీర్వాద్ స్పైసెస్ ఆధ్వర్యంలో గేమ్‌లు,



బతుకమ్మలతో మహిళలు

క్విజ్‌లు నిర్వహిస్తున్నారు. ప్రఖ్యాత ఆలయాల్లో స్పిన్ ద వీల్ పేరుతో ఈ పోటీలు ఈ నెల 24వ తేదీ వరకు జరగనున్నాయి. జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయం, బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఈ పోటీలు జరుపుతున్నారు.

హిమాయత్‌నగర్: బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం రాత్రి ట్యాంక్ బండ్ బతుకమ్మ ఘాట్ వద్ద జరిగిన బతుకమ్మ సంబరాలలో బీజేపీ మహిళ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మూర్తి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి సంబరాలు చేసుకున్నారు.

నిమ్స్‌లో..

లక్డీకాపూల్: నిమ్స్‌లో కనుల పండువగా బతుకమ్మ వేడుకలు జరిగాయి. శనివారం ఆస్పత్రి ప్రాంగణంలో నిమ్స్ మహిళా ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవంగా బతుకమ్మ వేడుక జరిగింది. నిమ్స్ హెల్త్ కేర్ సిబ్బంది, ఉద్యోగులు బతుకమ్మ ఆడపాడారు. సంఘం నాయకులు కనక తార, మార్త రమేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందుకు ఆస్పత్రిలోని పలు విభాగాల్లో ఘనంగా దుర్గా మాత పూజలు ఘనంగా జరిగాయి. ఈ క్రమంలో వెల్‌నెస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన దుర్గా మాతాకు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగర బీరప్ప ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెల్‌నెస్ ఇంచార్జి, పీఆర్వో సత్యా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శ్రీవారి కల్యాణం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీవారి నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీ స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేయడంతో ఆలయ పరిసరాల ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. సాయంత్రం నిర్వహించిన గరుడ వాహన సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి ఆలయ చైర్మన్. సిహెచ్. రామయ్య, ఈవో ఎస్. లావణ్య తదితరులు విశేష పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న బెంగాలీ సాంస్కృతిక ప్రదర్శన



దుర్గా పూజలో పాల్గొన్న ఐఏఎస్ అధికారి సబ్యసాచి ఘోష్

బంజారాహిల్స్: బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని బంజారా ఫంక్షన్ హాల్‌లో దుర్గా పూజా మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రిన్సిపల్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. బెంగాల్ సంప్రదాయ నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



పూజలు చేస్తున్న విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవి పూజలు

వెంగళరావునగర్: శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయిసరస్వతీ విద్యానికేతన్ పాఠశాలలో సరస్వతీదేవి పూజలను ఘనంగా నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని చదువుల తల్లి అయిన జగన్మాత శ్రీసరస్వతీదేవి రూపంలో దర్శనమిస్తుందని స్కూల్ నిర్వాహకులు తెలిపారు. విద్య ఏదైనా సరస్వతీదేవి జ్ఞానానికి ప్రతీక అని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విద్యానికేతన్ వ్యవస్థాపకులు, చైర్మన్ శిరీష భవానీశంకర్‌తోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, టీచర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నృత్యం.. నేత్రపర్వం

జూబ్లీహిల్స్ రోడ్ నంబర్: 18లోని సీతారామస్వామి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు నేత్రపర్వంగా సాగాయి. కూచిపూడి, భరతనాట్యం భక్తులను ఆకట్టుకున్నాయి.

– ఫిలింనగర్



జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై వీడని ఉత్కంఠ!

- కాంగ్రెస్ మొదటి జాబితాలో లేని జూబ్లీహిల్స్ అభ్యర్థి
- అజహరుద్దీన్‌పై నాన్‌బెయిలబుల్ కేసు?
- పునరాలోచనలో కాంగ్రెస్ అధిష్టానం
- మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డినే టికెట్ వరించేనా.. మరొకరికా?
- నవీన్‌యాదవ్‌తోనూ చర్చలు జరిపిన కాంగ్రెస్

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మొదటి జాబితాలో అభ్యర్థిని ప్రకటించలేదు. అయితే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న వారిలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ, టీం ఇండియా మాజీ సారథి మొహమ్మద్ అజహరుద్దీన్ ఉన్నారు. తమకే టికెట్ లభిస్తుందనే ధీమాతో ఇదివరకే వారు నియోజకవర్గంలో తమ ప్రచారాలను చేసేసుకుంటున్నారు. ఎవరికివారే తమకే టికెట్ ఖారారు అయిందని, డివిజన్ల నేతలతో మీటింగ్‌లు, బస్తీలు, కాలనీల్లో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మొదటి జాబితాలో తన పేరు వస్తుందని ఆశించిన ఇద్దరికీ నిరాశే ఎదురైంది. మరో రెండు రోజుల్లో తమకే టికెట్ అని నేతలతో చర్చలు కూడా జరిపారు. అయితే గురువారం కొత్త ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. మాజీ ఎంపీ అజహరుద్దీన్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడిగా పనిచేసినప్పుడు జరిగిన అవినీతిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. దీంతో అధిష్టానం అజహరుద్దీన్ సీటు ఇచ్చే విషయంలో పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. అవినీతి మరకతో ఎన్నికల బరిలోకి దిగితే ప్రత్యర్థి పార్టీలు దుమ్మెత్తిపోస్తాయనే ఆందోళన.. ఆలోచనలో పడింది. దాదాపు లక్షకుపైగా మైనార్టీ ఓట్లు ఉన్న నియోజకవర్గంలో అజహరుద్దీన్ అభ్యర్థి అయితే కాంగ్రెస్ కలిసివస్తుందని, సెటిలర్లు సైతం తమకే మొగ్గు అనే సంబరాల్లో ఉన్న అజహరుద్దీన్ టీం ఇప్పుడు ఇరకాటంలో పడిందనే చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డికే టికెట్ ఖరారయ్యే అవకాశాలున్నాయని ఆయన వర్గం ధీమా వ్యక్తం చేస్తోంది. మధ్యలో కాంగ్రెస్ అధిష్టానం మరో ట్విస్ట్‌కు తెరలేపింది. ఎంఐఎం నుంచి ఒకసారి, స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన నవీన్‌యాదవ్‌కు ఢిల్లీకి పిలిపించింది. యువనేతగా బలమైన పోటీనిచ్చే వ్యక్తిగా బలాన్ని తెలుసుకొని పిలిపించారని సమాచారం. అయితే టికెట్ ఇస్తేనే కాంగ్రెస్‌లో ఉంటానని, లేకుండా ఎంఐఎం లేదా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ధీమాగా వారికి చెప్పారని రాజకీయ వర్గాల్లో చర్చలు కొనసాగుతున్నాయి. ఈ సారి తమకు మద్దతు ఇవ్వాలని, ఎంపీ అవకాశం ఇస్తామని చెప్పారట. ఎమ్మెల్యేగానే అవకాశం ఇవ్వాలని కోరారట. కాంగ్రెస్ అధిష్టానం విష్ణు వైపు మొగ్గు చూపుతుందా... మైనార్టీల బలంతో అజహరుద్దీన్‌కే టికెట్ ఇస్తారా.. లేక.. పోటీలో ఉన్న ఇద్దరినీ కాదని.. కొత్త వ్యక్తి ప్రత్యర్థితో బలంగా నిలబడే నవీన్‌యాదవ్ లాంటి వ్యక్తికి చాన్స్ ఇస్తుందా అనే విషయంలో త్వరలో తేలిపోతుంది.

క్రమబద్ధీకరణ బాధ్యత నాదే: ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: గాయత్రిహిల్స్ నివాసితుల చిరకాల కోరిక నివాసాల క్రమబద్ధీకరణను 10శాతం ఫీజు మాత్రమే చెల్లించి క్రమబద్ధీకరించే విధంగా చేసే బాధ్యత తనదేనని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శనివారం జూబ్లీహిల్స్ రోడ్ నెం 10లోని గాయత్రిహిల్స్‌లో కాలనీవాసులు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని మరోసారి కేసీఆర్‌ను సీఎం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో రకరకాల ప్రలోభాలకు గురి చేస్తారని అవేవీ పట్టించుకోవాల్సి అవసరం లేదన్నారు. నేతలు సుబ్బారావు, బోజిరెడ్డి, వెంకటేష్ యాదవ్, గోపాలకృష్ణ, నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



గాయత్రి హిల్స్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం

క్రైస్తవ శ్మశానవాటిక సమస్యకు త్వరలోనే పరిష్కారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం

ఫిలింనగర్: క్రిస్టియన్ల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఏర్పాటు చేసిన ఖైరతాబాద్ నియోజకవర్గం చెందిన 240 మందికిపైగా పాస్టర్లు, క్రిస్టియన్ మైనార్టీ నేతల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే క్రిస్టియన్ గ్రేవియార్డ్ సమస్యకు పరిష్కారం చూపిస్తామని వెల్లడించారు. సీఎం వద్ద ఈ సమస్య పెండింగ్‌లో ఉందని ఎన్నికలు పూర్తయిన వెంటనే శ్మశాన వాటిక ఏర్పాటు పూర్తవుతుందని తెలిపారు. నియోజకవర్గంలో క్రైస్తవుల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తామని అన్నారు. నియోజక వర్గంలో క్రైస్తవులు ఎప్పుడూ బీఆర్ఎస్‌కు అండగా ఉంటున్నారని ఈ ఎన్నికల్లో కూడా తనను ఆశీర్వదించి గెలిపించడం ద్వారా కేసీఆర్ హ్యాట్రిక్‌సాధిస్తారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీల వైపు చూస్తే మనల్ని మనమే మోసం చేసుకున్నట్లు అవుతుందని తెలిపారు. సమావేశంలో ఖైరతాబాద్ క్రిసియన్ మైనార్టీ ప్రతినిధులు పీటర్, ప్రభుదాస్, రుబెన్, జీవానాందం తదితదరులు పాల్గొన్నారు.

బోరబండలో మాగంటి ఇంటింటి ప్రచారం

రహమత్‌నగర్: బీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభిస్తున్నదని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. బోరబండ డివిజన్ ఎస్ఆర్‌టీనగర్, భరత్‌నగర్‌లతో శనివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, కో ఆర్డినేటర్ విజయసింహ, ఇన్‌చార్జ్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

274 పోలింగ్ కేంద్రాన్ని మార్చాలని బీజేపీ వినతి

రహమత్‌నగర్: బోరబండ డివిజన్‌లోని 274 పోలింగ్ బూత్‌ను మార్చాలని బీజేపీ నాయకులు మరోసారి అధికారులను కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ నేతృత్వంలో శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి రవికి సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ... బోరబండ డివిజన్ స్వరాజ్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకుడికి చెందిన పాఠశాలలో 274 పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. వెంటనే ఈ పోలింగ్ బూత్‌ను మార్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బీజేపీ నాయకులు కుమార్‌నాయక్, గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల సమస్యలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చాలి

ముషీరాబాద్: గెస్ట్ లెక్చరర్స్, గెస్ట్ టీచర్స్‌కి గంట చొప్పున కాకుండా పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస మూల వేతనాన్ని పెంచేలా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చాలని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ డి.శ్రీధర్ బాబుకు తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. శనివారం శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. గెస్ట్ టీచర్స్, గెస్ట్ లెక్చరర్స్‌కు ప్రస్తుతం డిగ్రీ కళాశాలలో, జూనియర్ కళాశాలలో గంటకు రూ. 300 చొప్పున నెలకు 72 క్లాసులకు గాను రూ. 28,080 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్స్‌కు గంటల చొప్పున కాకుండా కనీస మూల వేతనం, మినిమమ్ టైమ్ స్కేల్ ఇచ్చే విధంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. తెలంగాణలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, జూనియర్ కళాశాలలో, గురుకుల కళాశాలల్లో దాదాపు 15 వేల మంది గెస్ట్ లెక్చరర్స్ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు చింతల కిషోర్‌కుమార్, డాక్టర్ సంతోష్, మహబూబ్‌ఆలీ తదితరులు ఉన్నారు.



శనివారం బెజవాడ దుర్గమ్మ లలితాత్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు

ఆర్టీసీకి 'ఎన్నికల గిరాకీ'

- రాజకీయ పార్టీల సభలకు తరలుతున్న బస్సులు
- నెల రోజుల్లో 12 వేల వాహనాలు బుక్
- ఒక్కో బస్సుకు సగటున రూ. 20 వేల ఆదాయం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల వేళ ఆర్టీసీకి మంచి బేరం దొరుకుతోంది. ఆర్టీసీ బస్సుల బుకింగ్ రాజకీయ పార్టీలకు మంచి వెసులుబాటుగా ఉంటుండగా, సంస్థకు సైతం లాభసాటిగా మారుతోంది. గత నెల రోజుల వ్యవధిలోనే రాజకీయ పార్టీలు తమ సభలకు దాదాపు 12 వేల వరకు బస్సులను బుక్ చేసుకున్నాయి.

భలే మంచి ఆదాయ మార్గం..

ఆర్టీసీ బస్సులకు పండుగ రోజులు, శుభ ముహూర్తాలున్న రోజుల్లోనే ఆక్యుపెన్సీ రేషియో మెరుగ్గా ఉంటుంది. మిగతా రోజుల్లో సగటున 62 శాతం నుంచి 65 శాతం వరకు ఉంటుంది. అయితే, రాజకీయ సభలకు బస్సులను అద్దెకిస్తే మంచి ఆదాయం వస్తుంది. వారికి అద్దెకిచ్చిన సమయంలో బస్సుల్లో ఎంతమంది ఎక్కారన్న సంఖ్యతో నిమిత్తం లేకుండా.. 100 శాతం ఆక్యుపెన్సీ రేషియోను లెక్కగడ తారు. అంటే.. ప్రతి సీటుకు టికెట్ జారీ చేసినట్టన్న మాట. ఈ లెక్కన ఒక్కో బస్సుకు రూ.20 వేల నుంచి 24 వేల వరకు ఆదాయం వస్తుంది. ప్రస్తుతం దసరా పండుగ రద్దీ అధికంగా ఉంది. మరమ్మతుల కోసం డిపోలకే పరిమితమైన బస్సులను కూడా సిద్ధం చేసి ప్రయాణికుల కోసం పంపుతుంటారు. ఇలాంటి ప్రత్యేక సందర్భాల్లో తప్ప, సాధారణ రోజుల్లో వీలైనన్ని బస్సులను అధికారులు పార్టీలకు కేటాయిస్తున్నారు. పార్టీలకు అద్దెకివ్వటం ద్వారా ఆదాయం ఎక్కువగానే వస్తున్నా.. ఆర్టీసీ మాత్రం తొలి ప్రాధాన్యం ప్రయాణికుల సేవకే ఇస్తుండటం విశేషం.

గత నెల కొల్లాపూర్‌లో ముఖ్యమంత్రి పర్యటించిన సందర్భంలో భారీ బహిరంగసభ నిర్వహించారు. దానికి దాదాపు 2 వేల బస్సులను బుక్ చేశారు. ఆ తర్వాత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈనెల మొదటి వారంలో రెండు రోజుల తేడాతో రెండు పర్యాయాలు రాష్ట్రానికి వచ్చారు. ఆ సందర్భంలో మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లలో భారీ బహి రంగ సభలు నిర్వహించారు. వీటికి దాదాపు రెండు వేల బస్సులను బుక్ చేశారు. రాహుల్‌గాంధీ ఇటీవల తెలంగాణ పర్యటనలో నిర్వహించిన సభలకు కూడా ఆర్టీసీ బస్సులను బుక్ చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి సుడిగాలి పర్యటనలు నిర్వహిస్తు న్నారు. ఈ సందర్భంగా సిరిసిల్ల, జడ్చర్ల, భువనగిరి, సిద్దిపేట తదితర ప్రాంతాల్లో సభలు ఏర్పాటు చేశారు. వీటిల్లో కొన్నింటికి ప్రైవేటు వాహనాలను బుక్ చేస్తే, కొన్నింటికి ఆర్టీసీ బస్సు లను బుక్ చేశారు. ఇటీవల కేంద్రమంత్రులు రాజ్ నాథ్‌సింగ్, అమిత్‌షాలు బహిరంగ సభలు నిర్వ హించారు. గత నెల రోజుల్లో అన్ని పార్టీలు దాదాపు 12 వేలకుపైగా బస్సులను బుక్ చేసుకున్నట్టు సమాచారం. ఒక్కో బస్‌కు సగటున రూ.20 వేల చొప్పున చెల్లిస్తుండటంతో వీలైనన్ని బస్సులను అద్దెకివ్వటం ద్వారా ఆదాయాన్ని పొందే ప్రయ త్నంలో ఆర్టీసీ ఉంది. దసరా, దీపావళి, క్రిస్మస్, కొత్త సంవత్సరం, సంక్రాంతి లాంటి పండుగల వేళ ఎక్కువ మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా ఆ సంస్థ 100 రోజుల ఫెస్టివల్ చాలెంజ్ పేరుతో సిబ్బందికి ప్రత్యేక టార్గెట్‌లను కేటాయించింది. ఇందులో ఎన్నికల అంశాన్ని కూడా చేర్చటం విశేషం. రాజకీయ పార్టీలకు బస్సులను అద్దెకివ్వటం ద్వారా ఎక్కువ ఆదాయాన్ని పొందాలన్న ఆదేశాలు మౌఖికంగా వెలువడ్డాయి.

పార్టీలకు కూడా సౌలభ్యమే..

పెద్ద నేతలు పాల్గొన్న బహిరంగ సభలకు పార్టీ నేతలు భారీగా జనాన్ని సమీకరిస్తున్నారు. ఇందుకు వారికి వందల సంఖ్యలో వాహనాలు అవసరమవుతాయి. ప్రైవేటు వాహనాలను సమీకరించుకోవటం ఇబ్బందిగా ఉంటుంది. అదే ఆర్టీసీ బస్సులయితే కావాల్సినన్ని సిద్ధంగా ఉంటాయి. దీంతో ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకోవటం వారికి వెసులు బాటుగా మారింది. పైగా వ్యాన్లు లాంటి ప్రైవేటు వాహనాల ఖర్చుతో పోలిస్తే, ఆర్టీసీ బస్సుల ఛార్జీనే తక్కువగా ఉంటుంది.

చెన్నై టు సింగపూర్.. వయా వైజాగ్

విశాఖ మీదుగా త్వరలో రెండు క్రూయిజ్ షిప్ సర్వీసులు

- ఇటీవలే ప్రారంభమైన క్రూయిజ్ టెర్మినల్
- విశాఖ పోర్టు, చెన్నై, ట్యుటికోరన్ పోర్టుల మధ్య కొనసాగుతున్న చర్చలు
- భారత్, శ్రీలంక, మాల్దీవుల మధ్య సర్వీసులు నడిపేందుకు ప్రణాళికలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విహార ప్రపంచానికి విశాఖ సరికొత్తగా కనిపించబోతోంది. విశాఖ మీదుగా పర్యాటక రంగంలో సేవలందించేందుకు రెండు క్రూయిజ్ షిప్‌లు క్యూ కడుతున్నాయి. సాగర జలాల్లో హాయిగా విహరిస్తూ.. విశాఖ నుంచి ప్రపంచంలోని పలు నగరాలకు సర్వీసులు నడిపేందుకు లిట్టోరల్ క్రూయిజ్ సంస్థ సిద్ధమవుతోంది. విశాఖలో నిర్మించిన క్రూయిజ్ టెర్మినల్ మీదుగా డిసెంబర్ నుంచి తొలి సర్వీస్ ప్రారంభించేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. చెన్నై నుంచి సింగపూర్‌కి తొలి సర్వీసు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిన లిట్టోరల్.. ఈ క్రూయిజ్‌ని విశాఖ మీదుగా నడపాలని నిర్ణయించింది. మరోవైపు భారత్, శ్రీలంక, మాల్దీవుల్లో విహరించేలా మరో క్రూయిజ్ సర్వీస్ కూడా ప్రారంభం కానుంది. ఇప్పటికే టూరిస్ట్ క్రూయిజ్ షిప్‌ల ప్రతినిధులు విశాఖపట్నం పోర్టు అథారిటీ అధికారులతోపాటు కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర పర్యాటక శాఖతో సంప్రదింపులు జరిపారు. అనుమతులు ఇచ్చేందుకు పోర్టు అంగీకారం తెలిపింది. త్వరలోనే సర్వీసుల వివరాల్ని ప్రకటించేందుకు చెన్నైకి చెందిన లిట్టోరల్ క్రూయిజ్ సంస్థ సన్నద్ధమవుతోంది.

రాష్ట్ర పర్యాటక శాఖతో చర్చలు

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, విశాఖ పోర్టు అథారిటీ సంయుక్తంగా విశాఖలో నిర్మించిన ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్‌ను కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జల మార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభించారు. టెర్మినల్ అందుబాటులోకి రావడంతో.. క్రూయిజ్‌లో విహరించే వారికి సౌకర్యాలుంటాయన్న కారణంతో ఈ సర్వీస్‌ని విశాఖ మీదుగా నడపాలని భావించారు. ముంబైలో ఇటీవల ముగిసిన గ్లోబల్ మారిటైమ్ ఇండియా సమ్మిట్ (జీఎంఐఎస్)-2023లో లిట్టోరల్ క్రూయిజెస్ లిమిటెడ్ ప్రమోటర్ రాజా వైజ్‌తోపాటు చెన్నైకి చెందిన వోక్ పోర్టు అథారిటీ, ట్యుటికోరిన్ పోర్టు ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీనికి సంబంధించి విశాఖ పోర్టు ప్రతినిధులతో సంప్రదింపులు కూడా జరిగాయి. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజాతో లిట్టోరల్ ప్రతినిధులు సమావేశమయ్యారు. చెన్నైని హోం పోర్ట్‌గా చేసుకుని రెండు విలాసవంతమైన నౌకల నిర్వహణను సులభతరం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

భారత్–శ్రీలంక–మాల్దీవులకు మరో సర్వీసు

రూ.1,200 కోట్ల పెట్టుబడితో భారత్-శ్రీలంక-మాల్దీవుల మధ్య మరో లగ్జరీ క్రూయిజ్ సేవలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సర్వీసును కూడా లిట్టోరల్ సంస్థ నడపనుంది. వీలైనంత త్వరగా ఈ సర్వీసు కూడా విశాఖ మీదుగా ప్రారంభించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీనిద్వారా దాదాపు 3 వేల మందికి ఉపాధి అవకాశాలు కలిగే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు షిప్‌లు పూర్తి లగ్జరీగా ఉంటాయని విశాఖపట్నం పోర్టు ప్రతినిధులు చెబుతున్నారు. ఒక్కొక్కటి 10 అంతస్తులుండే ఈ భారీ షిప్‌లో ఒకేసారి 1,200 నుంచి 1,500 మంది వరకూ ప్రయాణించవచ్చు. ఫుడ్ కోర్టులు, స్పెషాలిటీ రెస్టారెంట్లు, బార్లు, స్పా, సెలూన్, థియేటర్, నైట్ క్లబ్, స్విమ్మింగ్ పూల్స్, ఫిట్‌నెస్ సెంటర్లు, డీజే ఎంటర్‌టైన్‌మెంట్, లైవ్ బ్యాండ్, అడ్వెంచర్ యాక్టివిటీస్, షాపింగ్ మాల్స్, లైవ్‌షో ఉన్నాయి. చిన్నారుల కోసం ప్రత్యేక ఫన్ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు. టికెట్ తీసుకున్న వారందరికీ షిప్‌లోని క్యాసినో వరల్డ్‌కు ఎంట్రీ ఉచితం. దీంతో పాటు లిక్కర్, ఇతర సర్వీసులకు అదనపు చార్జీలు ఉంటాయి.

ప్రగతిభవన్ నుంచి కేసీఆర్‌ను సాగనంపాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్
- అధికారంలోకి వస్తే గల్ఫ్ సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తాం



సభలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

మెట్‌పల్లి(కోరుట్ల)/జగిత్యాలటౌన్: తెలంగాణను దోచుకుంటున్న కేసీఆర్ కుటుంబాన్ని ప్రగతిభవన్ నుంచి సాగనంపాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని మినీ స్టేడియంలో బహుజన రాజ్యాధికార గర్జన సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో ఒక్కశాతం ఉన్న వర్గానికి అధికారం అప్పగిస్తే బహుజనులకు న్యాయం జరగదన్నారు. టీఎస్‌పీఎస్సీని మంత్రి కేటీఆర్ తన దోపిడీకి అడ్డాగా మార్చుకున్నారని, ఒక్కో పరీక్ష పేపర్‌ను ఆయన రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు అమ్ముకున్నారని ఆరోపించారు. పరీక్షలు వాయిదా పడటం వల్ల మనస్తాపం చెందిన ప్రవల్లిక అనే యువతి ఆత్మహత్య చేసుకుంటే, కేటీఆర్ దానిని వక్రీకరిస్తూ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి వస్తే రూ.5 వేల కోట్లతో గల్ఫ్ సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి గల్ఫ్ నుంచి తిరిగి వచ్చిన కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. బహుజనులు ఎక్కువగా ఉన్న కోరుట్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా దొరలు గెలవడం సమంజసం కాదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేస్తున్న పూదరి నిషాంత్ కార్తికేయను గెలిపించాలని కోరారు. మాజీ జెడ్పీటీసీ పూదరి అరుణ, జిల్లా ఇన్‌చార్జి పుప్పాల లింబాద్రి తదితరులు ఈ సభలో పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ రద్దుకు తొలి సంతకం

తమ పార్టీ అధికారంలోకి వచ్చిన రోజే టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేస్తూ తొలి సంతకం చేయడంతో పాటు, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులకు అండగా నిలుస్తామని బీఎస్పీ చీఫ్ ప్రవీణ్‌కుమార్ హామీ ఇచ్చారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆయన బీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్పీ సమక్షంలో పలువురు పార్టీలో చేరారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్ ఏక్ నంబర్ అయితే బేటా కేటీఆర్ దస్ నంబర్ అని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌రావు అంబులెన్సుల్లో డబ్బులు పంపిణీ చేస్తారని అనుమానంగా ఉందని అన్నారు.

ధాన్యం టెండర్లకు ఈసీ బ్రేక్

తదుపరి ఆదేశాలిచ్చేంత వరకు టెండర్లను పిలవొద్దన్న ఈసీ




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రైస్ మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని విక్రయించేందుకు ప్రభుత్వం రెండో దఫా పిలిచిన టెండర్లకు ఎన్నికల సంఘం బ్రేక్ వేసింది. గతేడాది యాసంగికి సంబంధించిన సుమారు 67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లుల్లో మూలుగుతోంది. ఈ ధాన్యాన్ని సీఎంఆర్ కింద మిల్లింగ్ చేసేందుకు మిల్లర్లు ముందుకు రాలేదు. దీంతోపాటు గత వానాకాలం ధాన్యం కూడా మిల్లుల్లో సీఎంఆర్ కింద మిల్లింగ్ జరుగుతోంది. మరోవారంలో కొత్త పంట మళ్లీ మార్కెట్లోకి రానుంది. ఈ నేపథ్యంలో మిల్లుల్లోని ధాన్యాన్ని వదిలించుకునేందుకు ప్రభుత్వం తొలి విడత 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించాలని నిర్ణయించింది. ఆగస్టులో పిలిచిన టెండర్లకు తక్కువ మొత్తంతో బిడ్లు రావడంతో వాటిని రద్దు చేసిన సర్కార్ ఈనెల 7న నిబంధనలు సడలిస్తూ రెండోసారి బిడ్‌లను ఆహ్వానించింది. ఈనెల 17తో గడువు ముగిసినప్పటికీ 21వ తేదీ వరకు గడువు పెంచారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు, టెండర్ల ప్రక్రియ ఎలా జరుపుతారని కాంగ్రెస్ సీనియర్ నేత జి.నిరంజన్ ఈసీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఈసీ తాము తదుపరి ఆదేశాలు ఇచ్చేంతవరకు టెండర్లను పిలవొద్దని ఆదేశించింది.

గోదావరిలో నలుగురు యువకుల గల్లంతు

తాళ్లరేవు: విహార యాత్రకు యానాం వచ్చిన ఏడుగురు యువకుల్లో నలుగురు గౌతమీ గోదావరిలో ఈతకు దిగి గల్లంతయ్యారు. స్థానికులు, కాకినాడ జిల్లా కోరంగి ఎస్‌ఐ ఎస్.రవికుమార్ కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు సమీపంలోని సజ్జాపురం గ్రామానికి చెందిన హనుమకొండ కార్తీక్ తన పుట్టినరోజు సందర్భంగా పార్టీ ఇచ్చేందుకు స్నేహితులైన సలాది దుర్గామహేష్, కొమ్మిరెడ్డి చైతన్య, ముద్దన ఫణీంద్ర గణేష్, పెండ్యాల బాలాజీ, తిరుమల రవితేజ, నేదూరి భానుప్రసాద్‌తో కలిసి యానాం వచ్చాడు. అక్కడ సరదాగా గడిపిన అనంతరం తిరిగి వెళుతూ వారు కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గోపులంక పుష్కర్ ఘాట్ వద్ద గౌతమీ గోదావరి నదిలో స్నానానికి ఆగారు. ముందుగా స్నానానికి దిగిన కార్తీక్ గోదావరిలో మునిగిపోతుండటంతో.. మిగిలిన వారు కాపాడేందుకు యత్నించారు. కార్తీక్‌తో పాటు బాలాజీ, రవితేజ, ఫణీంద్ర గణేష్ నదిలో గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న కోరంగి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

కేసీఆర్ పాలన అంతమైతేనే తెలంగాణ అభివృద్ధి

ప్రజాసంఘాల పోరాటాలకు ఎన్నికల కోడ్ అడ్డుకాదు: ప్రొఫెసర్ ఎం.కోదండరాం



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ధనిక రాష్ట్రాన్ని అప్పులమయం చేసిన ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు పాలన అంతమైతేనే తప్ప తెలంగాణ పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధించదని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరాం పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో నిరుద్యోగం పెరిగిపోయిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 'తెలంగాణ సమాఖ్య – ప్రజా సంఘాల ఉమ్మడి మేనిఫెస్టో'ను జస్టిస్ చంద్రకుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో అప్పులు చేశారని, ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఎన్నికల కోడ్ ప్రజా సంఘాల పోరాటాలకు అడ్డంకి కాదని, రాష్ట్రంలోని ప్రజా సంఘాలు ఏకమై కేసీఆర్ అవినీతి పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ...బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని మోదీ వ్యతిరేక ఓట్లను చీల్చడానికే బీఆర్ఎస్ కుట్ర చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యులు రవళిరెడ్డి, శ్యామల శ్రీను, హర్షవర్ధన్ రెడ్డి, తెలంగాణ సమాఖ్య కన్వీనర్ కరుణాకర్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బంగాళాఖాతంలో వాయుగుండం!

సాక్షి, విశాఖపట్నం: మధ్య బంగాళాఖాతంలో ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న ప్రాంతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది వాయవ్య దిశగా పయనిస్తూ శనివారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారనుంది. అనంతరం ఈ వాయుగుండం ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ తీరాల వైపు పయనించనుంది. ఆ తర్వాత మూడు రోజుల్లో మరింతగా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం నివేదికలో వెల్లడించింది. అయితే ఈ వాయుగుండం తుపానుగా బలపడవచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఏర్పడనున్న వాయుగుండం ప్రభావం నామమాత్రంగానే ఉంటుందని చెబుతున్నారు. మరోవైపు ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి సూచికగా తమిళనాడులో శుక్రవారం నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయని ఐఎండీ తెలిపింది. నేడో, రేపో ఏపీలోనూ ఈశాన్య రుతుపవనాలు ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. ప్రస్తుతం తూర్పు, ఈశాన్య గాలులు బలంగా వీస్తున్నాయి. రానున్న రెండు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.



మీ ఆస్తులపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా?

లోకేశ్‌కు ఏపీ మంత్రి జోగి రమేష్ సవాల్



సాక్షి, అమరావతి: 'మీరు చెబుతున్నట్లుగా చంద్రబాబు అంత నిజాయితీపరుడే అయితే.. మీ ఆస్తులపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా?' అని టీడీపీ నేత నారా లోకేశ్‌కు ఏపీ గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ సవాల్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు మంచోడని, మహానుభావుడని, ఏ తప్పూ చేయలే దని లోకేశ్ చెబుతున్నారు. చంద్రబాబు నోట్లో వేలు పెడితే కొరకడేమో గానీ.. పిల్లనిచ్చి అక్కున చేర్చుకున్న మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని లాక్కున్న సిద్ధహస్తుడు. చంద్రబాబు, లోకేశ్‌లు గజదొంగల ముఠాకు నాయకులు. లోకేశ్ ఢిల్లీ వెళ్లి మా నాన్న స్కిల్ స్కాంలో రూ.27 కోట్లు కొట్టేశారని చెబితే ఎవరూ నమ్మడం లేదని గొప్పగా చెప్పారు. నిజమే.. చంద్రబాబు కేవలం రూ.27 కోట్లు దోచేశాడంటే ఎవరూ నమ్మరు. అందుకే ఆయన స్కిల్ స్కాంలో రూ.371 కోట్లు దోచేశారు. లోకేశ్ చెబుతున్నట్టుగా వారి హయాంలో రూ.17 లక్షల కోట్ల బడ్జెట్ పెడితే.. అందులో కనీసం 10 శాతం కొట్టేయగల సిద్ధహస్తుడు చంద్రబాబు. అవినీతి చక్రవర్తి చంద్రబాబు. టీడీపీ అనే ఒక వ్యాపార సంస్థకు చంద్రబాబు సీఈవోగా పనిచేశారు తప్పితే.. ఏనాడూ నాయకుడిగా పనిచేయలేదు' అని జోగి రమేశ్ మండిపడ్డారు.

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 22-10-2023

వైరల్

స్వాగతం.. సుస్వాగతం



రచయిత్రిగా కూడా మంచి మార్కులు కొట్టేసింది నటి ట్వింకిల్ ఖన్నా. 'మిసెస్ ఫన్నీబోన్స్: 'పైజామాస్ ఆర్ ఫర్ గివింగ్' 'ది లెజెండ్ ఆఫ్ లక్ష్మీప్రసాద్' పుస్తకాలతో పాఠకులను అలరించింది. తాజాగా తన కొత్త పుస్తకం 'వెల్‌కమ్ టూ ప్యారడైజ్'ను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రకటించింది. ట్వింకిల్ ఖన్నా లండన్‌లో ఫిక్షన్ రైటింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన తరువాత వస్తున్న పుస్తకం ఇది.

'ఈ పుస్తకంలోని క్యారెక్టర్లు గత అయిదు సంవత్సరాలుగా నా మనసులో తిరుగుతున్నాయి. నాకు మాత్రమే పరిచయమైన ఈ క్యారెక్టర్లు ఇప్పుడు మీకు కూడా పరిచయం కాబోతున్నాయి' అంటూ రాసింది ఖన్నా.

మానవ సంబంధాలు, ఎడబాట్లు, అనుబంధాలు, ఆప్యాయతలను ఆధారంగా చేసుకొని రాసిన ఈ పుస్తకం వచ్చే నెలలో విడుదల కానుంది. సామాన్య పాఠకుల నుంచి బాలీవుడ్ సెలబ్రిటీల వరకు సోషల్ మీడియాలో ఈ పుస్తకంపై కామెంట్స్ పెడుతున్నారు.

రజనీ చాయ్

సూపర్‌స్టార్ రజనీకాంత్
ఒక్కోసారి విసుగుపుట్టి
హిమాలయాలకు వెళుతుంటారు.
ఈసారి కొచ్చిన్‌లో
టీ అమ్ముకుంటున్నారా?
అవుననే కొంతమంది కంగారు పడ్డారు.
తీరా చూస్తే
'దక్కేది దక్కకుండా పోదు...
దక్కనిది ఎప్పటికీ దక్కదు'
అని డైలాగ్ కొడుతూ
తనకు దక్కిన టీ స్టాల్‌ను నడుపుకుంటున్న ఓ వ్యక్తి...
ఇంకేముంది... నెట్‌లో హల్‌చల్.




కొచ్చిన్‌లో ఏదో షూటింగ్ కోసం వెళ్లిన సినిమా యూనిట్ వారు అతణ్ణి చూసి ఆగిపోయారు. రజనీకాంత్! టీ అమ్ముతూ. రజనీకాంత్ సాధారణ జీవితాన్ని ఇష్టపడతాడని అందరికీ తెలుసు. కొంపదీసి టీ అమ్ముతున్నాడా? పరిశీలించి చూశారు. కాదు. రజనీకాంత్‌లానే ఉన్నాడు. పలకరిస్తే అచ్చు రజనీకాంత్‌లానే నవ్వుతున్నాడు. పేరు సుధాకర్ ప్రభు. ఫోర్ట్ కొచ్చిన్ పట్టాలం రోడ్డులో 'వెంకటేశ్వర హోటల్' అనే ప్యూర్ వెజిటేరియన్ హోటల్ నడుపుతున్నాడు. లెమన్ టీ చేయడంలో దిట్ట. మొన్న మొన్నటి వరకూ ఎవరూ అతణ్ణి రజనీకాంత్‌తో పోల్చలేదు కాని ఈ మధ్య గెడ్డానికి రంగేయడం మాని, కళ్లద్దాలు మార్చేసరికి అచ్చు రజనీ గెటప్‌లోకి వచ్చేశాడు. నాదిర్‌షా అనే మలయాళం డైరెక్టర్ ఇతణ్ణి ఫేస్‌బుక్‌లో పెట్టేసరికి వైరల్ అయ్యాడు. అప్పటినుంచి ఇతని వీడియోలు వైరల్ అవుతున్నాయి. కేరళలో ఇతణ్ణి ఫంక్షన్స్‌కు కూడా ఆహ్వానిస్తున్నారు. 'మా పిల్లలు పెద్దగా పట్టించుకోరుగాని నేను రజనీ అన్ని సినిమాలు చూస్తుంటా' అంటాడు. ఈ పాపులారిటీ పెరిగి అతని హోటల్‌కు కస్టమర్లు పెరిగితే అదే పది ప్లేట్లు.

బుల్లెట్ ఎక్కాలే తల్వార్ తిప్పాలే



నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఒక మహిళ గాల్లో తల్వార్ ఊపుతూ బుల్లెట్‌పై వీరవిహారం చేసింది. మరో మహిళ టాప్‌లెస్ జీప్‌ను ఒంటి చేత్తో డ్రైవ్ చేస్తూ మరో చేతితో తల్వార్‌ను గాలిలో ఝుళిపించింది. ఒక మహిళ స్కూటీ డ్రైవ్ చేస్తుంటే మరొక మహిళ వెనుక సీటులో నిల్చొని గాల్లో తల్వార్‌తో విన్యాసాలు చేసింది.

ఆ రాత్రి దుర్గామాత మండపం సమీపంలో మహిళలు చేసిన రకరకాల స్టంట్స్‌కు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ వీడియోలకు మిశ్రమ స్పందన లభించింది. కొందరు 'ఆహా ఓహో' అని అబ్బురపడితే మరికొందరు 'ఇలాంటి సాహసాలు తగవు' అని ఖండించారు.

ఇలా అయితే ఎలా..?

దివ్యాంగుల హక్కుల కార్యకర్త, మోడల్ విరాళీ మోదీ ఇటీవల ముంబైలో పెళ్లి చేసుకుంది. వీల్‌చైర్ యూజర్ అయిన తనకు రిజిస్ట్రార్ ఆఫీసులో ఎదురైన ఇబ్బందుల గురించి ఆమె ట్విట్టర్‌లో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది.

'రిజిస్ట్రార్ ఆఫీసు రెండో ఫ్లోర్‌లో ఉంది. లిఫ్ట్ సౌకర్యం లేదు. మెట్లు ఎక్కడం తప్ప మరో దారి లేదు. మరి వీల్‌చైర్ యూజర్ అయిన నా పరిస్థితి ఏమిటి? నా పరిస్థితి గురించి ఏజెంట్‌తో చెప్పి పంపాను. అధికారులు కిందికి రాలేదు. అలా అని నాకు ప్రత్యేక సౌకర్యాలేవీ కల్పించలేదు. ఇక మెట్ల మార్గం ఎలా ఉందంటే... మెట్లు పగుళ్ల బారి ఉన్నాయి. రెయిలింగ్ వదులుగా ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. దివ్యాంగులకు పెళ్లి చేసుకునే హక్కు లేదా?' అని తన మనసులోని ఆవేదనను నెటిజనులతో పంచుకుంది విరాళీ.



'పబ్లిక్ స్పేస్, ప్రభుత్వ కార్యాలయాలలో దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలనే మాట నా చిన్నప్పటి నుంచి వింటూ ఉన్నాను. కాని అది ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదు. దివ్యాంగుల కార్యకర్త పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఏమిటి?' అని ఒక యూజర్ స్పందించాడు.

సైకిల్ సవారీలో తాడాటకు సై

స్కిప్పింగ్ రోప్ (తాడాట) అనేది అసాధ్యమైనదేమీ కాదు. అందరూ చేసేదే. అయితే భోపాల్‌కు చెందిన డాన్సర్, ఆర్టిస్ట్ బుష్రా తాడాటను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఖాళీ రోడ్డు మీద సైకిలింగ్ చేస్తూనే తాడాట ఆడుతూ 'ఆహా' అనిపించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ వైరల్‌గా మారింది.



'సూపర్బ్ బ్రిలియంట్ టాలెంట్' 'దిస్ ఈజ్ వెరీ రిస్కీ సిస్టర్. ప్లీజ్ బీ కేర్‌ఫుల్' ఇలా రకరకాల కామెంట్స్ కనిపించాయి.

ఔరా అండర్ వాటర్ గార్బా



నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గార్బా నృత్యాల సంబరం సహజమే. అయితే జయ్‌దీప్ గోహిల్ మాత్రం 'అండర్-వాటర్ గార్బా డ్యాన్స్'తో తన ప్రత్యేకతను చాటుకున్నాడు. ఇంటర్‌నెట్‌లో ఈ అండర్ వాటర్ గార్బా డ్యాన్స్ వైరల్‌గా మారింది. కొన్నిరోజుల క్రితం 'నవరాత్రి ఇన్ హెవెన్' టైటిల్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో కూడా బాగా పాపులర్ అయింది. ఈ వీడియోలో 'రాధే రాధే' పాటకు అండర్ వాటర్ డ్యాన్స్ చేస్తూ కనిపించాడు జయ్‌దీప్.

అండర్-వాటర్ గార్బా డ్యాన్స్ విషయానికి వస్తే...'మాటలు చాలని అద్భుతం' అంటూ నెటిజనులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

జయ్‌దీప్ గోహిల్ పేరు వినిపించగానే 'అండర్-వాటర్ డ్యాన్సర్' అనే మాట వినిపిస్తుంది. అండర్-వాటర్ డ్యాన్సింగ్‌లో ప్రావీణ్యం సంపాదించడానికి ఎన్నో నెలల పాటు కష్టపడ్డాడు. చిన్నప్పటి నుంచి జయ్‌దీప్‌కు ఈత, నృత్యం అంటే ఇష్టం. ఇంజనీరింగ్ చేసిన జయ్‌దీప్ 9 టు 5 జాబ్ చేయాలనుకోలేదు. డ్యాన్సర్‌గా మంచి పేరు తెచ్చుకోవాలనుకున్నాడు. బ్రేక్ డ్యాన్స్ నుంచి హిప్-హాప్ వరకు రకరకాల డ్యాన్సులు నేర్చుకున్నాడు. ఇక మైకేల్ జాక్సన్ డ్యాన్స్‌లను అచ్చం అలాగే చేసేవాడు.

గిన్నిస్ బుల్లోడు

కోల్‌కతాకు చెందిన పదిహేను సంవత్సరాల అర్నవ్ దాగ ప్రపంచంలోనే పెద్దదైన ప్లేయింగ్ కార్డ్ స్ట్రక్చర్‌ను సృష్టించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. కోల్‌కత్తాలోని ప్రసిద్ధ నిర్మాణాలు రైటర్ బిల్డింగ్, షాహీద్ మినార్, సాల్ట్ లేక్ స్టేడియం, సెయింట్ పాల్స్ కేథడ్రల్ ఆధారంగా చేసుకొని ఈ నిర్మాణం చేశాడు. పని ప్రారంభించడానికి ముందు ఈ నాలుగు నిర్మాణాల దగ్గరకు వెళ్లి వాటి ఆర్కిటెక్చర్‌ను పరిశీలించాడు. ఈ స్ట్రక్చర్ కోసం 143,000 ప్లేయింగ్ కార్డ్స్‌ను ఉపయోగించాడు. టేప్, జిగురు ఉపయోగించకుండానే 40 అడుగుల ఎత్తుతో ఈ స్ట్రక్చర్‌ను సృష్టించాడు. దీనికోసం 41 రోజుల పాటు కష్టపడ్డాడు. 'పూర్తయి పోయింది అనుకున్న నిర్మాణం కొన్నిసార్లు హఠాత్తుగా కుప్పకూలిపోయేది. మళ్లీ మొదటి నుంచి పని మొదలు పెట్టాల్సి వచ్చేది. విసుగ్గా అనిపించేది. అయినా సరే కష్టపడేవాడిని' అంటున్నాడు అర్నవ్.

గతంలో బ్రియాన్ బెర్గ్ అనే వ్యక్తి 34 అడుగుల ఎత్తుతో ఉండే ప్లేకార్డ్ స్ట్రక్చర్‌ను సృష్టించాడు. బెర్గ్ రికార్డ్‌ను అర్నవ్ బ్రేక్ చేశాడు.



హెల్త్

చిన్నారుల్లో ఫిట్స్ (సీజర్స్) రావడం సాధారణంగా చూస్తుండేదే. ఇలా ఫిట్స్ రావడాన్ని వైద్యపరిభాషలో 'ఎపిలెప్సీ'గా చెబుతారు. పెద్దవాళ్లతో పోల్చినప్పుడు పిల్లల్లో వచ్చే సీజర్స్‌కు కారణాలూ, చికిత్సకు వారు స్పందించే తీరుతెన్నులూ... ఇవన్నీ కాస్త వేరుగా ఉంటాయి. ఈ సీజర్స్‌లోనూ 'అబ్సెన్స్ సీజర్స్' అనేవి ఇంకాస్త వేరు. నాలుగేళ్ల నుంచి 14 ఏళ్ల వయసు పిల్లల్లో వచ్చే వీటి కారణంగా చిన్నారులు ఏ భంగిమలో ఉన్నా... ఉన్నవారు ఉన్నట్లుగానే వారు స్పృహ కోల్పోతారు. ఇవి పిల్లల్లో అకస్మాత్తుగా మొదలవుతాయి. హఠాత్తుగా వాళ్లను స్పృహలో లేకుండా చేస్తాయి. కనీసం 10 - 20 సెకండ్లు అలా ఉండిపోయి, మెల్లగా ఈలోకంలోకి వస్తారు. ఇలా హఠాత్తుగా కనిపించి, తల్లిదండ్రుల్ని ఆందోళనకు గురిచేసే 'అబ్సెన్స్ సీజర్స్'పై అవగాహన కోసం ఈ కథనం.



చిన్నారుల్లో వచ్చే 'అబ్సెన్స్ సీజర్స్' అంటే..?

పిల్లల్లో వచ్చే ఫిట్స్‌లో... అబ్సెన్స్ సీజర్స్ అనేవి కనీసం 20 నుంచి 25% వరకు ఉంటాయి. సాధారణంగా ఇవి జన్యుపరమైన (జెనెటిక్), జీవక్రియ పరమైన (మెటబాలిక్) సమస్యల వల్ల వస్తుంటాయి. అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిల్లో 'అబ్సెన్స్ సీజర్స్' కేసులు ఎక్కువగా వస్తుంటాయి. అసాధారణంగా కొందరు చిన్నారుల్లో ఏడాదిలోపు వయసున్నప్పుడు కూడా ఇవి మొదలు కావచ్చు. చాలా మంది ఆరోగ్యకరమైన పిల్లల్లో హఠాత్తుగా మొదలైనప్పటికీ... కొందరు చిన్నారుల్లో మాత్రం... వారికి జ్వరం వచ్చినప్పుడు కనిపించే ఫిట్స్‌తో ఇవి మొదలవుతాయి. అలాగే ఎదుగుదలలో లోపాలు (డెవలప్‌మెంటల్ డిలే) వంటి నాడీ సంబంధమైన సమస్యలున్న వారిలోనూ కనిపిస్తుంటాయి. ఇంక కొందరిలోనైతే... వాస్తవంగా కనుగొన్న నాటికి చాలా పూర్వం నుంచే... అంటే నెలలూ, ఏళ్ల కిందటి నుంచే ఇవి వస్తుంటాయి. కానీ తల్లిదండ్రులు (లేదా టీచర్లు) చాలా ఆలస్యంగా గుర్తిస్తారు. కానీ... వీటినంత తేలిగ్గా గుర్తించడం సాధ్యం కాకపోవడంతో పిల్లలేదో పగటి కలలు కంటున్నారనీ, ఏదో వాళ్ల లోకంలో వాళ్లు ఉన్నారంటూ తల్లిదండ్రులు, టీచర్లు, లేదా పిల్లల్ని చూసుకునే సంరక్షకులు పొరబడుతూ ఉండవచ్చు. సాధారణ సీజర్స్‌లో అవి వచ్చినట్లు తెలుస్తుంది. కానీ అబ్సెన్స్ సీజర్స్‌లో అవి వచ్చిన దాఖలా కూడా స్పష్టంగా తెలియదు. కొన్ని సందర్భాల్లో చాలాకాలం వరకూ తెలిసిరాదు.

ప్రేరేపించే అంశాలు...

ఈ 'అబ్సెన్స్ సీజర్స్'ను కొన్ని అంశాలు ప్రేరేపిస్తూ ఉంటాయి. అవి...
- తీవ్రమైన అలసట
- వేగంగా శ్వాస తీసుకోవడం
- పిల్లలు టీవీ, మొబైల్ చూస్తున్నప్పుడు తరచూ హఠాత్తుగా మారిపోతూ ఉండే కాంతిపుంజాలూ, ఫ్లాష్‌లైట్ల కారణంగా... అబ్సెన్స్ సీజర్స్ రావచ్చు.



డా॥ శ్వేత రాంపల్లి,
కన్సల్టెంట్ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్

అబ్సెన్స్ సీజర్స్ లక్షణాలు...

ఈ సందర్భాల్లో పిల్లలు...
- అకస్మాత్తుగా చేష్టలుడిగి (బిహేవియర్ అరెస్ట్‌తో) నిశ్చేష్టులై ఉండిపోవడం
- ముఖంలో ఎలాంటి కవళికలూ కనిపించకపోవడం
- కళ్లు ఆర్పుతూ ఉండటం, ఒంటి మీద బట్టలను లేదా ముఖాన్ని తడబాటుగా చేతి వేళ్లతో నలపడం, నోరు చప్పరించడం, మాటల్ని తప్పుగా, ముద్దగా ఉచ్చరిస్తూ ఉండటం (ఫంబ్లింగ్),
- చేస్తున్నపనిని అకస్మాత్తుగా నిలిపివేయడం / ఆపివేయడం
- బయటివారు పిలుస్తున్నా జవాబివ్వకపోవడం / ఎలాంటి స్పందనలూ లేకపోవడం
- పిల్లల్లో ఈ లక్షణాలు కనిపిస్తున్నప్పుడు వాళ్లు బయటకు పూర్తిగా నార్మల్‌గానూ కనిపించవచ్చు. మాట్లాడటం మాత్రం చాలావరకు నార్మల్‌గా ఉండిపోవచ్చు. కొందరిలో మాత్రం కొంచెం అస్పష్టత కనిపించవచ్చు.

ఈ లక్షణాలన్నీ వారు ఆటలాడుకుంటున్నప్పుడూ, టీవీ చూస్తున్నప్పుడూ లేదా కొన్నిసార్లు నిద్రలో కూడా కొనసాగుతుంటాయి. చిన్నారులు అన్యమనస్కంగా ఉండటమో లేదా ఏదో లోకంలో ఉన్నట్టు కనిపించడాన్ని తల్లిదండ్రులు గమనిస్తే వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలి.

నిర్ధారణ ఇలా...

అబ్సెన్స్ సీజర్స్‌లో ఎన్నో రకాలున్నప్పటికీ... సాధారణంగా టిపికల్ (అంతగా సంక్లిష్టం కానివి), అటిపికల్ (సంక్లిష్టమైనవి) అనే రకాలు ఉంటాయి.
- ఎలక్ట్రో ఎన్‌సెఫలోగ్రామ్ (ఈఈజీ)
- ఎమ్మారై (బ్రెయిన్) వంటి మరి కొన్ని పరీక్షలతో వీటిని నిర్ధారణ చేయవచ్చు.

ఇక అటిపికల్ రకాల విషయంలో ఇతర నాడీ సంబంధమైన సమస్యలనూ, జీవక్రియలకు(మెటబాలిక్) సంబంధించిన, జన్యుసంబంధమైన మరికొన్ని పరీక్షలతో పాటు మెదడు / వెన్నుపూస చుట్టూ ఉండే ద్రవం (సెరిబ్రో స్పైనల్ ఫ్లుయిడ్ - సీఎస్ఎఫ్)ను పరీక్షించడం ద్వారా ఈ (అటిపికల్) రకాన్ని తెలుసుకుంటారు.

చికిత్స

సమస్య నిర్ధారణ అయిన వెంటనే చికిత్స మొదలు పెట్టాలి. ఇందుకోసం ఫిట్స్ మందులు (యాంటీ సీజర్ మెడిసిన్స్) వాడాలి. వీటిని కనీసం రెండేళ్ల పాటు వాడాల్సి ఉంటుంది. అలా వాడుతూ, బాధితుల మెరుగుదలను గమనిస్తూ, దాని ప్రకారం మోతాదును క్రమంగా తగ్గిస్తూ పోవాలి.

ఈ మందులు చిన్నారుల్లో... కేవలం ఫిట్స్ తగ్గించడం మాత్రమే కాదు, వాళ్ల జీవన నాణ్యతనూ మెరుగుపరుస్తాయి. స్కూల్లో వాళ్ల సామర్థ్యాన్ని పెంపొందిస్తాయి. సామాజికంగా ఒంటరి కాకుండా... నలుగురితో కలిసిపోయేలా చేస్తాయి. మందుల గుణం కనిపిస్తోందా లేదా అన్న విషయాన్ని నిర్ణీత వ్యవధుల్లో ఈఈజీ తీయడం ద్వారా పరిశీలిస్తూ ఉండాలి. ఇక సహాయ చికిత్సలు (సెకండ్ లైన్ ట్రీట్‌మెంట్)గా వాళ్లకు కీటోజెనిక్ డైట్ (కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహారం) ఇవ్వడం, వేగస్ నర్వ్ అనే నరాన్ని ప్రేరేపించడం (వేగస్ స్టిమ్యులేషన్) జరుగుతుంది. దాదాపు 70 శాతం కేసుల్లో చిన్నారులు యుక్తవయసునకు వచ్చేనాటికి మంచి స్పందన కనిపిస్తుంది.

ఈ విషయం గుర్తుంచుకోండి...

పిల్లల్లో అబ్సెన్స్ సీజర్స్ రావడం వల్ల ఆ లక్షణాలతో వారికి ఎలాంటి ప్రమాదమూ ఉండదు. కానీ దీనికి తగిన చికిత్స తీసుకోకపోతే... భవిష్యత్తులో అది ఇతర రకాల ఫిట్స్‌కూ, ప్రవర్తనాపరమైన (బిహేవియరల్) లోపాలూ... (అంటే యాంగ్జైటీ, తరచూ మూడ్స్ మారిపోవడం, అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివ్ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) వంటి ఇతర మానసిక సమస్యలకూ దారితీయవచ్చు. కాబట్టి సమస్యను చూసిన వెంటనే పిల్లల నరాల నిపుణులను సంప్రదించడం ప్రధానం.

ఫ్లూలాంటి జ్వరాలు... లక్షణాలూ, జాగ్రత్తలు

గత కొద్దికాలంగా జ్వరాలు, దగ్గు, జలుబుతో పాటు శ్వాస సరిగా అందకపోవడం వంటి ఫ్లూ లక్షణాలతో చాలామంది హాస్పిటళ్లకు పరుగులెత్తుతున్నారు. జ్వరం తగ్గాక కూడా పొడి దగ్గు, కొందరిలో కఫంతో కూడిన దగ్గు ఒక పట్టాన తగ్గకపోవడంతో ఆందోళన పడుతున్నారు. దాదాపు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి. బాధితుల నుంచీ ఇవే కంప్లెయింట్స్‌తో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని చాలా ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి.

ఈ ఫ్లూ జ్వరాలు పెద్ద సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో ఇవి ఎందుకిలా వస్తున్నాయి, లక్షణాలేమిటి, ముందస్తు నివారణకూ లేదా ఇప్పటికే వచ్చి ఉంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అనేక అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.

ఇటీవల వస్తున్న ఫ్లూలాంటి జ్వరాలన్నింటికీ ఇన్‌ఫ్లుయెంజా, పారా ఇన్‌ఫ్లుయెంజా వంటి వైరల్ ఇన్ఫెక్షన్లు ప్రధాన కారణమని వైద్య నిపుణుల భావన. రెండుమూడేళ్ల కిందట వచ్చిన కరోనా వైరస్ తాలూకు తీవ్రత బాగా తగ్గిపోయి, పెద్దగా ప్రమాదకరం కాని కోవిడ్ కూడా ఈ జ్వరాల కారణాల్లో ఒకటి కావచ్చునని కూడా వైద్య వర్గాలు భావిస్తున్నాయి. రాబోయేది చలికాలం కావడంతో ఇవే జ్వరాలు... దాదాపు వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి వరకు కొనసాగవచ్చని డాక్టర్లు అంచనా వేస్తున్నారు.



డా॥ వి. రాజమనోహర్ ఆచార్యులు,
సీనియర్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్.

లక్షణాలు : దాదాపు ఫ్లూ జ్వరాల్లో కనిపించే అన్ని లక్షణాలూ ఈ సీజనల్ ఫీవర్స్‌లో కనిపిస్తున్నాయి. ఉదాహరణకు...
- జ్వరం
- తలనొప్పి
- ఒళ్లునొప్పులు
- గొంతునొప్పి
- గొంతు కాస్త బొంగురుగా మారడం
- కొన్నిసార్లు (తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు) శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు. ఈ లక్షణాలు ఐదు నుంచి దాదాపు గరిష్ఠంగా పదిరోజులు ఉంటాయి.

నిర్ధారణ పరీక్షలు / చికిత్స

ముక్కు, గొంతు స్వాబ్‌తో కరోనా లేదా ఇతర ఇన్‌ఫ్లుయెంజా వైరల్ ఇన్ఫెక్షన్స్ ఉన్నాయా అని నిర్ధారణ చేయవచ్చు. తీవ్రత తక్కువగా ఉన్నవాళ్లకి (జ్వరం, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు లక్షణాలు గల వారికి) ఇంటివద్దనే లక్షణాలకు తగినట్లుగా పారాసిటమాల్, ఓఆర్ఎస్, దగ్గు సిరప్‌లతో చికిత్స అందించవచ్చు. తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి అంటే... విపరీతమైన దగ్గు, ఆయాసం, ఆక్సిజన్ తగ్గిపోవడం వంటి లక్షణాలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులున్నవారిని హాస్పిటల్‌లో చేర్చి చికిత్స అందించాలి.



వీళ్లలో తీవ్రత ఎక్కువ...

ఇప్పటికే ఆస్తమా, దీర్ఘకాలిక లంగ్స్ సమస్యలు, బ్రాంకైటిస్, దీర్ఘకాలిక గుండెజబ్బులతో బాధపడేవారు, హార్ట్ ఫెయిల్యూర్, కరోనరీ ఆర్టరీ డిసీజ్ బాధితులు, దీర్ఘకాలిక కిడ్నీ/ లివర్ వ్యాధులున్నవారు, కొన్ని ఆటోఇమ్యూన్ డిసీజ్‌లతో బాధపడుతూ స్టెరాయిడ్ చికిత్స తీసుకుంటున్నవారూ, లుకేమియా, సికిల్ సెల్ ఎనీమియా ఉన్నవారు, వయోవృద్ధులూ వారితోపాటు ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులు... వీళ్లందరిలోనూ లక్షణాల్లో తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, నిద్రలేమి, పల్స్ ఆక్సిమీటర్‌తో పరీక్షించినప్పుడు ఆక్సిజన్ శాచ్యురేషన్స్ తగ్గడం, ఆక్సిజన్ మోతాదుల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తుంటాయి. ఒక్కోసారి ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడి బాధితుల్ని ఆసుపత్రులకు తీసుకురావాల్సిన అవసరమూ ఏర్పడుతుంది.

నివారణ / జాగ్రత్తలు:
- దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ఎదుటివారిపై తుంపర్లు పడకుండా చేతి రుమాలు అడ్డుపెట్టుకోవాలి. చేతి రుమాలు లేనప్పుడు తమ ఫుల్ స్లీవ్స్‌లోకి తుమ్మడం మంచిది. దీని వల్ల వైరస్ లేదా వ్యాధిని సంక్రమింపజేసే సూక్ష్మజీవులు ఒకరి నుంచి ఒకరికి వ్యాపించవు. కరోనా సమయంలోలా వీలైతే జ్వరం, దగ్గు తగ్గేవరకు మాస్క్ ధరించడం మేలు.
- దగ్గు లేదా తుమ్మినపుడు చేతులను అడ్డుపెట్టుకున్నవారు, తర్వాత చేతుల్ని 20 సెకన్ల పాటు సబ్బుతో కడుక్కోవాలి లేదా శానిటైజర్ వాడాలి.
- దగ్గు/తుమ్ము సమయంలో ఒకరు వాడిన రుమాలును వేరొకరు ఉపయోగించకూడదు. దాన్ని తప్పనిసరిగా డిస్పోజ్ చేయాలి.
- జలుబు లేదా ఫ్లూ లక్షణాలున్న వ్యక్తులనుంచి దూరంగా ఉండాలి
- బాధితుల పక్క బట్టలను, పాత్రలను విడిగా ఉంచాల్సినంత అవసరం లేదుగానీ... వ్యక్తిగత పరిశుభ్రత కోసం ఒకరి బట్టలు, పాత్రలను మరొకరు వాడకపోవడమే మంచిది.
- బాధితుల్ని మిగతావారి నుంచి కాస్త విడిగా (ఐసోలేషన్) ఉంచటం మేలు.
- ఇన్‌ఫ్లుయెంజాకు, కోవిడ్‌కు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. వ్యాధి తీవ్రత తగ్గించడానికీ, హాస్పిటల్‌లో చేరికల నివారణకు వ్యాక్సిన్ తీసుకోవడం మంచిది.

ఈ జ్వరాలు చాలావరకు పెద్దగా ప్రమాదకరం కావు. అరుదుగా ఎవరిలోనైనా పరిస్థితి మరీ తీవ్రంగా మారితే... తక్షణం బాధితుల్ని ఆసుపత్రికి తరలించాలి.

ల్యాప్‌టాప్ సమస్యలకు ఉపశమనం ఇలా...



కొందరు వృత్తి, ఉద్యోగరీత్యా ల్యాప్‌టాప్‌ను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. దాన్ని వాడే సమయంలో మెడ బాగా ముందుకు సాచి పనిచేయాల్సి ఉండటంతో మెడ ప్రాంతంలోని సెర్వికల్ డిస్కులపై ఒత్తిడి పడుతుంది. నడుం దగ్గర ఉండే లంబార్ వెన్నుపూసల మీద కూడా ఒత్తిడి పడవచ్చు. ల్యాప్‌టాప్ కీబోర్డు ఫ్లాట్‌గా ఉండటంతో సాధారణ కంప్యూటర్ కీ-బోర్డుల్లా... వేళ్లు పూర్తిగా స్వేచ్ఛగా కదపడానికి అనువుగా ఉండవు. దీనివల్ల కూడా వేళ్లపై వేళ్లపై, మెడపై ఒత్తిడి పడుతుంది. అందుకే ల్యాప్‌టాప్‌లతో వచ్చే మెడనొప్పులూ, ఇతర సమస్యల నివారణకు తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలివి...
- ల్యాప్‌టాప్‌ను బెడ్ మీద పెట్టి పని చేయకూడదు. ఎందుకంటే బెడ్ మీద ఉంచినప్పుడు మరింత ఎక్కువగా ముందుకు ఒంగాల్సి వస్తుంది. ఏదైనా ఎత్తు మీద లేదా బల్ల మీద పెట్టి వాడటం మంచిది.
- ల్యాప్‌టాప్‌పై చాలాసేపు పని చేయాల్సి వస్తే... దానికి మామూలు కీబోర్డు (అంటే... ఎక్స్‌టర్నల్ కీబోర్డు, మామూలు మౌస్) అమర్చుకోవడం మంచిది.
- ల్యాప్‌టాప్ మానిటర్‌ను కంటికి అనువుగా సరైన ఎత్తులో ఉంచుకోవడంతో పాటు లైటింగ్ కూడా కంటికి హాని చేయని విధంగా అడ్జెస్ట్ చేసుకోవాలి.
- ప్రతిసారీ కొద్ది నిమిషాల పాటు విశ్రాంతి (బ్రేక్) ఇవ్వడం మేలు.
- ల్యాప్‌టాప్‌ను చాలాసేపు ఒడిలో ఉంచుకుని పనిచేయకూడదు.

క్లాసెన్ కమాల్ ఇంగ్లండ్ ధమాల్

- క్లాసెన్ మెరుపు శతకం
- జాన్సెన్ సిక్సర్ల వర్షం
- ఇంగ్లండ్‌పై 229 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా భారీ విజయం

డిఫెండింగ్ చాంపియన్ ఆట ఇంతేనా అనిపించేలా... అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో చెత్త ప్రదర్శన చూపిస్తూ... ఇంగ్లండ్ ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. కొత్త వ్యూహం, కీలక మార్పులతో బరిలోకి దిగి టాస్ నెగ్గిన అనుకూలతను కూడా సొమ్ము చేసుకోలేక చేతులెత్తేసింది. వన్డే వరల్డ్‌కప్‌లో టైటిల్ నిలబెట్టుకోవడానికి వచ్చిన జట్టు టి20లా 22 ఓవర్లకే ఆలౌట్ కావడమేంటి... కూన అఫ్గాన్ చేతిలో ఓడిన జట్టు ఇక ఆదమరిస్తే కుదరదని అన్నీ అస్త్ర శస్త్రాలకు పదును పెట్టి బలమైన ప్రత్యర్థితో సై అంటుంది. కానీ ఇంగ్లండ్ తీరు చూస్తే అస్త్ర శస్త్రాలన్నీ అటకమీద పెట్టి మైదానంలో ఏదోలా ఆడేందుకు వచ్చినట్లుగా అనిపించింది. మరో వైపు దక్షిణాఫ్రికా మాత్రం నెదర్లాండ్స్ చేతిలో ఓడిన చేదు అనుభవాన్ని మరచి కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగింది. బ్యాటర్ల బాధ్యత, అందరి బౌలర్ల సమష్టి కృషి వరల్డ్‌కప్‌లో సఫారీలకు అసాధారణ విజయాన్నిచ్చింది. ఈ గెలుపులో క్లాసెన్, జాన్సెన్ జట్టు హీరోలుగా నిలిచారు.


క్లాసెన్


బట్లర్


జాన్సెన్

ముంబై: ఇంగ్లండ్ డిఫెండింగ్ చాంపియన్‌లా ఆడలేదు. దక్షిణాఫ్రికాలాంటి పటిష్టమైన జట్టు చేతిలో సాదాసీదా క్రికెట్ కూనలా ఓడింది. బౌలింగ్‌లో విలాపం, బ్యాటింగ్‌లో వైఫల్యంతో ఇంగ్లండ్ చిత్తయింది. శనివారం జరిగిన ప్రపంచకప్‌లో పోరులో దక్షిణాఫ్రికా 229 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 399 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హెన్రిచ్ క్లాసెన్ (67 బంతుల్లో 109; 12 ఫోర్లు, 4 సిక్సర్లు) సునామీ ఆటతో సెంచరీ సాధించగా, రీజా హెండ్రిక్స్ (75 బంతుల్లో 85; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), మార్కో జాన్సెన్ (42 బంతుల్లో 75 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్సర్లు), వాన్‌డర్ డసెన్ (61 బంతుల్లో 60; 8 ఫోర్లు) చెలరేగారు. హెండ్రిక్, డసెన్ 116 బంతుల్లో 121 పరుగులు జోడించగా... క్లాసెన్, జాన్సెన్ ఓవర్‌కు 12 పరుగుల రన్‌రేట్‌తో 12.5 ఓవర్లలోనే 151 పరుగులు జత చేయడం విశేషం. 61 బంతుల్లోనే క్లాసెన్ సెంచరీ పూర్తయింది. తర్వాత భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ 22 ఓవర్లు మాత్రమే ఆడి 170 పరుగుకే కుప్పకూలింది. తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన మార్క్ వుడ్ (17 బంతుల్లో 43 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) తప్ప ఇంకెవరూ చెప్పుకునేంత స్కోరు, జట్టు పరువు నిలిపే పోరాటమైనా చేయలేకపోయారు. ప్రధాన బ్యాటర్లంతా విఫలం కాగా, చివర్లో వుడ్ పోరాటం ఆ జట్టు అట్టడుగునకు చేరకుండా ఆపింది. 400 పరుగుల లక్ష్యాన్ని చూడగానే భీతిల్లినట్లుగా ఇంగ్లండ్ బ్యాటింగ్ వరుస కునారిల్లింది. టాపార్డర్‌లో బెయిర్ స్టో (10), మలాన్ (6), రూట్ (2) కలిపి చేసిన స్కోరు 18 దాటలేదు. మిడిలార్డర్‌లో బ్రూక్ (17), బట్లర్ (15), విల్లీ (12) రెండంకెల స్కోర్లు చేశారంతే. టెయిలెండర్ అట్కిన్సన్ (21 బంతుల్లో 35; 7 ఫోర్లు) కొద్దిసేపు క్రీజ్‌లో నిలిచాడు. తాజా ఫలితంతో ఇంగ్లండ్ సెమీస్ అవకాశాలకు పెద్ద దెబ్బ పడింది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి) బట్లర్ (బి) టాప్లీ 4; హెండ్రిక్స్ (బి) రషీద్ 85; డసెన్ (సి) బెయిర్‌స్టో (బి) రషీద్ 60; మార్క్‌రమ్ (సి) బెయిర్‌స్టో (బి) టాప్లీ 42; క్లాసెన్ (బి) అట్కిన్సన్ 109; మిల్లర్ (సి) స్టోక్స్ (బి) టాప్లీ 5; జాన్సెన్ నాటౌట్ 75; కోయెట్జీ (సి) సబ్-లివింగ్‌స్టోన్ (బి) అట్కిన్సన్ 3; కేశవ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం** (50 ఓవర్లలో 7 వికెట్లకు) 399. **వికెట్ల పతనం:** 1-4, 2-125, 3-164, 4-233, 5-243, 6-394, 7-398. **వికెట్ల పతనం:** 1-4, 2-125, 3-164, 4-233, 5-243, 6-394, 7-398. **బౌలింగ్:** టాప్లీ 8.5-0-88-3, విల్లీ 9-1-61-0, రూట్ 6.1-0-48-0, అట్కిన్సన్ 9-0-60-2, వుడ్ 7-0-76-0, ఆదిల్ రషీద్ 10-0-61-2.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్ స్టో (సి) డసెన్ (బి) ఇన్‌గిడి 10; మలాన్ (సి) డికాక్ (బి) జాన్సెన్ 6; జో రూట్ (సి) మిల్లర్ (బి) జాన్సెన్ 2; స్టోక్స్ (సి) అండ్ (బి) రబడ 5; బ్రూక్ (ఎల్బీ) (బి) కోయెట్జీ 17; బట్లర్ (సి) డికాక్ (బి) కోయెట్జీ 15; విల్లీ (సి) రబడ (బి) ఇన్‌గిడి 12; ఆదిల్ రషీద్ (సి) హెండ్రిక్స్ (బి) కోయెట్జీ 10; అట్కిన్సన్ (బి) కేశవ్ 35; వుడ్ నాటౌట్ 43; టోప్లీ ఆబ్సెంట్‌హర్ట్ ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం** (22 ఓవర్లలో ఆలౌట్) 170. **వికెట్ల పతనం:** 1-18, 2-23, 3-24, 4-38, 5-67, 6-68, 7-84, 8-100, 9-170. **బౌలింగ్:** ఇన్‌గిడి 5-1-26-2, జాన్సెన్ 5-0-35-2, రబడ 6-1-38-1, కోయెట్జీ 4-0-35-3, కేశవ్ 2-0-27-1.

'ఐదు' ఎవరి ఖాతాలో..?

నేడు ప్రపంచకప్‌లో భారత్, న్యూజిలాండ్ పోరు

- నాలుగు విజయాలతో సమఉజ్జీలుగా ఇరు జట్లు
- గెలిచిన టీమ్ అగ్రస్థానానికి
- మ.గం.2.00నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్షప్రసారం




కోహ్లి

ధర్మశాల: క్రికెట్ అభిమానుల కోసం మరో ఆదివారం అసలైన వినోదానికి రంగం సిద్ధమైంది. ప్రపంచకప్‌లో వరుసగా నాలుగు విజయాలతో అజేయంగా సాగుతున్న జట్లు నేడు జరిగే పోరులో ముఖాముఖీ తలపడనున్నాయి. ప్రపంచంలోని అందమైన క్రికెట్ వేదికల్లో ఒకటైన ధర్మశాలలో నేడు న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. సొంతగడ్డపై సమష్టి ప్రదర్శనతో టీమిండియా చెలరేగిపోతుండగా...ఫేవరెట్‌లుగా భావించిన ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలను వెనక్కి నెట్టి గత రన్నరప్ న్యూజిలాండ్ ముందుకు దూసుకొచ్చింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని అందుకునేందుకు జరిగే ఈ పోరులో ఎవరిది పైచేయి కానుందనేది ఆసక్తికరం.

పాండ్యా స్థానంలో ఎవరు?

జోరు మీదున్న భారత్‌కు గత మ్యాచ్ తర్వాత అనూహ్య సమస్య వచ్చింది. గాయపడిన హార్దిక్ పాండ్యా ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో అతని స్థానంలో ఎవరిని ఎంచుకుంటారనేది కీలకంగా మారింది. పిచ్ పరిస్థితిని బట్టి చూస్తే నేరుగా షమీకి అవకాశం దక్కవచ్చు. అయితే బ్యాటింగ్ బలహీనంగా మారే అవకాశం ఉంది. దాంతో సూర్యకుమార్ లేదా ఇషాన్ కిషన్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుంది. అలా చేస్తే శార్దుల్ ఠాకూర్ పూర్తి స్థాయిలో ఐదో బౌలర్‌గా తన బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది. భారత బ్యాటర్లంతా మంచి ఫామ్‌లో ఉండటం సానుకూలాంశం. రోహిత్, కోహ్లి, గిల్, రాహుల్ అద్భుత ఆటతో కొనసాగిపోతున్నారు. రోహిత్, కోహ్లి దూకుడు భారత్‌కు మరో సారి గెలుపు అవకాశాలు సృష్టించగలదు. ఇప్పటి వరకు టీమిండియాకు లోయర్ ఆర్డర్ బ్యాటింగ్‌కు పరీక్షించే అవకాశం రాలేదు. కానీ కివీస్ బౌలర్లు చెలరేగితే వారు కూడా సత్తా చాటాల్సి ఉంటుంది. బుమ్రా, సిరాజ్‌లతో పేస్ బౌలింగ్ పదునుగా ఉంది. కుల్దీప్‌ను ఒక్క ప్రత్యర్థి కూడా సమర్థంగా ఎదుర్కోలేకపోయాడు. జడేజా స్పిన్ కూడా కివీస్‌ను కట్టడి చేయగలదు.

అదే జట్టుతో...

మొదటినుంచీ కివీస్ నమ్ముకున్న సమష్టితత్వమే ఆ జట్టును గెలిపిస్తోంది. గత నాలుగు మ్యాచ్‌లలో కూడా అది కనిపించింది. ఒకరు విఫలమైతే మరొకరు ఆ బాధ్యతను తీసుకుంటున్నారు. అందుకే న్యూజిలాండ్ తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగనుంది. విలియమ్సన్, సౌతీ ఇంకా కోలుకోకపోవడంతో ఈ మ్యాచ్‌కూ దూరమయ్యాడు. కాన్వే, యంగ్ శుభారంభాలు అందిస్తుండగా రచిన్, లాథమ్ దానిని కొనసాగిస్తున్నారు. ఫిలిప్స్, చాప్‌మన్ మెరుపులు జట్టుకు భారీ స్కోరు అందిస్తున్నాయి. ఇక పేస్ బౌలింగ్ దళం చాలా పదునుగా ఉంది. బౌల్ట్, హెన్రీలను ఎదుర్కోవడం భారత్‌కు అంత సులువు కాదు. వీరితో పాటు ఫెర్గూసన్, సాన్‌ట్నర్ కూడా సత్తా చాటగలరు.

పిచ్, వాతావరణం

పిచ్‌పై కాస్త పచ్చిక ఉంటుంది. స్వింగ్, బౌన్స్‌కు మంచి అనుకూలం. పేసర్లకు సానుకూలాంశం. బ్యాటర్లు నిలదొక్కుకుంటే పరుగులు రావచ్చు. మ్యాచ్ రోజు చల్లటి వాతావరణం ఉంటుంది. వర్షసూచన లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, రాహుల్, జడేజా, శార్దుల్, షమీ, బుమ్రా, కుల్దీప్, సిరాజ్.

న్యూజిలాండ్: లాథమ్ (కెప్టెన్), కాన్వే, యంగ్, రచిన్, మిచెల్, ఫిలిప్స్, చాప్‌మన్, సాన్‌ట్నర్, హెన్రీ, ఫెర్గూసన్, బౌల్ట్

'బౌల్ట్ నవ్వును చూసి మోసపోవద్దు'

(గౌతం గంభీర్)

భారత జట్టుకు సంబంధించి అసలు పరీక్ష ఇప్పుడే మొదలు కానుందని నా భావన. ఫామ్‌లో లేని ఆసీస్‌ను, పసికూన అఫ్గన్‌ను, అనిశ్చితితో ఆడే పాక్‌ను, బలహీన బంగ్లాను ఓడించి మనల్ని మనం అభినందించుకున్నాం. సమష్టితత్వంతో ఆడే కివీస్‌తో నేడు తలపడనుండగా, ఆ తర్వాత పదునైన ఇంగ్లండ్, జోరు మీదున్న దక్షిణాఫ్రికాను ఎదుర్కోవాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రత్యర్థి జట్లు గానీ, పరిస్థితులు గానీ మనల్ని ఇబ్బంది పెట్టలేదు. అలాంటి సవాల్ ఈ రోజు ఎదురు కావచ్చు. ముఖ్యంగా పాండ్యా లేని లోటుతో జట్టు కూర్పు కూడా కీలకం కానుంది. వరల్డ్ కప్ ముందు ఆసీస్‌తో సిరీస్‌లో పాండ్యా ఆడలేదు. అప్పుడు సూర్యకుమార్ ఆరో స్థానంలో ఆడగా, శార్దుల్ ఐదుగురు స్పెషలిస్ట్ బౌలర్లలో ఒకడిగా బరిలో నిలిచాడు. ఇప్పుడు కూడా దానినే అమలు చేయవచ్చు. సూర్య ప్రత్యేకమైన ఆటగాడు కాగా ధర్మశాల పిచ్ సీమర్లను అనుకూలిస్తే శార్దుల్ కీలకం కాగలడు. ధర్మశాల పిచ్‌కు స్పిన్‌కు అనుకూలంగా కనిపిస్తే నేరుగా పాండ్యా స్థానంలో అశ్విన్‌ను తీసుకోవడం సరైంది. నేటి పోరు భారత బ్యాటింగ్, కివీస్ బౌలింగ్ మధ్య జరగనుంది. రోహిత్ మరోసారి పదునైన లెఫ్టార్మ్ పేసర్‌ను ఎదుర్కోవాల్సి ఉంది. స్టార్క్, షాహిన్, ముస్తఫిజుర్‌లతో పోలిస్తే బౌల్ట్ చాలా ప్రమాదకారి. అతను చిరునవ్వు మొహాన్ని చూసి మోసపోవద్దు. ఆ ముగ్గురికంటే ఇతని బౌలింగ్‌లో పదును చాలా ఎక్కువ. దూకుడైన ఆటతో రోహిత్ ఈ ప్రపంచకప్‌లో తనదైన ముద్ర వేశాడు. అన్ని ఇన్నింగ్స్‌లలోనూ చివరి వరకు అతను జోరు కొనసాగించాడు. అయితే ఈ మ్యాచ్‌లో కాస్త జాగ్రత్తగా ఉండాలి. గిల్‌కు కూడా అతను ఇదే విషయం చెప్పాలి. ఆరంభంలో పరుగులు రాకపోతే విసుగు చెందవద్దు. క్రీజ్‌లో నిలదొక్కుకోవడం ముఖ్యం. పవర్ ప్లేలోనే భారత్‌ను దెబ్బ తీసేందుకు కివీస్ ప్రయత్నిస్తుంది.

శ్రీలంకకు తొలి విజయం

- 5 వికెట్లతో నెదర్లాండ్స్‌పై గెలుపు
- రాణించిన సమరవిక్రమ

లక్నో: ప్రపంచకప్‌లో వరుసగా మూడు పరాజయాల తర్వాత ఎట్టకేలకు మాజీ చాంపియన్ శ్రీలంక ఖాతాలో తొలి గెలుపు చేరింది. గత మ్యాచ్‌లో స్ఫూర్తిదాయక ప్రదర్శనతో దక్షిణాఫ్రికాను ఓడించిన నెదర్లాండ్స్ ఈ సారి అదే జోరును కొనసాగించలేకపోయింది. శనివారం జరిగిన ఈ పోరులో లంక 5 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ 49.4 ఓవర్లలో 262 పరుగులకు ఆలౌటైంది. సైబ్రాండ్ ఎంగెల్‌బ్రెట్ (82 బంతుల్లో 70; 4 ఫోర్లు, 1 సిక్స్), లోగన్ వాన్ బీక్ (75 బంతుల్లో 59; 1 ఫోర్, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. 21.2 ఓవర్లలోనే హాలండ్ 91 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడగా...సైబ్రాండ్, వాన్ బీక్ ఏడో వికెట్‌కు 130 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. లంక బౌలర్ల ధాటికి ఒక దశలో వరుసగా 20.4 ఓవర్ల పాటు డచ్ టీమ్ కనీసం ఒక్క ఫోర్ కూడా కొట్టలేకపోయింది. పేసర్లు మదుషంక, రజిత చెరో 4 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశారు. లంక 26 వైడ్‌లు సహా మొత్తం 33 ఎక్స్‌ట్రాలు ఇవ్వడం విశేషం. ఇందులో కీపర్ హెల్మెట్‌కు బంతి తగలడంతో ఇచ్చిన ఐదు పెనాల్టీ పరుగులు కూడా ఉన్నాయి. అనంతరం లంక 48.2 ఓవర్లలో 5 వికెట్లకు 263 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సదీర సమరవిక్రమ (107 బంతుల్లో 91 నాటౌట్; 7 ఫోర్లు) చివరి వరకు నిలబడి జట్టును గెలిపించగా...పతుమ్ నిసాంక (52 బంతుల్లో 54; 9 ఫోర్లు), చరిత్ అసలంక (66 బంతుల్లో 44; 2 ఫోర్లు, 1 సిక్స్), ధనంజయ డిసిల్వ (37 బంతుల్లో 30; 1 ఫోర్, 2 సిక్సర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.



స్కోరు వివరాలు:

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జిత్ (ఎల్బీ) (బి) రజిత 4; మ్యాక్స్ ఒ డౌడ్ (బి) రజిత 16; అకెర్‌మన్ (సి) మెండిస్ (బి) రజిత 29; డి లీడ్ (సి) పెరీరా (బి) మదుషంక 6; తేజ (ఎల్బీ) (బి) మదుషంక 9; ఎడ్వర్డ్స్ (బి) తీక్షణ 16; సైబ్రాండ్ (బి) మదుషంక 70; వాన్‌బీక్ (సి) అసలంక (బి) రజిత 59; వాండర్‌మెర్వ్ (సి) మెండిస్ (బి) మదుషంక 7; ఆర్యన్ దత్ (నాటౌట్) 9; మీకెరెన్ (రనౌట్) 4; ఎక్స్‌ట్రాలు 33; **మొత్తం** (49.4 ఓవర్లలో ఆలౌట్) 262. **వికెట్ల పతనం:** 1-7, 2-28, 3-54, 4-68, 5-71, 6-91, 7-221, 8-244, 9-252, 10-262. **బౌలింగ్:** మదుషంక 9.4-1-49-4, రజిత 9-0-50-4, కరుణరత్నే 9-1-58-0, తీక్షణ 10-0-44-1, హేమంత 8-0-42-0, ధనంజయ 4-0-13-0.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) ఎడ్వర్డ్స్ (బి) మీకెరెన్ 54; పెరీరా (సి) డి లీడ్ (బి) దత్ 5; మెండిస్ (సి) మీకెరెన్ (బి) దత్ 11; సమరవిక్రమ (నాటౌట్) 91; అసలంక (బి) దత్ 44; ధనంజయ (బి) అకెర్‌మన్ 30; హేమంత (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం** (48.2 ఓవర్లలో 5 వికెట్లకు) 263. **వికెట్ల పతనం:** 1-18, 2-52, 3-104, 4-181, 5-257. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 10-0-44-3, వాన్ బీక్ 10-0-57-0, మీకెరెన్ 8-1-39-1, డి లీడ్ 3-0-29-0, వాన్‌డర్ మెర్వ్ 9-0-42-0, అకెర్‌మన్ 8.2-0-39-1.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	4	4	0	8	1.923
భారత్	4	4	0	8	1.659
దక్షిణాఫ్రికా	4	3	1	6	2.212
ఆస్ట్రేలియా	4	2	2	4	-0.193
పాకిస్తాన్	4	2	2	4	-0.456
బంగ్లాదేశ్	4	1	3	2	-0.784
నెదర్లాండ్స్	4	1	3	2	-0.790
శ్రీలంక	4	1	3	2	-1.048
ఇంగ్లండ్	4	1	3	2	-1.248
అఫ్గానిస్తాన్	4	1	3	2	-1.250

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

మళ్లీ మరీన్ చేతిలో...

పీవీ సింధుకు మరో పరాజయం



ఒడెన్స్: పీవీ సింధు, కరోలినా మరీన్ మధ్య మంచి స్నేహం ఉంది. కోర్టులో ప్రత్యర్థులే అయినా కోర్టు బయట తమ సాన్నిహిత్యం గురించి వీరిద్దరు చాలా సార్లు చెప్పుకున్నారు. కానీ శనివారం ఇద్దరి మధ్య జరిగిన హోరాహోరీ పోరు అనూహ్య రీతిలో సాగింది. ఒక దశలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ప్రత్యర్థిపై పైచేయి సాధించే క్రమంలో అరుపులు, కేకలతో పాటు పలు మార్లు ఇద్దరూ అంపైర్ల హెచ్చరికకు కూడా గురయ్యారు. అయితే చివరకు 73 నిమిషాల సమరం తర్వాత భారత షట్లర్ పరాజయం పక్షానే నిలిచింది. ఈ మ్యాచ్‌కు ముందు ముఖాముఖీ రికార్డులో సింధు 5-10తో వెనుకబడి ఉండగా, ఇప్పుడు అది 5-11కు చేరింది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ డెన్మార్క్ ఓపెన్ సెమీ ఫైనల్లో సింధు ఓటమిపాలైంది. కరోలినా మరీన్ (స్పెయిన్) 21-18, 19-21, 21-7 స్కోరుతో సింధుపై విజయం సాధించింది.

ఇద్దరు ప్లేయర్లు తమదైన శైలిలో చెలరేగడంతో తొలి గేమ్ దాదాపు సమంగా సాగింది. విరామ సమయంలో సింధు 11-10తో ఒక పాయింట్ ముందంజలో ఉంది. ఆ తర్వాతా ఇదే కొనసాగి స్కోరు 18-18కి చేరింది. అయితే మరీన్ వరుసగా మూడు పాయింట్లు గెలుచుకొని గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం సింధు దూసుకుపోయింది. చకచకా పాయింట్లు సాధించిన ఆమె ఎక్కడా ఆధిక్యం తగ్గనీయకుండా 11-3కు చేరింది. అయితే ఆ తర్వాత ప్రతిఘటించిన మరీన్ వరుసగా పాయింట్లు గెలుచుకొని అంతరాన్ని తగ్గించింది. సింధు 20-16తో ముందంజలో నిలిచిన తర్వాత మరీన్ వరుసగా మూడు పాయింట్లు గెలవడంతో 20-19గా మారింది. కానీ స్మాష్‌తో పాయింట్ సాధించి సింధు గేమ్ గెలుచుకుంది. చివరి గేమ్ మాత్రం పూర్తి ఏకపక్షంగా మారిపోయింది. మరీన్ జోరు ముందు భారత షట్లర్ నిలవలేకపోయింది. ముందు 3-0, ఆపై 3-2...ఆ తర్వాత ఆమె జోరు సాగిపోయింది. వరుసగా 11 పాయింట్లు సాధించిన మరీన్ 14-2 దాకా వెళ్లింది. అనంతరం మ్యాచ్‌ను ముగించేందుకు ఆమెకు ఎక్కువ సమయం పట్టలేదు.

మరీన్ అరుపులు... సింధు అసహనం

పాయింట్లు సాధించినప్పుడు అతిగా భావోద్వేగాలు ప్రదర్శించవద్దని అంపైర్ ఇద్దరినీ పిలిచి మ్యాచ్‌లో పలు మార్లు వారించాడు. అయితే మరీన్ తన అరుపులను ఆపకపోగా, సర్వీస్ అందుకునేందుకు సింధు ఎక్కువ సమయం తీసుకుంది. తొలి గేమ్‌ను మరీన్‌ను మళ్లీ అంపైర్ హెచ్చరించాడు. మూడో గేమ్‌లో సర్వీస్ ఆలస్యానికి సింధును అంపైర్ ప్రశ్నించగా...'ఆమె అరిచేందుకు అవకాశమిచ్చారు కదా. ముందు ఆమెను ఆపమని చెబితే నేనూ సిద్ధంగా ఉంటా' అని సింధు బదులిచ్చింది. మరొకరి కోర్టునుంచి షటిల్ తీసుకోవద్దని ఇద్దరికీ చెప్పాల్సి వచ్చింది. చివరకు అంపైర్ ఇద్దరికీ 'ఎల్లో కార్డు'లు కూడా చూపించాల్సి వచ్చింది.

సరదా.. దసరా..


● ఈషా డియోల్, హేమా మాలిని, రాణీ ముఖర్జీ


● కాజోల్


● దులారీ ఖేర్, అనుపమ్ ఖేర్

బాలీవుడ్‌లో దసరా సందడి జోరు బాగా కనిపిస్తోంది. ప్రతి ఏడాదీ కొందరు స్టార్స్ ప్రముఖ ఏరియాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించే చోటుకి వెళ్లి, పూజలు చేస్తుంటారు. ముఖ్యంగా కాజోల్, రాణీ ముఖర్జీ తప్పకుండా వెళుతుంటారు. ఈ ఏడాది కూడా ఈ ఇద్దరూ అమ్మవారిని దర్శించుకున్నారు. కాజోల్ తన తనయుడు యుగ్‌తో కలిసి వెళ్లారు. ఇంకా హేమా మాలిని, ఆమె కుమార్తె ఈషా డియోల్ తన తల్లి దులారీ ఖేర్‌తో కలిసి అనుపమ్ ఖేర్ తదితరులు దుర్గా మాత ఆశీస్సులు అందుకున్నారు.

సినిమా

సరిపోదా శనివారం?


● నాని

'అంటే సుందరానికీ' చిత్రం తర్వాత హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్. డీవీవీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. అలాగే ఈ నెల 23న ఓ అప్‌డేట్, 24న ఈ సినిమా ప్రారంభోత్సవం జరపనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి 'సరిపోదా శనివారం' అనే టైటిల్ అనుకుంటున్నారని సమాచారం.

మంగళవారం కోసం ఎదురు చూస్తున్నా! - హీరో కార్తికేయ


● నందిత, స్వాతి, అజయ్ భూపతి, కార్తికేయ, పాయల్, అజ్మల్, సురేష్ వర్మ

''ఆర్ఎక్స్ 100' తర్వాత నేను, అజయ్ భూపతి లేదా నేను, పాయల్ ఎప్పుడు మళ్లీ సినిమా చేస్తామని అందరూ అడుగుతుంటే.. మంచి కథ కుదరాలని చెబుతూ వచ్చాను. వారిద్దరి కాంబినేషన్‌లో 'మంగళవారం' సినిమా చేస్తున్నట్లు వార్తలు చూసి, నన్ను వదిలేసి ఇద్దరూ సినిమా చేశారు అనుకున్నా (నవ్వుతూ). అజయ్ తన సొంతూరు ఆత్రేయపురంలో 'ఆర్ఎక్స్ 100' తీశాడు. ఇప్పుడు ఆ ఊరిని మరో విధంగా 'మంగళవారం'లో చూపించాడు. 100 పర్సెంట్ అందరికంటే ఈ సినిమా కోసం నేనెక్కువ ఎదురు చూస్తున్నాను'' అని హీరో కార్తికేయ అన్నారు. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ ఆమిర్ జంటగా అజయ్ భూపతి దర్శకత్వం వహించిన చిత్రం 'మంగళవారం'. స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించిన ఈ సినిమా నవంబర్ 17న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో చిరంజీవి సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో హీరో కార్తికేయ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. అజయ్ భూపతి మాట్లాడుతూ– ''మంగళవారం' మంచి డార్క్ థ్రిల్లర్. ఇందులో మహిళలకు సంబంధించిన పాయింట్‌ని టచ్ చేశాం. కార్తికేయ, నా కాంబినేషన్‌లో మరో సినిమా ఉంటుంది'' అన్నారు. ''మా నాన్నకు (నిమ్మగడ్డ ప్రసాద్), నాకు సినిమాలంటే ఇష్టం. సినిమా నిర్మించాలనే నా కల 'మంగళవారం'తో నెరవేరింది'' అన్నారు స్వాతీ రెడ్డి. ''ఈ సినిమాతో నేను, స్వాతి నిర్మాతలుగా పరిచయమవడం గర్వంగా ఉంది'' అన్నారు సురేష్ వర్మ. ''నా కెరీర్ ఎటు వెళుతుందో తెలియని అనిశ్చితి ఉన్న సమయంలో 'మంగళవారం'కి చాన్స్ ఇచ్చారు అజయ్‌గారు'' అన్నారు పాయల్.

మేడమ్ అని కాకుండా సార్ అని పిలిచారు - దర్శకురాలు పూజ

సంపూర్ణేష్ బాబు ప్రధాన పాత్రలో వీకే నరేశ్, శరణ్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మార్టిన్ లూథర్ కింగ్'. పూజా కొల్లూరు దర్శకత్వంలో వైనాట్ స్టూడియోస్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో మహాయాన మోషన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో పూజా కొల్లూరు మాట్లాడుతూ– ''సైంటిస్ట్ లేదా ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకున్నప్పటికీ సినిమాతో సమాజాన్ని ప్రభావితం చేయవచ్చని సినిమా రంగాన్ని కెరీర్‌గా ఎంచుకున్నాను. తెలుగులో 'మార్టిన్ లూథర్ కింగ్' నా తొలి సినిమా. కానీ ఈ చిత్రం కంటే ముందు కొన్ని హాలీవుడ్ ప్రాజెక్ట్స్‌తో అసోసియేషన్ ఉంది. కొన్ని డాక్యుమెంటరీలు తీశాను. ఇక 'మార్టిన్ లూథర్ కింగ్' విషయానికి వస్తే.. వై నాట్ స్టూడియోస్ సంస్థ తమిళ చిత్రం 'మండేలా' కథను తెలుగులో చెప్పాలనుకుని, వెంకటేశ్ మహాగారిని సంప్రదించారు. అయితే నిర్మాణంలో భాగమౌతానని, దర్శకత్వం వహించలేనని ఆయన చెప్పారు. దీంతో నేను దర్శకత్వం వహిస్తానని వెంకటేశ్ మహాగారికి చెప్పడంతో ఆయన వారికి చెప్పారు. ఓటర్లు వారి ఓటు హక్కును ఎందుకు వినియోగించుకోవాలన్నది ఈ సినిమా థీమ్. ఓ సామాన్యుడు నటిస్తే ఎలా ఉంటుందో అలా ఉండాలని సంపూర్ణేష్‌ని హీరోగా తీసుకోవడం జరిగింది. వెంకటేశ్ మహా ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ ఇచ్చారు. నేను ఎడిటింగ్ కూడా చేశాను'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''ఏ భాషలోనైనా మహిళలకు అవకాశాలు తక్కువగానే ఉంటున్నాయి. నేను లేడీ డైరెక్టర్‌ని అయినా సెట్స్‌లో చాలాసార్లు ఓకే సార్ అన్నారు కానీ మేడమ్ అనలేదు. అంటే లింగ వివక్ష ఎంతలా నాటుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. సమస్యలున్నప్పటికీ మన పట్టుదలే మనల్ని ముందుకు నడిపిస్తుంది'' అని చెప్పుకొచ్చారు.



యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


● పూజిత, విరాజ్

'బేబి' సినిమా ఫేమ్ విరాజ్ అశ్విన్ హీరోగా నటించిన చిత్రం 'జోరుగా హుషారుగా'. అను ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో పూజిత పొన్నాడ కథానాయిక. నిరీష్ తిరువీధుల నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను నిర్మాతలు కేఎల్ దామోదర్ ప్రసాద్, బెక్కం వేణుగోపాల్, దర్శకుడు కృష్ణ చైతన్య, పలువురు పాత్రికేయులు విడుదల చేశారు. అను ప్రసాద్ మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'జోరుగా హుషారుగా'. యువ తరానికి నచ్చే అంశాలతో అన్ని భావోద్వేగాలతో రూపొందించిన చిత్రం ఇది. కొత్తదనం ఆశించే ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది''అన్నారు.

వీళ్ల వయసు..123 సంవత్సరాలట..!





పుట్టిన సంవత్సరాన్ని 1900గా చూపుతూ అధికారులు జారీ చేసిన ఓటరు ఐడీ కార్డులు

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఒకటో వార్డుకు చెందిన కోడెపాక కోటిలింగం (44), కోడెపాక పద్మ (43) దంపతుల ఓటరు ఐడీ కార్డులు (ఈ–ఎలెక్టర్ ఫొటో గుర్తింపు కార్డు) చూస్తే వామ్మో అనాల్సిందే. వారు పుట్టిన సంవత్సరాన్ని 1900గా నమోదు చేసి.. వయసును 123 సంవత్సరాలుగా చూపారు. ఆ ఓటరు ఐడీ కార్డులను చూసిన దంపతులిద్దరూ అవాక్కయ్యారు. వెంటనే అన్ని ఆధారాలతో సహా సంబంధిత అధికారులను కలసి విషయం చెప్పడంతో సరి చేస్తామని చెప్పారని, ఇప్పటివరకు తమ పుట్టిన తేదీని సరి చేయలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల అధికారులు వారి నిర్వాకంతో తమ వయసును సుమారు మూడు రెట్లు పెంచేశారని, రానున్న ఎన్నికల్లో ఈ ఓటరు కార్డులను చూసి పోలింగ్ సిబ్బంది తమను ఓటు వేయనివ్వకపోతే పరిస్థితి ఏంటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరగా వారినుంచి స్పందన రాలేదు.



అప్పట్లో నక్సల్స్‌కు బలైన ఎమ్మెల్యేలు

తెలంగాణలో అప్పట్లో కొందరు ఎమ్మెల్యేలు నక్సల్స్ ఘాతుకానికి బలైపోయారు. వారిలో కొందరి వివరాలు ఇవి. సిర్పూరు నుంచి 1989, 1994లలో ఇండిపెండెంట్ గా ఎన్నికైన పాల్వాయి పురుషోత్తంరావు నక్సల్స్ కాల్పులకు బలైపోయారు. ఆ తర్వాత 1999లో ఆయన సతీమణి పి.రాజ్యలక్ష్మి టీడీపీ తరఫున శాసనసభకు ఎన్నికయ్యారు. 1985లో హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి శాసనసభకు టీడీపీ తరఫున ఎన్నికైన దుగ్గిరాల వెంకటరావును కూడా నక్సల్స్ కాల్చి చంపారు. దేవరకొండ నుంచి 1999లో కాంగ్రెస్ తరఫున ఎన్నికైన రాగ్యా నాయక్ కూడా అదే రీతిలో నక్సల్ చేతిలో హత్యకు గురయ్యారు. ఆ తర్వాత ఆయన సతీమణి భారతీ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1994లో జడ్చర్ల నుంచి శాసనసభకు టీడీపీ నుంచి ఎన్నికైన ఎమ్.సత్యనారాయణ ముతా తగాదాలలో హత్యకు గురయ్యారు. తదుపరి ఉప ఎన్నికలో ఆయన సోదరుడు శేఖర్ గెలుపొందారు. ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న బాజిరెడ్డి గోవర్ధన్ మండలాధ్యక్షుడుగా ఉన్నప్పుడు నక్సల్స్ దాడికి గురై తీవ్రంగా గాయపడ్డారు. మరో నేత ఐదుసార్లు శాసనసభకు ఎన్నికైన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు కిడ్నాప్ అయ్యారు. అప్పట్లో ఆయన టీడీపీ ఎమ్మెల్యేగా ఉండేవారు. ఆ సందర్భంలో ఆయన సతీమణి నక్సల్స్ కు వ్యతిరేకంగా దీక్ష చేశారు. తదుపరి ఆయనను నక్సల్స్ విడుదల చేశారు.

మేకల కల్యాణ్ చక్రవర్తి

గెలుపు ధీమా పైకి కనిపిస్తున్నా కాంగ్రెస్ నేతలను లోలోపల భయపెడుతున్న గతం

సీట్ సిక్స్టీ ..చేరుకోని కాంగ్రెస్

మ్యాజిక్ ఫిగర్... అధికారం దక్కించుకునేందుకు రాజకీయ పార్టీలకు అవసరమైన కీలక సంఖ్య ఇది. మొత్తం స్థానాల్లో సగం కంటే ఒకటి ఎక్కువ స్థానాల్లో గెలుపొందిన పార్టీ మ్యాజిక్ ఫిగర్ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ఇప్పుడు ఈ మ్యాజిక్ సంఖ్య విషయంలోనే కాంగ్రెస్ పార్టీ ఫికర్ అవుతోంది. తెలంగాణలో ప్రస్తుతం 119 అసెంబ్లీ స్థానాలుండగా, ప్రభుత్వ ఏర్పాటుకు 60 స్థానాలు అవసరమవుతాయి. ఈ 60 స్థానాల మ్యాజిక్ ఫిగర్ కాంగ్రెస్ పార్టీ గత నాలుగు ఎన్నికల్లోనూ సాధించలేదు. ఇంకోమాట చెప్పాలంటే 1985 నుంచీ ఈ 60 స్థానాలు ఆ పార్టీకి దక్కలేదు. అయితే 1985 నుంచి 2004 వరకు జరిగిన ఎన్నికల్లో తెలంగాణలోని అసెంబ్లీ సీట్లు 107 మాత్రమే. ఈ లెక్కన ఆ మధ్య కాలంలో జరిగిన ఎన్నికల్లో ఒకట్రెండు సార్లు మ్యాజిక్ ఫిగర్ వచ్చింది ఇక, తెలంగాణ ఏర్పాటయిన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో అయితే ఆ పార్టీ మ్యాజిక్ ఫిగర్‌కు ఆమడదూరంలో నిలబడింది. 2014లో 21, 2018లో 19 స్థానాలకు మాత్రమే పరిమితమయింది. ఇప్పుడు ఆ సంఖ్య నుంచి ఏకంగా 60 స్థానాలకు ఎగబాకడం ఏ మేరకు సాధ్యమనే చర్చ కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



1985 నుంచి ఏ ఎన్నికల్లోనూ తెలంగాణలో 60 స్థానాలు సాధించలేని కాంగ్రెస్

1989లో అత్యధికంగా 58 సీట్లు.. ఆ తర్వాత 2009లో 50

2004 ఎన్నికల తర్వాత నాలుగు ఎన్నికల్లోనూ రాని మ్యాజిక్ ఫిగర్

తెలంగాణ ఏర్పాటయిన తర్వాత రెండుసార్లు 20కి అటూఇటూగానే..

2023 ఎన్నికల్లో రికార్డు బద్దలు కొడతామంటున్న కాంగ్రెస్ నేతలు

గతమంతా కటువుగా..

గతాన్ని పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీ ప్రయాణం ఒడిదుడుకుల మధ్యనే సాగుతున్నట్టు అర్థమవుతుంది. కొన్ని ఎన్నికల్లో బాగానే సీట్లు సాధించినా, మరికొన్ని ఎన్నికల్లో చతికిలబడి పోవడం, ఆ తర్వాతి ఎన్నికల్లో కొంత పుంజుకోవడం రివాజుగా కనిపిస్తుంది. 1983లో ఎన్టీరామారావు తొలిసారి ముఖ్యమంత్రి అయ్యాక నాదెండ్ల భాస్కరరావు రూపంలో జరిగిన తిరుగుబాటు కారణంగా అసెంబ్లీ రద్దయి 1985లో మళ్లీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణలోని 107 స్థానాల్లో గెలిచింది కేవలం 14 మాత్రమే. అంతకుముందు 1983లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 43 చోట్ల గెలుపొందింది. రెండేళ్లలోనే 29 స్థానాలు కోల్పోయింది. ఆ ఎన్నికల్లో సీపీఐ8, సీపీఎం7, బీజేపీ 8 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందడం విశేషం. ఇక, 1989లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి తెలంగాణలో బాగా మెరుగుపడింది. అప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణలో 107 సీట్లకు గాను కాంగ్రెస్‌కు 58 సీట్లు వచ్చాయి. అప్పుడున్న మొత్తం స్థానాల్లో మ్యాజిక్ ఫిగర్ తెలంగాణలోనూ వచ్చింది. 1985లో 14 సీట్లు గెలిచిన కాంగ్రెస్ 89లో ఏకంగా 44 సీట్లను అదనంగా సాధించింది. 1994 ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభంజనం ముందు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగయ్యే పరిస్థితికి వచ్చింది. ఈ ఎన్నికల్లో 107 స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ గెలిచింది కేవలం 6 మాత్రమే. కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకున్న టీడీపీకి సొంతంగా 69 చోట్లా, సీపీఐకి 13, సీపీఎంకు 8 స్థానాలు వచ్చాయి. ఆ తర్వాత 1999 ఎన్నికల్లో తెలంగాణలో 42 సీట్లను సాధించింది. ఈ ఎన్నికల్లో ఆంధ్ర ప్రాంతం కంటే మెరుగైన ఫలితాలను తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సాధించింది. ఇక, 2004లో మహానేత డాక్టర్ వైఎస్సార్ పాదయాత్ర ప్రభావం తెలంగాణలోనూ స్పష్టంగా కనిపించింది. ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ 185 సీట్లు సాధిస్తే, అందులో తెలంగాణలో 48 ఉన్నాయి. అప్పుడు ఉన్న 107 స్థానాల్లో కూడా ఆ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ రాలేదు. ఆ తర్వాత జరిగిన 2009 ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ పుంజుకుంది. గత ఎన్నికల కంటే రెండు ఎక్కువగా అంటే 50 చోట్ల ఆ పార్టీ విజయం సాధించింది. కానీ, అప్పుడున్న మొత్తం 119 అసెంబ్లీ స్థానాలతో పోలిస్తే మ్యాజిక్ ఫిగర్ మాత్రం రాలేదు. ఈ ఫలితాలను బట్టి ఉత్థాన పతనాల పరిణామాల అనంతరం ఈసారైనా కాంగ్రెస్ నిలదొక్కుకుంటుందా? గత రికార్డులను బద్దలు కొట్టి 119 అసెంబ్లీ స్థానాల్లో మ్యాజిక్ ఫిగర్ అయిన 60 చోట్ల గెలుపొందుతుందా అనే ఆందోళన ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. కానీ, పైకి మాత్రం ధీమాగానే కనిపిస్తున్నారు కాంగ్రెస్ నేతలు. ఏం జరుగుతుందో డిసెంబర్ 3 వరకు వేచి చూడాల్సిందే.



1985కు ముందు జరిగిన ఎన్నికల ఫలితాలిలా..

1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన సమయంలో తెలంగాణలో 107 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఆ ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం హవా కనిపించింది. కానీ, తెలంగాణలో మాత్రం తెలుగుదేశంతో సమానంగా కాంగ్రెస్ పార్టీ 43 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందింది. ఆ ఎన్నికల్లో ఆంధ్రప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా దెబ్బతింది. అక్కడ మొత్తం 187 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది 17 మాత్రమే.

1978 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 175 స్థానాల్లో విజయం సాధించింది. అందులో తెలంగాణలోని 107 సీట్లలో 65 స్థానాల్లో గెలుపొందింది.

1972 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో 78 స్థానాలు వచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంలో 219 స్థానాల్లో ఆ పార్టీ విజయం సాధించింది. కాగా ఈ ఎన్నికల్లో మొత్తం మీద ఇండిపెండెంట్లు 57 మంది గెలుపొందారు.

1967 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది కానీ, అప్పుడు ఇండిపెండెంట్లు తమ హవా చూపించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 165 సీట్లు వస్తే అందులో తెలంగాణలో 64 ఉన్నాయి. 101 స్థానాలను ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో కాంగ్రెస్ గెలుచుకుంది. ఈ ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా ఇండిపెండెంట్ల హవా కొనసాగింది. మొత్తం 287 స్థానాలకు గాను 68 చోట్ల స్వతంత్రులే గెలుపొందారు. తెలంగాణలో వీరి సంఖ్య 26 కావడం గమనార్హం.



1962లోనూ కాంగ్రెస్ పార్టీనే గెలిచింది. తెలంగాణలోనూ 64 స్థానాల్లో విజయం సాధించింది. ఆ ఎన్నికల్లో సీపీఐకి 18 స్థానాలు వచ్చాయి. ఇండిపెండెంట్లు 19 మంది గెలిచారు.ఈ ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ 51 స్థానాల్లో గెలుపొందింది. కానీ, తర్వాతి రెండు ఎన్నికల్లోనూ సీపీఐకి గణనీయంగా సీట్లు తగ్గడంతో చాలా మంది ఇండిపెండెంట్లు గెలుపొందారు.



మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వచ్చింది. రాష్ట్ర ఏర్పాటు సందర్భం కావడంతో 1955లో ఆంధ్రప్రాంతంలో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన వారినే 1962 వరకు కొనసాగించారు. కానీ, తెలంగాణలో మాత్రం 1957లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 68 చోట్ల గెలుపొందగా, ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) తరఫున పోటీ చేసిన కమ్యూనిస్టులు 22 చోట్ల గెలిచారు. ఈ ఎన్నికల్లోనూ 10 మంది ఇండిపెండెంట్లు గెలుపొందడం విశేషం.

గాసిప్ టైమ్



సార్.. మమ్మల్ని మరిచిపోకండే!

నేతలతో 'టచ్'లో ఉంటున్న ఉన్నత విద్యామండలి అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఇంతకాలం కోరుకున్న పోస్టు ఆశించి సాధించలేకపోయిన అధికారులు ఎన్నికల సీజన్‌లో బలమైన నాయకులకు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. భవిష్యత్‌లో ఎన్నికల్లో గెలిచి ఏ మంత్రి పదవో లభిస్తే తమకంటూ ఆ నేతల వల్ల ప్రయోజనం లభించకపోతుందా అనే ఆలోచనతో సదరు అధికారులు ఆయా నేతలతో మంతనాలు సాగిస్తున్నారు. ఎక్కువగా ఇలాంటి వాళ్లు ఉన్నత విద్యామండలిలో కన్పిస్తున్నారని ఓ టాక్ నడుస్తోంది. నేరుగా కలిస్తే పార్టీ కలర్ అంటుకుంటుందని భయపడే అధికారులు ఫోన్‌లో మాత్రమే ఆయా నేతల్ని పలకరిస్తూ 'మీరు ఉన్నత స్థానంలోకి వస్తే మమ్మల్ని మరచిపోకండి' అంటూ టచ్‌లో ఉంటున్నారట.



తెలంగాణలో కేటీఆర్ రేంజే వేరు

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమారుడు కె.తారక రామారావు మంత్రిగా రాణిస్తున్నారు. తెలంగాణ నుంచి ముఖ్యమంత్రులు అయిన మరెవరి పిల్లలు కూడా ఈ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోలేదనే చెప్పాలి. భావి ముఖ్యమంత్రి అని కూడా ప్రొజెక్టవుతున్న కేటీఆర్ 2009 లో మొదటి సారి శాసనసభకు ఎన్నికై వరుసగా నాలుగు సార్లు గెలిచారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తండ్రి క్యాబినెట్‌లో మధ్యలో కొద్ది నెలలు మినహా మంత్రిగా ఉన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూడా కొనసాగుతున్నారు. కేసీఆర్ కుమార్తె ఒకసారి ఎంపీగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగాను ఉన్నారు. మాజీ ప్రధాని, మాజీ సీఎం పీవీ నరసింహారావు కుమారుడు పీవీ రంగారావు రెండుసార్లు శాసనసభకు ఎన్నికై.. సుమారు నాలుగేళ్లు మంత్రిగా పనిచేశారు. మరో కుమారుడు రాజేశ్వరరావు సికింద్రాబాద్ నుంచి ఎంపీగా గెలిచారు. ఇదంతా పీవీ ప్రధానిగా ఉన్న సమయంలోనే కావడం విశేషం. జలగం వెంగళరావు కుమారుడు ప్రసాదరావు రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. 1989–94 మధ్యలో సుమారు మూడేళ్లపాటు మంత్రిగా ఉన్నారు. ఆయన సోదరుడు వెంకటరావు సత్తుపల్లి , కొత్తగూడెం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి కుమారుడు శశిధర్ రెడ్డి సనత్ నగర్ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండేళ్లపాటు మంత్రిగా పనిచేశారు. కేంద్ర స్థాయిలో జాతీయ విపత్తుల కేంద్రం వైస్ చైర్మన్ గా పనిచేశారు. టంగుటూరి అంజయ్య సతీమణి మణెమ్మ లోక్ సభకు, అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు.



ప్రజలకు నమ్మశక్యంగా ఉండేలా హామీలు.. అదే కేసీఆర్ ధైర్యం



కొమ్మినేని శ్రీనివాసరావు

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ భారత్ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ఎన్నికల ప్రణాళికను ప్రకటించిన తీరు వినూత్నంగా ఉంది. సాధారణంగా అన్ని రంగాల ప్రస్తావనతో మేనిఫెస్టో ఉంటుంది. కానీ ఆయన తన పార్టీ పక్షాన దాదాపు పూర్తిగా సంక్షేమ కార్యక్రమాల ప్రణాళికనే ప్రకటించడం కాస్త ఆశ్చర్యంగా ఉంది. అదే సమయంలో అందులో ఆయన ధైర్యం కనిపిస్తోంది. తెలంగాణలో అభివృద్ధికి సంబంధించి ఒక నివేదికను ఇవ్వడంతో పాటు, వచ్చే ఐదేళ్లలో ఏమి చేస్తామో ఆయా పార్టీలు చెబుతుంటాయి. కానీ కేసీఆర్ అందుకు విరుద్ధంగా కేవలం ఒక రంగానికి సంబంధించి వాగ్దానాలను ప్రకటించి సరిపెట్టుకున్నారు. కాకపోతే కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు వాగ్దానాలను దృష్టిలో ఉంచుకుని కొన్నిటిని ప్రకటించారు. ఇక్కడ ఒక సంగతి గమనించాలి. కేసీఆర్ స్కీములను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ ఆరు వాగ్దానాలు చేస్తే, దానిని దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ తన ఎన్నికల ప్రణాళికను రూపొందించినట్లు కనిపిస్తుంది. రెండు పార్టీలు పరస్పరం ఈ విషయంలో కాపీ కొట్టుకున్నాయనే చెప్పాలి. ఉదాహరణకు కేసీఆర్ దళిత బంధు కింద పది లక్షల సాయం ఇస్తుంటే, దానిని కాంగ్రెస్ పార్టీ పన్నెండు లక్షలు ఇస్తామని తెలిపింది. కేసీఆర్ వృద్ధాప్య పెన్షన్ రెండువేలు ఇస్తుంటే కాంగ్రెస్ నాలుగువేల వరకు హామీ ఇచ్చింది. తదుపరి కేసీఆర్ తన మేనిఫెస్టోలో వృద్ధాప్య పెన్షన్‌ను ఐదువేలు చేశారు.

కొత్తగా కేసీఆర్ బీమా– ఇంటింటికీ ధీమా

గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డి, తదితర భారీ ప్రాజెక్టుల ప్రస్తావన ఉండేది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి వాటి గురించి వివరించి, ఆ తరహాలో ఇంకేమి చేస్తారో చెప్పేవారు.అలాగే పరిశ్రమల రంగం, ఉపాధి రంగం మొదలైనవాటి గురించి హామీలు ఇస్తుంటారు. ఒక వైపు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియామకాలు గందరగోళంగా మారడం, నిరుద్యోగ యువతలో కొంత అసంతృప్తి ఉందన్న ప్రచారం సాగుతున్నప్పటికీ, కేసీఆర్ వాటిని పెద్ద సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించలేదు. తాను ఇప్పటివరకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను, అలాగే వాటిని భవిష్యత్తులో ఇంకా అధికంగా ఇచ్చే తీరునే మేనిఫెస్టోలో పెట్టారు. ప్రత్యేకించి హైదరాబాద్‌కు సంబంధించి కొత్త ఆలోచనలేవీ ప్రకటించలేదు. అయితే కొత్తగా కేసీఆర్ బీమా– ఇంటింటికి ధీమా అన్న స్కీమ్ ద్వారా రాష్ట్రంలోని అన్ని అర్హమైన 94 లక్షల కుటుంబాలకు బీమా పథకం అమలు చేస్తామని ప్రకటించారు. దీనిద్వారా ఎవరైనా మరణిస్తే ఐదు లక్షల బీమా మొత్తం అందుతుంది. ఇదే ప్రధానమైన కొత్త హామీ అని చెప్పాలి. అలాగే గ్యాస్ సిలిండర్‌ను 400 రూపాయలకే సరఫరా చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఐదువందలకే సిలిండర్ అంటే ఈయన ఇంకో వంద తక్కువకే సరఫరా చేస్తానని చెబుతున్నారు. అందుకే కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తమ హామీలను కాపీ కొట్టారని విమర్శించారు. ఆరోగ్యశ్రీ స్కీమ్ ను పదిహేను లక్షలకు పెంచుతామని కేసీఆర్ తెలిపారు. వీటిని జర్నలిస్టులకు కూడా అమలు చేస్తామని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా, పలు కొత్త స్కీములు కూడా అమలు చేశామని, దళిత బంధు మొదలైనవాటిని ఆయన ఉదహరించారు. ఈసారి పాతవాటికే కొనసాగింపుగా హామీలు ఇస్తూ, ఉద్దీపనలు ఉంటాయని చెప్పారు. ఉదాహరణకు రైతు బంధు పథకం కింద ఇంతవరకు ఎకరాకు రెండు దఫాలుగా పదివేల రూపాయలు చొప్పున ఇస్తుండగా, ధానిని క్రమేపీ పదహారువేలకు తీసుకు వెళతామని అన్నారు. అధికారంలోకి మళ్లీ వచ్చిన వెంటనే దీనిని



పన్నెండువేలు చేస్తామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ పదిహేనువేలు ఇస్తామని వాగ్దానం చేస్తే కేసీఆర్ మరో వెయ్యి అదనంగా ఇస్తానంటున్నారు.

ఏదైనా దశల వారీగా చేస్తామని ప్రకటన

ఈసారి ఆయన ఏ స్కీమ్ అయినా వెంటనే ఇంప్లిమెంట్ చేస్తామని చెప్పకుండా దశలవారీగా చేస్తామని ప్రకటించడం విశేషం. ఆర్థిక బారం రీత్యా ఇలా చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆరు వాగ్దానాలను కూడా దృష్టిలో పెట్టుకుని వివిధ స్కీములను కేసీఆర్ విస్తరిస్తున్నా, కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అర్హులైన పేదలకే అని షరతు చెప్పారు.

ఇక్కడ వైఎస్ జగన్ అభిమానులను ఆకట్టుకోవడానికి

ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వృద్ధాప్య పెన్షన్ స్కీమ్ ను ప్రశంసించడంలో కూడా వ్యూహం ఉన్నట్లు అనిపించింది. తెలంగాణలో ఉన్న వైఎస్ జగన్ అభిమానులను ఆకట్టుకోవడానికి ఆయన ఇలా చేసి ఉండవచ్చు. జగన్ మోహన్ రెడ్డి ఏపీలో పెన్షన్ ను రెండువేల నుంచి ప్రతి ఏటా కొంత పెంచుకుంటూ మూడువేల రూపాయలకు తీసుకువెళ్లి విజయవంతంగా అమలు చేస్తున్నారని అభినందించారు. అలాగే తెలంగాణలో పెన్షన్ ను ముందుగా మూడువేల రూపాయలు చేసి, ఆ తర్వాత ఏటా ఐదు వందల చొప్పున ఐదువేల రూపాయలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాలుగువేల రూపాయల పెన్షన్ అంటే కేసీఆర్ ఇంకో వెయ్యి పెంచారు. అర్హులైన మహిళలకు నెలకు మూడు వేల రూపాయల భృతి స్కీమ్ ను కూడా హామీ ఇచ్చారు. ఇది కూడ కాంగ్రెస్ తరహా స్కీమ్ అయినా, కొంత అదనంగా ఇస్తామని అంటున్నారు. కాకపోతే అర్హత అన్న షరతు పెట్టారు. అగ్రవర్ణ పేదలకు కూడా గురుకుల పాఠశాలలు ప్రతి నియోజకవర్గంలో పెడతామని కొత్తగా కేసీఆర్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ తాజాగా మహిళలకు స్కూటీలు ఇస్తామని ప్రకటించింది. ఇది కూడా ఖరీదైన వ్యవహారమే. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ పలు సంక్షేమ కార్యక్రమాలు మేనిఫెస్టోలో పెట్టి, అమలు చేయలేక ఇబ్బంది పడుతోంది. దానిని గమనంలోకి తీసుకుని కేసీఆర్ కొంత జాగ్రత్తపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు కర్ణాటకలో మాదిరి అన్నీ అధికారంలోకి రాగానే ఇచ్చేస్తామని ప్రకటించారు. నిజానికి అది చాలా కష్టం. అందుకే కేసీఆర్ ప్రజలకు నమ్మశక్యంగా ఉండేలా హామీలు ఇచ్చినట్లు అనిపిస్తుంది. అయినప్పటికీ కేసీఆర్ ఈ మేనిఫెస్టోకి ఎంత వ్యయం అవుతుందన్న దానిపై వివరాలు ఇవ్వగలిగితే బాగుండేది. తద్వారా ఈ వాగ్దానాల అమలు సాధ్యాసాధ్యాలు అందరికీ తెలిసేవి. రాజకీయ పార్టీలు వనరుల గురించి పట్టించుకోకుండా, హామీలు ఇచ్చేస్తూ ప్రజలను భ్రమపెట్టాలని ప్రయత్నిస్తున్నాయి. కాంగ్రెస్ పై అదే విమర్శ రాగా, ఇప్పుడు బీఆర్ఎస్ కూడా ఆ కోవలోకే వెళ్లిందని చెప్పాలి. బీజేపీ వీటిలో ఎన్నిటిని కాపీ కొడుతుందో చూడాలి.

జంగ్ తెలంగాణ

సీఎం కేసీఆర్‌తో కామారెడ్డి నియోజకవర్గంలో తలపడేందుకు రెడీ అయిన బీజేపీ నేత, జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి.. విభిన్నమైన ఆలోచనలు చేస్తున్నారు. రూ. 150 కోట్ల సొంత డబ్బుతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానంటూ ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేశారు. శనివారం ఆయన కామారెడ్డిలో సొంత మేనిఫెస్టోను ప్రకటించారు.

– సాక్షి, కామారెడ్డి



కామారెడ్డిలో తన సొంత మేనిఫెస్టోను ప్రకటిస్తున్న వెంకటరమణారెడ్డి

బీజేపీ నేత వెంకటరమణారెడ్డి ప్రకటన

- ఓడినా హామీలు నెరవేరుస్తానని వెల్లడి
- కామారెడ్డిలో కేసీఆర్‌తో ఢీ కొట్టేందుకు సై

నియోజకవర్గ అభివృద్ధికి రూ. 150 కోట్లు

సొంత మేనిఫెస్టో.. సొంత నిధుల వ్యయం

మేనిఫెస్టో ఇలా..

- కామారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో రెండెకరాల విస్తీర్ణంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించి అందులో ఆధునిక వైద్య సదుపాయాలు కల్పిస్తా. ఇందుకోసం రూ.8 కోట్లు అవుతాయి.
- రెండెకరాల్లో మోడల్ స్కూల్ నిర్మించి ఇంటర్ వరకు విద్య అందిస్తాం. పిల్లల కోసం రవాణా సౌకర్యం కూడా కల్పిస్తాం. దీనికి రూ.5.60 కోట్లు వెచ్చిస్తా.
- రూ.2 కోట్లతో రైతు సేవా కేంద్రం, రూ. కోటిన్నరతో క్రీడా ప్రాంగణం, రూ.కోటితో ఉపాధి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తా.
- రాజంపేట, పాల్వంచ, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు మండల కేంద్రాల్లో రూ.8.25 కోట్ల చొప్పున వెచ్చించి జనరల్ ఆస్పత్రి, మోడల్ స్కూల్, క్రీడా శిక్షణ కేంద్రం, రైతు సేవా కేంద్రం, ఉపాధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తా.

ప్రజా ఉద్యమాలతో గుర్తింపు..

వెంకటరమణారెడ్డి నాలుగైదేళ్లుగా ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తున్నారు. ప్రధానంగా కామారెడ్డి మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ వల్ల ప్రజలు, రైతులకు జరిగే నష్టంపై ఆయన చేసిన పోరాటం సంచలనమై రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలకు వ్యాపించింది. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పైరవీలకు తావులేకుండా ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించి అందరి మన్ననలు పొందారు. కామారెడ్డి నియోజకవర్గంలో ఆలయాలు, కమ్యూనిటీ హాళ్లు, ఫంక్షన్ హాళ్లకు ఇప్పటివరకు సుమారు రూ.50 కోట్ల వరకు విరాళం అందించారు. రాజకీయాల కోసం కాకుండా సేవ చేయాలన్న లక్ష్యంతో సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నానని, తన ఆస్తులు అమ్మి అయినా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని వెంకటరమణారెడ్డి పేర్కొంటున్నారు.

మహానేత డాక్టర్ వైఎస్సార్ స్ఫూర్తి..



దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, ఎన్టీఆర్‌లు నాకు స్ఫూర్తి. పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి అహర్నిశలు పాటుపడిన అరుదైన నాయకుడు వైఎస్సార్. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం, వారితో కలిసి ఫొటో దిగడం ద్వారా ఎంతో మందికి ఆయన చేరువయ్యారు. నేను గెలిచినా, ఓడినా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తా.

– వెంకటరమణారెడ్డి, బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి

ఓమ్మే... ఒప్పకోవెందుకు?... నీకు బలే కుశాలగా ఉందిగా..!

''ఎన్నికలు అన్నప్పట్నుంచీ ఎంతసేపటికీ ఆ కారు పార్టీ, కాంగ్రెస్‌పార్టీ, పువ్వు పార్టీలేనా... కమ్యూనిస్టులు కనిపించట్లేదా? ఎప్పుడూ పెద్ద పార్టీలనే హీరోలను చేసి... స్వాపుల సరసాలూ, సెటైర్లు వాళ్లకేనా? మాకు ఉండవా? మేమంటే ఇంత నిర్లక్ష్యమా?'' నిష్ఠూరాలాడుతూ నొచ్చుకున్నారు సుత్తి–కొడవళ్లవారు.

''అయ్యో ఎంత మాటా?'' పశ్చాత్తాపపడ్డాడు ఓటరు. ''ఎవరితోనో ఎందుకు మిమ్మల్నీ ఆ సూపర్‌హిట్ పుష్పతో పోలుస్తాలెండి'' అంటూ భరోసా ఇస్తూ ప్రాయశ్చిత్తానికి పూనుకున్నాడు ఓట 'రైటరు'. సినిమాటిక్‌గా సీను రాస్తూ... ఎక్స్‌ప్లెయిను చేస్తున్నాడు.



– – –

కమ్యూనిస్టులు కొడవలిని భుజానేసుకుని బయల్దేరారు.

''కొడవలెందుకు సార్ సీన్లో?'' అడిగారు.

''పుష్ప భుజాన గొడ్డల్లేదా?'' వివరించాడు ఓటరు.

ఓకే అంటూ సంతృప్తిపడ్డారు.

ఇక్కడ కాంగ్రెస్ పార్టీ హీరోయిన్. పుష్ప తన ప్రేమ కోసం అర్థించినట్టుగా... పొత్తులో భాగంగా కాసిన్ని సీట్లు ఇవ్వమని మీరు తనని అడుగుతున్నారు. ఇదీ సీను. ఇక డైలాగులు...

''ఏయ్... ఏంది మే... నా పేమను ఒప్పుకోమే. కనీసం... ఇరు కమ్యూనిస్టులకు చెరో ఐదు సీట్లు ఇయ్యిమే'' ప్రపోజ్ చేశారు.

''ఏరా? కాంగ్రెసు మనేపు సూసిందారా?'' అనుసంధాన కర్తను అడిగారు.

''లేదనా. సూళ్లా''

''ఆయమ్మి సూడనందుకు... ఒరె నీకు బలే కుశాలుగా ఉంది కదరా. ఓ పన్నెయ్యమను సీపీఐకి మునుగోడు, హుస్నాబాద్, బెల్లంపల్లి, కొత్తగూడెం ఇయ్యమను. సీపీఎమ్ముకు మిర్యాలగూడ, పాలేరుతో పాటు మరో రెండియ్యమను''

''లేదనా. చెరొ రెండైతే ఇస్తానంటాంది...నా... ఆ యమ్మి''

''ఒరే... ఆయమ్మి ఒప్పుకోనందుకు నీకు బలే యాపీగా ఉన్నట్టు అనిపిస్తాందిరా. ఒకేళ ఆయామ్మిగానీ ఒప్పుకోలేదనుకో... ఇగ మేవే డవిరెట్టుగా రంగంలోకి దిగిపోయి పోటీ చేసేస్తాము రోయ్... అప్పుడు ఉంటాదిరా... అచ్చం నాకాల్లోంచి చెప్పు జారిపోయినట్టుగా జర్రున జారిపోతాయి అల్లకు గెలుపు అవకాసాలు'' కాస్త బెదిరింపుగా.

''ఎట్నోజేసి నేనే అడగతాలే...న్నా''

''ఓ పన్నెయ్యిరా. చెరో రెండే ఇయ్యమను. కాపోతే మనం కోరినట్టే అయినా ఇయ్యిమను...''

''నీకెందుకు... నేను మాటాడతానుగా...న్నా''

''ఈ సీనుకు క్లైమాక్సేంది సార్?''

''ఇప్పటికైతే ఇలా కొనసాగతా ఉంది సీను'' ఎక్స్‌పెయిన్ చేశాడు సీను రాస్తున్న రైటరు.

''మా పేమను ఒప్పుకుని వీరోయిను సీట్లు ఇస్తే సరే సరి... లేదంటే మమ్మల్ని ఆ పువ్వు పార్టీలా 'పుష్పా' అనుకుంటిరా మేవూ?... ఎర్రెర్రటి ఎరుపు రంగుతో మండే ఫైరూ... ఇడిగా పోటీ చేసేసైనా మీ ఇజయావకాశాల్ని కాల్చి బూడిద చేసే ఫైరూ!!''

షుగర్ & పెప్పర్

..:: యాసీన్

డబ్బులు ఊరికే వస్తాయి!

చెరుపల్లి వెంకటేశ్

ఎన్నికల వేళ మొదలైన డబ్బు పంపిణీ

- ఉచిత వస్తువులేవో పేర్కొంటూ జాబితా విడుదల చేసిన ప్రభుత్వం
- కట్టడికి రంగంలోకి బృందాలు.. సామాన్యులకు తప్పని ఇబ్బందులు



డబ్బులు ఊరికే రావు... బాగా పాపులర్ అయిన ఓ వాణిజ్య ప్రకటన. కానీ ప్రస్తుతం డబ్బులు ఊరికే వస్తున్నాయి! ప్రతి ఊరికీ వెళ్తున్నాయి!!రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైన దాదాపు రెండు వారాల్లోనే కట్టలకు కట్టలు డబ్బు పట్టుబడటమే ఇందుకు నిదర్శనం. ఇంకా నామినేషన్లు కూడా మొదలు కాకముందే ఓట్ల కొనుగోలు కోసం ప్రజలకు పంపిణీ చేయడానికి డబ్బు పంపిణీ మొదలైంది. డబ్బుతోపాటు ఫ్రీబీస్ (ఉచిత బహుమతులు) సైతం పంపిణీ అవుతున్నాయి. దీంతో వాటిని అడ్డుకునేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. డబ్బు మాదిరిగా ఇవి భారీ మొత్తాల్లో పట్టుబడకపోవడానికి ఏవి ఫ్రీబీస్.. ఏవి కావు అనే సందేహాలున్నాయి. ఈ నేపథ్యంలో ఏవి ఉచితాలో పేర్కొంటూ వాణిజ్య పన్నుల శాఖ 26 అంశాలతో కూడిన జాబితాను జిల్లాల కలెక్టర్లు, పోలీసులు, ఎన్నికల అధికారులకు పంపింది. తనిఖీల్లో పట్టుబడే ఉచితాలపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఆయా వస్తువులు రవాణా అవుతున్నా లేదా భారీ స్థాయిలో గోదాముల్లో నిల్వ ఉన్నా తమకు తెలియజేయాలని పేర్కొంది.

యూపీఐ పేమెంట్లపైనా నిఘా..

డబ్బు పంపిణీ సైతం గతంలోలా నగదు రూపేణానే కాకుండా యూపీఐ (గూగుల్‌పే/ఫోన్‌పే/పేటీఎం) చెల్లింపుల ద్వారా కూడా భారీగా జరుగుతుండటంతో వాటిపైనా ఎన్నికల అధికారులు నిఘా వేశారు. ఆయా వివరాల కోసం ఆర్‌బీఐ, బ్యాంకు మేనేజర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఒకే ఖాతా నుంచి ఎక్కువ లావాదేవీలు జరిగితే వివరాలు అందజేయాల్సిందిగా కోరుతున్నారు.

ఇప్పటివరకు రూ.307 కోట్లు స్వాధీనం

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి 21వ తేదీ వరకు పట్టుకున్న నగదు, మద్యం, సరుకులు, ఫ్రీబీస్, తదితరాల మొత్తం విలువ రూ. 307 కోట్లు కాగా, వీటిల్లో ఫ్రీబీస్ విలువ రూ.26.93 కోట్లు.

వివిధ మార్గాల ద్వారా నిఘా..

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఆన్‌లైన్ ద్వారా డబ్బు పంపిణీ చేపట్టినా అడ్డుకొనేందుకు నిఘా పెట్టాం. ఒకే ఖాతా నుంచి వందల మందికి ఒకే మొత్తంలో (ఉదాహరణకు రూ.500, 2,000, 5,000,10,000 చొప్పున) గూగుల్‌పే/ఫోన్‌పే/పేటీఎం ద్వారా ట్రాన్స్‌ఫర్ జరుగుతోందో లేదో పరిశీలిస్తాం. ఒకే బ్యాంకు ఖాతాలో భారీగా నగదు జమ చేసినా పరిశీలిస్తాం. అనుమానాస్పద లావాదేవీలపై విచారణ చేపడతాం.

– రోనాల్డ్‌రాస్, హైదరాబాద్ ఎన్నికల అధికారి

జాబితాలోని ఫ్రీబీస్ ఇవే..

1.సీలింగ్ ఫ్యాన్లు
2.ప్రెషర్ కుక్కర్లు
3. మిక్సర్లు, గ్రైండర్లు
4.చీరలు
5.కుట్టు మిషన్లు
6.స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రలు
7.ఎలక్ట్రానిక్ వస్తువులు/టీవీ సెట్స్
8. గోడ గడియారాలు
9.క్రికెట్ కిట్స్
10. జ్యువెలరీ ఐటమ్స్
11.ఇతర క్రీడా పరికరాలు
12.బెడ్‌షీట్స్/టవల్స్
13.గడియారాలు
14.సైకిళ్లు, బైక్‌లు
15.కాస్మెటిక్స్
16. జిమ్ పరికరాలు
17. బంగారం లేదా వెండి పూత వస్తువులు (ఇమిటేషన్ జ్యువెలరీ)
18. కుంకుమ భరిణెలు
19. మొబైల్ ఫోన్లు
20. రెడీమేడ్ గార్మెంట్స్
21.స్కూల్ బ్యాగ్స్
22. టీషర్ట్స్
23. టార్చిలైట్లు
24. టాయ్స్
25. ట్రావెల్ బ్యాగ్స్/సూట్‌కేస్‌లు
26. గొడుగులు

పంచతంత్రం

నగదు బదిలీతో... చౌహాన్ నెగ్గుకొస్తారా?

మధ్యప్రదేశ్‌లో 92 మందితో బీజేపీ అయిదో జాబితా

సిట్టింగ్ ఎమ్మెల్యే ఆకాశ్ విజయ్ వర్గీయకు దక్కని చోటు



ఆకాశ్

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు గాను శనివారం బీజేపీ 12 మంది మహిళలు సహా 92 మంది అభ్యర్థులతో కూడిన అయిదో జాబితా ప్రకటించింది. ఇందులో బీజేపీ కీలక నేత కైలాస్ విజయ్ వర్గీయ తనయుడు ఇండోర్–3 ఎమ్మెల్యే ఆకాశ్ విజయ్‌వర్గీయకు చోటుదక్కలేదు. ఇండోర్–3 టికెట్‌ను రాకేశ్ గోలు శుక్లాకు కేటాయించింది. తన తండ్రి కైలాస్ విజయ్ వర్గీయను బరిలో నిలిపినందున తనకు టికెట్ కేటాయించవద్దంటూ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాను కోరినట్లు ఆకాశ్ ఇటీవల ప్రకటించడం గమనార్హం. అలాగే, గ్వాలియర్ సౌత్ టికెట్ ఆశిస్తున్న మాజీ ప్రధాని వాజ్‌పేయి బంధువు అనూప్ మిశ్రా పేరు కూడా తాజా జాబితాలో లేదు. తాజా లిస్టులో కొందరు మంత్రులు సహా 29 మంది సిట్టింగ్‌లకు పార్టీ మొండిచేయి చూపింది. టిక్కెట్లు లభించని మంత్రుల్లో ఓపీఎస్ భదోరియా, యశోధరా సింధియా, గౌరీ శంకర్ బైసెన్ ఉన్నారు. సిట్టింగ్‌ల్లో 37 మంది మాత్రమే అవకాశం కల్పించింది. తాజాగా, టికెట్లు లభించిన 12 మంది మహిళల్లో.. మాజీ మంత్రులు మాయా సింగ్, అర్చనా చిట్నిస్ వరుసగా గ్వాలియర్(తూర్పు), బుర్హాన్‌పూర్ స్థానాల్లో బరిలోకి దిగనున్నారు. మాహౌ స్థానం నుంచి ప్రస్తుత కేబినెట్ మంత్రి ఉషా ఠాకూర్ పోటీ చేయనున్నారు. ఈ జాబితాలో చోటు సంపాదించుకున్న ప్రముఖుల్లో మాజీ మంత్రి జయంత్ మాలవీయ(75) నర్మదాపురం స్థానం నుంచి తన సోదరుడు, కాంగ్రెస్ అభ్యర్థి గిరిజా శంకర్ శర్మపై పోటీ చేయనున్నారు. మరో మాజీ మంత్రి సురేంద్ర పట్వా రైసెన్ జిల్లా భోజ్‌పూర్ నుంచి బరిలోకి దిగనున్నారు. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అనుచరుడైన మంత్రి మహేంద్ర సింగ్ సోసోడియాకు గుణ జిల్లా బమోరీ టికెట్ లభించింది. 230 స్థానాలకు గాను బీజేపీ ఇప్పటి వరకు గుణ, విదిశా స్థానాలు మినహా 228 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది.

లాడ్లీ పథకం మీదే సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ఆశలు

- మహిళల ఓట్లు తమకేనని బీజేపీ ధీమా
- తాము రూ.1,500 ఇస్తామంటున్న కాంగ్రెస్
- మధ్యప్రదేశ్‌లో పోటాపోటీ హామీల వర్షం

బార్వానీ. మధ్యప్రదేశ్ మారుమూలలోని చిన్న పట్టణం. 40ల్లో ఉన్న ఓ జంట. పేర్లు జామ్లీ సింగ్, రాయ్‌సింగ్. చేతిలో చివికిపోయిన సంచులతో బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. 400 కిలో మీటర్ల దూరంలో గుజరాత్‌లోని పత్తి క్షేత్రాల్లో పని చేయడానికి వందలాది మంది దిన కూలీలతో కలిసి వాళ్లు వలస వెళ్తున్నారు. అంత దూరం వెళ్లడం వారికిదే తొలిసారి. వర్షాభావంతో పంటలన్నీ ఎండిపోవంతో తప్పలేదు. కొద్ది నెలలుగా వారిని ఆదుకున్నది లాడ్లీ బెహనా పథకం కింద అందుతున్న నెలకు రూ.1,000 మాత్రమే. ఆర్నెల్ల క్రితం ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ తెరపైకి తెచ్చిన ఆ పథకం వల్ల తాము కనీసం నిత్యావసరాలు కొనుక్కోగలుగుతున్నామని జామ్లీ చెప్పుకొచ్చింది. 'మాకు పైసలిచ్చిన వాళ్లకే ఓటేస్తాం' అని దంపతులిద్దరూ నిర్మొహమాటంగా చెప్పేశారు. ఓటింగ్ నాటికి తిరిగొచ్చి ఓటేసే వెళ్తామంటున్నారు. ఇప్పటికే బీజేపీ అధిష్టానం అనుగ్రహం తగ్గి అల్లాడుతున్న సీఎం శివరాజ్ సింగ్ ఈ ఎన్నికల్లో ఆశలన్నీ ఈ పథకం మీదే పెట్టుకున్నారు. ఇదే తనను ఎన్నికల గండం గట్టెక్కిస్తుందని నమ్ముతున్నారు.

ఐదోసారి 'సీఎం' ఆశలు...

18 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న శివరాజ్.. ఈసారీ నెగ్గి ఐదోసారీ ఆ కుర్చీలో కొనసాగాలని ఆశపడుతున్నారు. కానీ ధరల పెరుగుదల, రైతులపై ఆర్థిక మందగమనం ప్రభావం, తీవ్ర నిరుద్యోగిత వీటన్నింటికీ మించి ప్రభుత్వ వ్యతిరేకత ఆయనను భయపెడుతున్నాయి. అందుకే ఈ శాసనసభ ఎన్నికల్లో శివరాజ్‌ను బీజేపీ అధిష్టానం పెద్దగా నమ్ముకోవడం లేదు. ఏకంగా ముగ్గురు కేంద్ర మంత్రులు, పలువురు సిట్టింగ్ ఎంపీలను అసెంబ్లీ బరిలో దింపింది. శివరాజ్‌ను సీఎం అభ్యర్థిగా ఎక్కడా పేర్కొనకుండా జాగ్రత్త పడుతోంది. తద్వారా ప్రభుత్వ వ్యతిరేకత తమ పుట్టి ముంచకుండా ఉంటుందని ఆశ పడుతోంది. అధిష్టానం మనోగతాన్ని ముందుగానే పసిగట్టిన శివరాజ్ ఎన్నికలకు ఏడెనిమిది నెలల ముందు నుంచే వరుస బెట్టి సంక్షేమ, జనాకర్షక పథకాలు ప్రకటిస్తూ వస్తున్నారు.





లాడ్లీ... సూపర్‌హిట్!

రాష్ట్రంలోని 5.6 కోట్ల ఓటర్లలో 2.7 కోట్ల మంది మహిళలు. గత ఎన్నికల్లో వీరిలో 74 శాతం మంది ఓటేశారు. వీరిని గుంపగుత్తగా ఆకట్టుకునేందుకు మహిళా పథకాలెన్నింటినో శివరాజ్ సర్కారు తెరపైకి తెచ్చింది. ప్రభుత్వోద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వ్ చేశారు. ప్రధాని ఉజ్వల యోజన కింద ఇచ్చే గ్యాస్ సిలిండర్ ధరను రూ.450లకు తగ్గించారు. రక్షాబంధన్ నాడు ప్రతి మహిళ ఖాతాకు రూ.250 బదిలీ చేశారు. కానీ లాడ్లీ బెహనా పథకంతో మహిళలను ఆకట్టుకోవడంలో శివరాజ్ బాగా సఫలమయ్యారని పరిశీలకులు చెబుతున్నారు.

- గత జూలై నాటికే ఈ పథకం కింద సగం మంది మహిళా ఓటర్లు అంటే 1.32 కోట్ల మంది ఖాతాలకు నెలకు రూ.1,000 అందడం మొదలైంది!
- ఈ పథకం తమ మహిళా ఓటు బ్యాంకుకు ఎంతోకొంత గండి కొట్టడం ఖాయమని కాంగ్రెస్ నేతలు అంగీకరిస్తున్నారు!

కాంగ్రెస్ నెగ్గినా...

మధ్యప్రదేశ్‌లో బీజేపీ 2018 దాకా వరుసగా నాలుగుసార్లు అధికారంలో కొనసాగింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 203 స్థానాలకు కాంగ్రెస్ 114, బీజేపీ 109 స్థానాల్లో విజయ బావుటా ఎగరేశాయి. కాంగ్రెస్ ఏర్పాటు చేసిన ప్రభుత్వాన్ని ఆ పార్టీ నుంచి 22 మంది ఎమ్మెల్యేలను ఆకర్షించడం ద్వారా 15 నెలలకే కూలదోసి బీజేపీ గద్దెనెక్కింది.

ఏమిటీ పథకం?

లాడ్లీ బెహనా పథకం కింద 2.5 లక్షలకంటే తక్కువ వార్షికాదాయం ఉన్న కుటుంబాల్లో 21–60 ఏళ్ల మధ్య వయసు మహిళలకు నెలకు రూ.1,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.1,250కి పెంచారు. మరో విషయం. కుటుంబంలో అర్హులైన మహిళలు ఎంత మంది ఉంటే అంత మందికీ పథకాన్ని వర్తింపజేయడం విశేషం.

- కాంగ్రెస్ కంచుకోట అయిన బార్వానీ వంటి గిరిజన ప్రాబల్య ప్రాంతాల్లో లాడ్లీ పథకం ప్రభావం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. ఇక్కడ మహిళల నోట 'ఎవరి ఉప్పు తింటే వారికే విశ్వాసులుగా ఉంటాం' అన్నమాటే వినిపిస్తోంది!
- దీన్ని గమనించిన బీజేపీ నేతలు ప్రచారంలో ప్రతి చోటా లాడ్లీ బెహనా పథకం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. అందుకు మహిళల నుంచి పెద్దపెట్టున వ్యక్తమవుతున్న హర్షధ్వానాలు ఓట్లుగా మారి తమను గట్టెక్కిస్తాయని నమ్ముతున్నారు.
- ప్రధాని ఆవాస్ యోజన పథకం కింద వచ్చే మొత్తం సొంతింటి నిర్మాణానికి సరిపోని పక్షంలో లాడ్లీ యోజన లబ్ధిదారులకు అందుకోసం మరింత సాయం చేస్తామని శివరాజ్ ప్రభుత్వం ప్రకటించింది.

కాంగ్రెస్ కూడా...

- లాడ్లీ బెహనా పథకం ప్రభావం మహిళలపై బాగా ఉందని గమనించిన కాంగ్రెస్ తమ హామీల్లో దీనిని చేర్చింది. పైగా తాము రూ.1,500 చొప్పున ఇస్తామని ప్రకటించింది!
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా ఈసారి రూ.2 లక్షలలోపు రైతు రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఈ దెబ్బతో ఈసారి రైతు కుటుంబాల ఓట్లన్నీ తమకే పడతాయని ఆశిస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

గెహ్లోత్‌కు సర్దార్‌పుర ..పైలట్‌కు టోంక్

రాజస్తాన్‌లో 33 మందితో కాంగ్రెస్ మొదటి జాబితా విడుదల



అశోక్ గెహ్లోత్



సచిన్ పైలట్

న్యూఢిల్లీ/జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలకు గాను కాంగ్రెస్ పార్టీ శనివారం 33 మంది అభ్యర్థుల పేర్లతో మొదటి జాబితాను విడుదల చేసింది. జాబితా ప్రకారం ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ సర్దార్‌పుర నియోజకవర్గం నుంచి బరిలో దిగనున్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ టోంక్ స్థానం నుంచి పోటీచేస్తారు. 2020 ఏడాదిలో గెహ్లోత్‌పై తిరుగుబాటు చేసిన సచిన్ పైలట్ వర్గీయులైన ఇంద్రజ్ సింగ్ గుర్జార్, ముకేశ్ భఖర్, రామ్‌నివాస్ గవారియాలకు కాంగ్రెస్ పార్టీ మొండి చేయి చూపింది. మొదటి జాబితాలో ఐదుగురు మంత్రులు, 28 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, 2018 ఎన్నికల్లో గెలిచిన ఒక స్వతంత్ర అభ్యర్థికి చోటు కల్పించింది. ఈసారి గత ఎన్నికల్లో ఓటమి పాలైన అర్చనా శర్మకు మాలవీయ నగర్, పుష్పేంద్ర భరద్వాజ్‌కు సంగనేర్ నుంచి బరిలో నిలుపుతోంది. గత ఎన్నికల్లో బీఎస్పీ తరఫున పోటీ చేసి ఓడిపోయిన లలిత్‌కుమార్ యాదవ్‌కు ముందావర్ నుంచి, గత ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసి పరాజయం పాలైన వివేక్ ధాఖర్‌కు మంగళ్‌గఢ్ నియోజకవర్గం నుంచి బరిలో నిలుపుతోంది. గత ఎన్నికల్లో కుశాల్‌గఢ్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించిన స్వతంత్ర అభ్యర్థి రమీలా ఖడియాకు ఈసారి అదే స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఇచ్చింది. అసెంబ్లీ స్పీకర్ సీపీ జోషీకి నాథ్‌ద్వారాను, పీసీసీ అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోసార్తాకు లక్ష్మణ్ గఢ్, మాజీ మంత్రి హరీశ్ చౌధరికి బేతూ, మంత్రి మమతా భూపేశ్‌కు సిక్రాయ్ సీటును కేటాయించింది. టికెట్లు లభించిన ఇతర మంత్రుల్లో కోలాయత్ నుంచి భన్వర్ సింగ్ భాటి, అల్వార్ రూరల్ నుంచి టికారామ్ జూలీ, బాగిడొర నుంచి మహేంద్రజీత్ సింగ్ మాలవీయ, హిండోలి నుంచి అశోక్ చంద్‌నా ఉన్నారు. మూడు ఎస్సీ, నాలుగు ఎస్టీ రిజర్వుడ్ సీట్లకు కలిపి తాజా జాబితాలో మొత్తం 9 మంది మహిళలకు చోటు దక్కింది. మిగతా సీట్లకు అభ్యర్థుల ఖరారుపై ఆదివారం జరిగే సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు. 200 సీట్లున్న రాజస్తాన్ అసెంబ్లీకి నవంబర్ 25న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

రాజస్తాన్‌లో 83 మందితో బీజేపీ రెండో జాబితా

- మాజీ సీఎం వసుంధరా రాజేకు ఝల్‌రాపటన్ సీటు
- ఇప్పటి వరకు 124 స్థానాలకు పార్టీ అభ్యర్థులు ఖరారు



వసుంధరా రాజే

న్యూఢిల్లీ/జైపూర్: రాజస్తాన్‌లో వచ్చే నెల 25న జరిగే అసెంబ్లీ ఎన్నికలకు గాను బీజేపీ శనివారం 83 మంది అభ్యర్థుల పేర్లతో మరో జాబితా శనివారం విడుదల చేసింది. ఇందులో మాజీ మహిళా ముఖ్యమంత్రి వసుంధరా రాజేకు గతంలో మాదిరి ఝల్‌రాపటన్ స్థానాన్ని కేటాయించింది. తాజా జాబితాలో 50 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు టికెట్లు సంపాదించారు. తొమ్మిది మంది సిట్టింగ్‌లకు ఈ జాబితాలో చోటు దక్కలేదు. బీజేపీ ఈ స్థానాలను ఎంపీలకు కేటాయించలేదు. రెండో జాబితాలోని 83 మందిలో 10 మంది మహిళలకు అవకాశమిచ్చారు. అసెంబ్లీలోని 200 స్థానాలకుగాను తాజా జాబితాతో కలిపి బీజేపీ ఇప్పటివరకు 124 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించినట్లయింది. మొత్తమ్మీద మాజీ సీఎం వసుంధరా రాజే మద్దతుదారులైన ఇద్దరు రాష్ట్ర మాజీ మంత్రులతో పాటు మరికొందరికి పార్టీ టికెట్లిచ్చింది. ఐదుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన నర్‌పత్ సింగ్ రాజ్వీని ఛితోర్‌గఢ్ బరిలోకి దించాలని తాజాగా కాషాయ పార్టీ నిర్ణయించింది. బీజేపీ ముఖ్యనేత భైరాన్ సింగ్ షెకావత్ అల్లుడే నర్‌పత్ సింగ్. ఇటీవలే బీజేపీ కండువా కప్పుకున్న మహారాజా ప్రతాప్ సింగ్ వారసుడు విశ్వరాజ్ సింగ్ మేవార్‌కు నాథ్‌ద్వారా స్థానాన్ని కేటాయించింది. గత ఎన్నికల్లో ఈ సీటును కాంగ్రెస్ సీనియర్ నేత సీపీ జోషి దక్కించుకున్నారు. రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు సతీశ్ పునియా సిట్టింగ్ స్థానం అంబర్ నుంచే పోటీ చేయనున్నారు. అసెంబ్లీలో బీజేపీ నేత రాజేంద్ర రాథోడ్ స్థానాన్ని చురు నుంచి తారానగర్‌కు మార్చింది. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాథోడ్ గతంలో 2008–13 సంవత్సరాల్లో తారానగర్ నుంచే ప్రాతినిధ్యం వహించారు. గత నెలలో పార్టీ బీజేపీ తీర్థం పుచ్చుకున్న నగౌర్ మాజీ ఎంపీ జ్యోతి మిర్ధా నగౌర్ స్థానం నుంచి బరిలోకి దిగనున్నారు. సూరజ్‌గఢ్ సీటును మాజీ ఎంపీ సంతోష్ అహ్లావత్‌కు కేటాయించింది. గత ఏడాది రాజ్యసభ ఎన్నికల సందర్భంగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలున్న ధోల్‌పూర్ ఎమ్మెల్యే శోభారాణి కుష్వాహకు నిరాశే మిగిలింది.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కాపు (డైరెక్ట్): 40, లేట్ మ్యారేజ్, 5'8", B.Com, బిజినెస్ చేస్తున్న వెల్ సెటిల్డ్ వరునికి మంచి సంప్రదాయ వధువు కావలెను. Ph: 7032918043 [H-793601]

హిందూ/మాల/SC/Any/45/5'6"/PG/ 1st మ్యారేజ్ హైదరాబాద్ బాగా స్థిరపడిన వరునికి 1st మ్యారేజ్ వధువు కావలెను. No Brokers. Ph: 8500813885 [H-793371]

CNB/విడోయర్/36/5'6"/ Business/ 40,000/-pm పిల్లలు గల వరునికి తగిన సాంప్రదాయ వధువు కావలెను (డైరెక్ట్). Ph: 7995032262 [H-793513]

బ్రాహ్మణ: 2వ పెళ్లి/గుడ్ లుకింగ్ & ఫ్యామిలీ/ 45/5'10"/ MBA, BE/ SWE/6L.PM/ కోట్ల ఆస్తి గల వరునికి 1st మ్యారేజ్ బ్రాహ్మణ వధువు కావలెను. Ph: 8367619529/ 9515349877 [H-793601]

SC మాల & క్రిస్టియన్/M.Tech(EEE)/ C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI/80,000/-PM/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్నం ప్రసక్తి లేదు. Ph: 9676995093 [HA-14007]

రెడ్డి/కుల ప్రసక్తి లేదు/36 సం॥/5'5"/ వ్యవసాయం/5 ఎకరాల భూమి/ సంవత్సరానికి 6 లక్షల ఆదాయం గల అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. Ph: 9441039962 [HA-14007]

రజక/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/C.Govt. బ్యాంక్ మేనేజర్/SBI/80,000/-PM/5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14007]

రజక: B.Tech/Software Design Engineer/ 22 Lacs PA/ 5'9" ఎత్తు/28 సం॥ల అందమైన వరుడుకి వధువు కావలెను. Ph: 7013449343 [H-12505]

కాపు: 49/5'8"/ B.Sc, 5L.PA, 2Cr. ప్రాపర్టీ, బాగా స్థిరపడిన బాదరబందీ లేని లేట్ మ్యారేజ్ వరునికి కాపు వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. (Reg. ఫీజులేదు). Ph: 9573943211, 9849555464. [H-12505]

రెడ్డి/32y/5'10" MBBS/8 Lak PM/200Cr ప్రాపర్టీ/Well Settled వరుడికి B.Tech/ M.Tech/MBBS వధువు కావలెను. No Brokers డైరెక్ట్. Ph: 8019468462/8897213126 [H-793419]

40 సం॥ వయసు కలిగి, అవివాహితుడైన PG చదివిన 5.7'' ఎత్తు, 25 లక్షల ఆదాయం, హైదరాబాద్‌లో సెల్ఫ్ ఎంప్లాయి వరునికి వధువు కావలెను. సం॥ 9985637279 [WB-30813]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: koreddy43@gmail.com, Facebook.com/koreddymarriagebureau

వధువు కావలెను

Reddy/B.Tech (Business) 1995/6'/150Cr *1994/5'10"/100Cr *1997 / 5'11" / 100Cr * 1997/6'/400Cr *1995/5'8"/250Cr. * Cont: K.C.Reddy /Ph: 9849321309/ 9347807015

Reddy/Business/ B.Tech/ 1991 /6'/ 80Cr *1988/5'8"/200Cr * 1994/5'11"/150Cr *1995/ 5'10"/80Cr *1994/5'11"/250Cr. * Cont: K.C. Reddy/Ph:9849321309/9347807015

Reddy/Business/B.Tech/MBA/1995/6'/100 Cr *1991/5'11"/200Cr *1990/6'/1000Cr *1989/ 5'11"/500Cr *2001/5'8"/1000Cr * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9347807015

Reddy/MBBS/MD/DM/MCH *1995/ 5'10"/ 400Cr*1994/5'10"/75Cr *1993/ 5'10"/50Cr *1989/5'9"/30Cr *1990/ 5'11"/100Cr. * Cont: K.C. Reddy / Ph: 9849321309/9347807015

Reddy/USA Doctor *1990/6'/50Cr *1991/5'10"/ *1989/5'9"/* 1992/5'11"/ *1998/5'8" *1995/5'8" *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/IIT/BITS/INDIA *1996/5'7"/50 L/ yr*1992/5'11"/40L/yr *1992/5'9"/85L/yr * 1992/5'7"/60L/yr *1995/5'10"/22L/yr. * Cont: K.C.Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech (IIT)/MS/USA *1995/5'7"/ 300K * 1991/5'10"/200Cr *1995/6'/200 K/20Cr *1992/5'11"/400K *1992/6'/330K. *Cont : K.C. Reddy -Mar-Bureau-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1/USA *1991/5'11"/ 200Cr *1994/5'10"/150Cr *1997/5'9"/60Cr * 1995/5'9"/50Cr *1991/5'7"/60Cr. * Cont : K.C.Reddy-Hyd- Ph:9849321309/ 9347807015

Reddy/(Divorcee) B.Tech/MBA *1981/ 5'8"/ 500Cr *1989/5'9"/300Cr *1994/ 5'9"/ 300Cr *MBBS/ MD/ 1994/ 5'9"/50Cr. * Cont: K.C. Reddy-Hyd Ph: 9849321309

Reddy/Catholic * B.Tech/1996/5'9"/ 1000 Cr *MS/H1/USA/1994/5'9"/100K *1986/ 5'7"/ 150K *Div/B.Tech/MBA/ 1987/ 5'11"/ 25L/yr. * Cont: K.C.Reddy- Hyd-Ph: 9849321309 [D-528]

వరుడు కావలెను

Reddy/B.Tech/1994/5'5"/15 Cr * 1994/ 5'6"/ 100Cr * 1995/5'8"/100Cr *MS/ 1994/ 5'3"/ 200Cr *1999/5'8"/15Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech/1996/5'7"/50Cr *1995/ 5'5"/120Cr *1995/5'5"/70Cr *1993/ 5'3"/ 500Cr *1997/5'4"/150Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/1996/5'4"/30Cr * 1998/ 5'5"/ 100Cr *1996/5'7"/40Cr *1995/ 5'7"/ 10Cr *1998/5'4"/30Cr. *Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/Only Daughter/V.Big Business/ Hyd/ 1996/ 5'4" / Most Beautiful/Needs India or USA * Cont: K.C. Reddy- Ph: 9347807015

Reddy/B.Tech/1993/5'6"/50Cr *1990/5'4"/ 50Cr *1992/5'4"/25Cr *1996/5'5"/100Cr/ 1993/5'7"/100Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/B.Tech /1992/ 5'31 / 2"/40Cr/ *BA/1988/5'3"/200Cr *B.Tech/1990/ 5'3"/ 50Cr *1987/5'5"/100Cr. * Cont: K.C. Reddy. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG *1995/ 5'5" / 100Cr *1994/5'6"/100Cr *1998/5'7"/50Cr *1997/ 5'6"300Cr *1996/5'5"/70Cr * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1/USA *1994/5'4"/10 Cr *1997/5'5"/10Cr *1997/5'8"/12Cr *1998/ 5'4"/30Cr *1996/5'5"/15Cr. *Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/ 9347807015

Reddy/(Divorcee) B.Tech/ 1988/ 5'6"/ 50Cr *1985/5'5"/400Cr *1993/5'4"/10Cr *1991/5'4"/10Cr * MD/1994/5'5"/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/(Divorcee)USA B.Tech/1995/5'5 "/8Cr *1993/5'7"/15Cr *1986/5'6"/30Cr * 1991/5'4"/10Cr * MD/1992/5'3"/9Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

ఆర్యవైశ్య /46yrs / 5'.5"/ బిజినెస్,జాబ్/ 30Cr స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను.(డైరెక్టు కాంటాక్ట్ నో బ్రోకర్స్). 9182161015, 7680872085. [T-2309]

కాపు, CNB, 31, 5'9", M.Tech, 200 Cr. ఆస్తి, సొంత వ్యాపారం గల అందమైన వరునకు Any PG డాక్టర్ / Any PG ఇంజినీర్ వధువుగా కావలెను. డైరెక్ట్. 96429 57888 [B-788038]

★

అమ్మాయి కావలెను 1వ అన్ని కులాలు కోమట్ల అబ్బాయి 35, M.Sc., M.Ed., ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం 20 వేలు, ఆస్తి 40 లక్షలు, నల్లగొండ. : 9121325068 [Y-772547]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి New York, BE, MS, 27, 100 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Motati, LLB, 30, 5' 7", Dy Manager, 25 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 10", SWE, 120 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, Degree, 28, 5' 8", 50 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Dallas, BE, MS, 26, 5' 7", SWE, 170 K, 40 Crores, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 4", SWE, 9.4 L P/A, 3 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 27, 5' 4", SWE, 180 K, 7 Crores, H1, USA Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 8", Data Engineer, 110 K, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com

అవినాష్ రెడ్డి మ్యారేజెస్

(రెడ్డిలకు మాత్రమే)

D.V. Koti Reddy

690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad

98480 11818, 93933 11818

రెడ్డి California, BE, MS, 29, 5' 11", Engineer, 200 Crores, H1. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 30, 6' 1", 30 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Atlanta, BE, MS, 24, 5' 8", Robotic Engineer, 40 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce ISB, 49, 5'6", Sr Consultant, 1.6 L P.M, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BS, 24, 5' 5", Analyst, 75K, H1, USA, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 29, 5' 4", SWE, 72 K, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 26, 5' 2", PG Doctor, 15 Crores, Hyderabad Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce BE, 32, 5' 4", SWE, 11 L P/A, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. [LETTER]

★★

నో క్యాస్ట్, 35 టు 40 సం.లోపు, ఎత్తు 5'3"లోపు, 10th Pass, విడో / డైవర్సీ, పేద అమ్మాయి కావలెను. సంప్రదించండి నేను డైరెక్ట్ – 6301554541. [B-1210197]

రెడ్డి Male, 33 సం॥ Fair 5'-10", M.Tech, M.S (USA) 2.5 Cr ప్రోపర్టీ Rs. 3L / PM గల వరుడుకి డిగ్రీ చదివిన వధువు కావలెను. Cont: 94932 42896 [G-786001]

43y, 5'-4", SC హిందూమాల గవర్నమెంట్ జాబ్ 49 వేలు జీతం కలిగిన 2వ సంబంధం వరునికి విడో లేక 2వ సంబంధం వధువు కావలెను. డైరెక్టు సంప్ర: 8008344069 [G-779759]

డైరెక్ట్ 39y చాలా అందమైన స్థిరపడిన ఒంటరి వరుడికి బాగా స్థిరపడిన జాబ్ లేదా బిజినెస్ చేయు వధువు మాత్రమే కావాలి. కులము, వయస్సు పట్టింపు లేదు. డైవర్స్, విడో, పిల్లలు ఉన్నా ok. Whatsapp: 7653932778 [S-1195601]

క్రిస్టియన్ మాల 6 ft. ప్రైవేట్ జాబ్ వరుడుకి వధువు కావలెను. కులం, కట్నం పట్టింపు లేదు. విడోయర్స్, డైవర్సీ వారు కూడా నో బ్రోకర్స్. ఓన్లీ జెన్యూన్ కాల్ 9550913919 [Y-784385]

వరుడు కావలెను



కుల, ఆస్తి పట్టింపు లేదు: జాబ్, బిజినెస్ 2L P.M 5 కోట్ల ప్రాపర్టీ అందమైన వధువుకి 1వ, 2వ, వరుడు కావలెను. ముఖాముఖి కల్పించి ఉచితంగా కుదుర్చబడును. ఇల్లరికం OK. సంప్ర: 9704477206 [H-793601]

2వ పెళ్లి: కుల పట్టింపు లేదు 36yrs/ B.Sc, B.Ed/ Govt టీచర్ 1 లక్ష (pm) సొంత ఇల్లు+కారు పిల్లలు లేని తెల్లని అందమైన వెల్ సెటిల్డ్ 50 కోట్ల ఆస్తి కలిగిన వధువుకి వరుడు కావలెను. సంప్ర: 8341454870 [H-793601]

36Yrs 2nd పెళ్ళి Govt ఎంప్లాయ్ 2,50,000/-(pm) వెల్ సెటిల్డ్, కులప్రసక్తి లేని అందమైన వధువుకు వరుడు కావలెను (పిల్లలు ఉన్న OK) సంప్ర: 7386550413 [H-793601]

రెడ్డి/డైవర్సీ/29/5'4"/ B.Tech/ SWE/ 1.5L pm/ Own Plots & Business కోట్ల ప్రాపర్టీ గల పిల్లలులేని వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9848226983 [H-793513]

కాపు/30y/ Fair/ M.Com/ గ్రూప్-2 ఆఫీసర్/90K p/m 4 ఎ॥ ఫాంల్యాండ్ గల వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309344166 [H-793513]

రెడ్డి/25y/5'4"/ M.Tech/ SWE/ Hyd/ 18L P/A / Own House గల అందమైన ఏకైక వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9553652167 [H-793513]

FC/విడో/60/రిటైర్డ్ పెన్షనర్/సొంత ఇల్లు & రెంట్స్ /వ్యవసాయ భూములు గల మంచి ఆర్థిక స్తోమత గల వెల్ సెటిల్డ్ వధువుకు స్నేహ స్వభావం గల వరుడు కావలెను . కుల ప్రసక్తి లేదు. Ph: 7416286926 [H-793371]

నాయుడు/60y/విడో/5'4"/Govt. Rtd/80 K/PM/2 సొంత ఇల్లు & రెంట్స్/50,000/-PM/ఆస్తి కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను. పిల్లలు లేరు. Ph: 7780355650 [H-793371]

బ్రాహ్మణ/33y/5'2" ఇంటర్/29y/5'4"/ డిగ్రీ/అందమైన వధువులకు వరులు కావలెను/రిటైర్/Pvt, Govt జాబ్ & పురోహితం అయినా OK. Ph: 9110723130 [H-793371]

కమ్మ/విడో/58y/5'5"/V.Fair/Govt Job/సొంత ఇల్లు & రెంట్స్/బిజినెస్/ఆంధ్రాలో పొలాలు/2 L/PM గల ఏ బాదరబందీలేని వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 9492718486 [H-793371]

SC మాల/ B.Tech / C.Govt. Jr. ఇంజినీర్/రైల్వే/70,000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14007]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc *27/5'4"/MBA *30/5'3"/ B.Sc *27/5'2"/ఇంటర్ *32/5'2"/ ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/పురోహితులకు మ్యాచెస్ త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-14007]

రెడ్డి విడో: కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ A:30, Height:5.4/Own బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికమైన ఓకె) Ph: 9515673252 [H-12505]

రెడ్డి డాక్టర్: 28. *B.Tech, 26. *PG, 29, జాబ్ *డిగ్రీ 29, డివోర్స్ *USA, డివోర్స్, 32 *డాక్టర్ డివోర్స్ 36. *బిడోస్, 40, 45, 51(హై ప్రొఫైల్) *రెడ్డి వధువుల కోసం కాంటాక్ట్ Ph: 6304826162 [H-12505]

వైశ్య/38y/5'5"/Own బేకరీ/1 లక్ష నెలకు/50Cr ప్రాపర్టీ పిల్లలు లేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 8019484384, 7396608019 [H-793419]

కమ్మ/50y/5'4"/సొంత బట్టల షాపు/2 లక్షలు నెలకు, 10Cr ప్రాపర్టీ Widow వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు మ్యారేజ్ బ్యూరో. Ph: 7396608019, 8019484384 [H-793419]

రెడ్డి/26y/5'6"/M.Tech/Fair/200Cr Well Settled వధువుకి వరుడు కావలెను India/ Abroad Any Match డైరెక్ట్ No Brokers. Ph: 8019468462, 8897213126 [H-793419]

కమ్మ/26/ 5''3/10th/29/ఇంటర్/ వధువులకు, కమ్మ వరులు కావలెను. బిజినెస్/ ప్రైవేట్‌జాబ్/ OK. సంప్రదించండి: 89855 80896 [L-798861]

★

29 Years, Divorced, Kapu Reddy Beautiful CA, 15-LPa, Hyderabad based Upper Middle Class family looking for a suitable match. Please contact (080-69070640) [HA-6326]

36 Years Brahmin never married, LLB, Hyderabad based, middle class family, looking for a suitable match (caste no bar and also open for divorce). Please contact (080-69103122) [HA-6327]

30 Years beautiful Padmashali, Graduated, working in MNC, Hyderabad based family looking for a suitable match. Please contact (080-69070619) [HA-6328]

31 Years, Divorced, Graduate, Beautiful Girl, Kamma, 5'9", Business Women, Hyderabad based Upper Middle Class Family looking for a suitable match Please contact (080-69070618) [HA-6325]

★★

ఆదర్శవంతమైన ఆధ్యాత్మికమైన కాపు వరుడు కావలెను. అందమైన విద్యావంతురాలైన ఐశ్వర్యవంతురాలైన 26 సం॥ విశాఖపట్నం మూగ వధువుకి. Cell: 7032375388, 8341014640 [S-771189]

కాపు లేట్‌మ్యారేజ్ 5'-2" Age: 50 సం॥ 1వ, 2వ మ్యారేజ్ OC ఏదైన జాబ్, బిజినెస్, అగ్రికల్చరల్ స్థిరాస్తి కలిగిన వరుడు కావలెను. డైరెక్టు 7207614063 [G-801017]

వేదికలు



కావ్య మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్స్, అన్ని కులాలవారికి త్వరగా కుదుర్చబడును స్త్రీలకు ఫ్రీ. Ph: 7702526428 [H-793513]

విజయ దశమి శుభాకాంక్షలు. శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM.Est: 1995, గౌడ, శెట్టి, రెడ్డిలకు, 1st/2nd పెళ్లి/పెళ్లి సంబంధాలకై సం॥ S.నారాయణ గౌడ్ లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S. శారదాగౌడ్ 8790690309 [H-793374]

హై/రిచ్/ఎలైట్ సాఫ్ట్‌వేర్, డాక్టర్, టాప్ బిజినెస్, NRI, ఉన్నత ప్రొఫెషనల్ మ్యాచెస్. అన్ని కులాల మొదటి, సెకండ్, అలస్య పెళ్లి సంబంధాలు చూడబడును. రిజిస్ట్రేషన్ కోసం వాట్సప్. Ph: 9347668696 చేయండి. [H-12505]

మైత్రి రెడ్డి మ్యారేజ్ బ్యూరో 5Cr to 500Cr Only High Profiles Local/ Abroad/ Political Doctors Matches చూడబడును. G.S.Reddy. Ph: 8897213126, 8019468462 [H-793419]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Nikhil Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14008]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14008]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Nikhil Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14008]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14008]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14008]

ధ్రువ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-189422]

మాల, మాదిగ స్పెషల్ : IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK, Ph : 73969 15712 (A). [M-10275]

18 సం.ల అనుభవం. జాతక లగ్నంలో వివాహ సమస్య-పరిష్కారములతో సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, NRI,Govt., రిచ్ వార్కి పెళ్లి సంబంధాలు ఫాస్ట్ సెటిల్మెంట్. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, ఒక నమ్మకం. నమో వెంకటేశాయ. 7093722724. [T-1953]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp). [HA-546]

కుల పట్టింపులు లేని 1,2 & Late వరునికి / వధువునకు & ఇంకా పెళ్లికాని (రెడ్డి కులం) వరులకు & పేదింటి వధువులకు పెళ్లి సంబంధాలు చూడడం మా ప్రత్యేకత. Ph: 8019965137 / 8121065137 [H-788389]

★★

హిందూ, క్రైస్తవ, మాలల వివాహ పరిచయ వేదిక కళ్యాణ మాల 14-10-2023 శనివారం ఉ. 10 గం. నుండి 2 గం. వరకు సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి, రామారావుపేట, కాకినాడ. ✆ 9440545049 [B-788195]

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాల్సిందే

- పర్యావరణానికి ప్రమాదంగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్
- స్వచ్ఛంద నిషేధం పాటించి ఆదర్శంగా నిలవాలి
- సీఎస్ శాంతికుమారి



సాక్షి, హైదరాబాద్: పర్యావరణానికి ప్రమాదంగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా నిషేధించాలని సీఎస్ శాంతి కుమారి పిలుపునిచ్చారు. సచివాలయంలో వీటి వాడకాన్ని నిషేధించి, ప్రత్యామ్నాయాలను వాడడం ద్వారా కార్యదర్శులు మొదలు ప్రతీ అధికారి, ఉద్యోగులు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 17 లక్షల మంది స్వయం సహాయక బృందాల మహిళలతో వీటి నిషేధంపై పౌరులను చైతన్య పరుస్తున్నామని తెలిపారు. శనివారం సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై జరిగిన వర్క్ షాప్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ రాజీవ్ శర్మ తోపాటు వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా.. సామాజిక బాధ్యతతోనే సాధ్యం

శాంతి కుమారి మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో స్టీల్, పింగాణీ వస్తువుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధంపై ఇప్పటికే ప్రభుత్వం పలు ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. అయితే కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల వల్ల ఇది సాధ్యం కాదని, స్వచ్ఛందంగా సామాజిక బాధ్యతతో పాటించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం వినియోగిస్తున్న ప్లాస్టిక్ లో కేవలం 9 శాతం మాత్రమే రీ-సైక్లింగ్ జరుగుతోందని, మిగిలిన ప్లాస్టిక్ వ్యర్థాలు నాలాలు, చెరువులు, నదీ జలాల్లో కలుస్తూ జీవనానికి పెను ముప్పుగా పరిణమిస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. 'ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి భూమిని కాపాడుకొందాం'అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను ఈ సందర్భంగా శాంతి కుమారి, రాజీవ్ శర్మ ఆవిష్కరించారు.

వారికి వెంటనే జీతాలు చెల్లించండి

- నవీన్ మిత్తల్‌కు ట్రెసా విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ)ల నుంచి జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లుగా పేస్కేల్ పొంది రెవెన్యూ శాఖలో నియమితులైన సిబ్బందికి వెంటనే గుర్తింపు కార్డులిచ్చి వేతనాలు చెల్లించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) కోరింది. ఈ మేరకు ట్రెసా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. తమ వినతి పట్ల మిత్తల్ సానుకూలంగా స్పందించారని, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారని ట్రెసా వెల్లడించింది. మిత్తల్‌ను కలిసిన వారిలో ట్రెసా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, పాక రమేశ్, పలు జిల్లాల అధ్యక్షులు రమణ్‌రెడ్డి, సుధాకర్ తదితరులు ఉన్నారు.

- కోట్లు ఖర్చు చేసి ఫుట్‌పాత్‌లు నిర్మించినా పాదచారులకు ఉప యోగపడటం లేదని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) పేర్కొంది. ఈ మేరకు శని వారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌కు ఎఫ్‌జీజీ ప్రధాన కార్యదర్శి సోమ శ్రీని వాస్‌రెడ్డి లేఖ రాశారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారులు పండ్లు, కూరగాయలు, ఇతర వ స్తువులు విక్రయిస్తున్నారని వివరించారు. మరోవైపు కొన్నిచోట్ల వాహనాలను పార్క్ చేస్తున్నారని, అక్కడక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఉన్నాయని వెల్లడించారు. పాద చారులు ఫుట్‌పాత్‌లపై కాకుండా రోడ్లపై నడవాల్సి వస్తోందని పేర్కొన్నారు.

RYTHU SADHIKARA SAMSTHA (RYSS)

Department of Agriculture, Gorantla, Guntur

e-Tender Notice

RySS invites e-tenders for Procurement of the necessary equipment (Electrical, IT infrastructure, Laboratory and Farm Related Equipment) to the Indo-German Global Academy for Agroecological Research and Learning (IGGAARL), Pulivendula, YSR District, Andhra Pradesh Funded by KfW Development Bank, Germany Please visit the following web site for complete details https://apcnf.in/tenders/ and https://tender.apeprocurement.gov.in/ (Tender IDs : 656192, 658362, 663298, 659952, 664975, 666880, 666943, 668294 and 668299) Last Date for submission is 30-10-2023. For further details write us to e-Mail ID: eprocurementryss@gmail.com

Sd/-Chief Executive Officer

డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ

ప్రొఫెసర్ జి. రాంరెడ్డి మార్గ్, రోడ్ నం.46, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500033

ఇరవైఐదవ స్నాతకోత్సవం ప్రకటన

సఫలీకృత అభ్యర్థులకు డిగ్రీలు/ డిప్లొమాలు/ సర్టిఫికెట్లను ప్రదానం చేయడానికి డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్ యొక్క ఇరవైఐదవ స్నాతకోత్సవం 2023 డిసెంబర్ 2వ వారంలో జరుగుతుంది. UG కోర్సులు, PG /డిప్లొమా/ సర్టిఫికెట్ కోర్సులు మరియు M.Phil మరియు Ph.D ప్రోగ్రామ్స్ కొరకు సెప్టెంబర్, 2021 నుండి ఫిబ్రవరి, 2023 వరకు డిగ్రీల ప్రదానం కోసం అర్హులుగా ప్రకటించబడిన అభ్యర్థులందరూ ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం ద్వారా దరఖాస్తు చేయవలెను.

స్నాతకోత్సవానికి స్వయంగా హాజరయ్యేందుకు అభీష్టంగల అభ్యర్థులు www.braou.ac.in లేదా www.braouonline.in వెబ్‌సైట్ల నుండి రూ.500/- ఫీజు చెల్లింపుతో 30 నవంబర్, 2023న లేదా అలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

స్నాతకోత్సవానికి స్వయంగా హాజరుకాలేని అభ్యర్థులు అవసరమైన ఫీజు రూ.600/- చెల్లించడం ద్వారా ABSENTIA లో కూడా వారి డిగ్రీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. స్నాతకోత్సవం తరువాత ఈ విద్యార్థుల సర్టిఫికెట్లు వారి సంబంధిత చిరునామాలకు స్పీడ్‌పోస్ట్ ద్వారా పంపబడును.

చివరి తేదీ తరువాత అందిన దరఖాస్తులు మరియు అసంపూర్తి దరఖాస్తులు తిరస్కరించబడును.

DIPR RO No.8160-PP/CL/Advt/1/2023-24, Dt 20.10.2023 సం/- రిజిస్ట్రార్

HEAVY WATER PLANT (MANUGURU)

ई-निविदा आमंत्रित करने की सूचना Notice Inviting e-Tenders

महाप्रबंधक, भारी पानी संयंत्र, मणुगूरु भारत के राष्ट्रपति के लिए और उनकी ओर से, निम्नलिखित कार्यों के लिए दो बोली प्रणालियों में आंनलाइन आइटम दर बोलियां आमंत्रित करता हैं ।

The General Manager, HWP (M), for and on behalf of President of India, Invites online item rate bids, in two bid system for the following work (s).

ई एनआईटी नंबर : एच डब्लू पी एम/सिविल/सिपिपि/एनआईटी/2023/44.
e-NIT No. : HWPM/CIVIL/CPP/NIT/2023/44

काम का नाम Name of Work : भारी पानी संयंत्र, मणुगूरु में सीपीपी में मौजूदा सीसी फुटपाथ को चौड़ा करना और डीएफएसीएस तक पहुंच मार्ग की मरम्मत करना
Widening of existing CC Payment and repairing of Approach Road to DFACS in CPP at HWP(M).

आनुमानित लागत Estimated Cost : Rs. 38,51,000/-

पूराहोने की अवधि Period of Completion : 03 माहीने 03 Months.

बोली जमा करने की अंतिम समय और तिथि Last Time and Date of Submission of Bid : Up to 18-00 hrs. on 06-11-2023

तकनीकी बोली ऑनलाइन के (ए भाग) खोलने की तिथी और समय Date and Time of online opening of Technical Bid Part-A : 10-11-2023 (14-30 hrs.)

बोली प्रपत्र और अन्य विवरण वेबसाइट https://eprocure.gov.in/eprocure/app से प्राप्त किए जा सकते हैं ।
नोटिस www.hwb.gov.in परभी उपलब्ध हैं ।

The bid forms and other details can be obtained from the website : https://eprocure.gov.in/eprocure/app.
The notice is also available on www.hwb.gov.in

Sd/-
(निविदा आमंत्रित प्रधिकारी के हस्ताक्षर)
(Signature of tender inviting authority)

सं.No. भापसं (म) HWP(M)/ प्रशा (आ) Admn(G)/एनआईटी NIT/18/2023/2701 Dt. 21-10-2023.

తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ, ఏటూరునాగారం

Email: dmgccetn@gmail.com/Mbl No. 7207982368

ఎలక్ట్రానిక్ షార్ట్ టెండర్ ప్రకటన

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు మరియు ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నవంబర్ 2023 నుండి జనవరి 2024 వరకు అవసరమగు 97 రకాల ఆహార పదార్థాలైన పప్పు దినుసులు, నూనె, పిండి, చిల్లీలు, జీలకర్ర, బ్రూక్, సుగంధ ద్రవ్యములు, 14 రకాల అలంకరణ వస్తువులైన టూత్ పేస్ట్, కొబ్బరి నూనె, ఫేస్ పౌడర్, డుస్సెలు మరియు 8 రకాల శానిటేషన్ వస్తువుల కొనుగోలు కొరకు పేరెన్నికగల వ్యాపారస్తులు, డిస్ట్రిబ్యూటర్ల నుండి ఇ-టెండర్లు కోరబడుచున్నవి. వివరముల కొరకు http://tender.telangana.gov.in వెబ్‌సైట్ నందు వీక్షించగలరు. టెండర్ వేయుటకు చివరి తేదీ 26.10.2023, సా. 5.00 గం.ల వరకు. EMD రూ. 2 లక్షలు. అధిక వివరాల కొరకు శ్రీ జి. ప్రకాష్ రెడ్డి, డివిజనల్ మేనేజర్ గారిని ఫోన్ నం. 7207982368 నందు సంప్రదించగలరు. Tender ID: 481893

సం/- Sri Ankit, IAS చైర్మన్, పర్చేస్ కమిటీ/(ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ, ఏటూరునాగారం

DIPR RO No.8170-PP/CL/Advt/1/2023-24, Dt.21.10.2023

ARMY WELFARE HOUSING ORGANISATION (AWHO)

KASHMIR HOUSE, RAJAJI MARG, NEW DELHI-110011

Visit us at www.awhosena.in

A Demand Survey for **JAI JAWAN AWAS YOJNA** at **SECUNDERABAD** is opened wef **01 October 2023 to 31 January 2024.** For more details please visit **AWHO** website www.awhosena.in.

AWHO Management

भारत सरकार Government of India
परमाणु ऊर्जा विभाग Department of Atomic Energy
भारी पानी संयंत्र (मणुगूरु) Heavy Water Plant (Manuguru)
निविदा सूचना Tender Notice

भारत के राष्ट्रपती के लिए और उनकी ओर से, मुख्य कार्यकारी, भापाबो निम्नलिखित कार्य के लिए दो बोली प्रणाली पर ऑनलाइन आइटम दर / प्रतिशत दर / एकमुश्त बोलियां आमंत्रित करते हैं।

For and on behalf of President of India, Chief Executive, HWB invites online item Rate/Percentage Rate/Lumpsum bids on two bid system for following work :

बोली संख्या : GEM/2023/B/4114809 दिनांक : 20-10-2023

कार्य का नाम : 'भापासं (मणुगूरु) कॉलोनी, अश्वापुरम और भापासासु, हैदराबाद में सुरक्षा सेवाएँ प्रदान करना ।

अनुमानित लागत : रु. 4,38,67,644/- ईएमडी : रु. 8,77,351/- अवधि : 24 महीने

ऑनलाइन बोली जमा करने की अंतिम तिथि और समय : 03-11-2023 (11.00 बजे)

बोली प्रपत्र और अन्य विवरण वेबसाइट : www.GeM.gov.in से प्राप्त किए जा सकते हैं।

Bid No. : GEM/2023/B/4114809 Dated : 20-10-2023

Name of the Work : 'Engagement of Security Services for HWP (manuguru) Residential Colony, Aswapuram & HWGF, Hyderabad.'

Estimated Cost : रु. 4,38,67,644/- EMD : रु. 8,77,351/- Period : 24 Months

Last date and Time for online submission of bid : 03-11-2023 (11.00 hrs.)

The bid forms and other details can be obtained from the website www.GeM.gov.in

हस्ता Sd/-
मुख्य कार्यकारी, भापाबो
Chief Executive, HWB

सं.No. भापासं (म) HWP(M)/ प्रशा (आ) Admn(G)/एनआईटी NIT/19/2023/2705 Dt. 21-10-2023.

HEAVY WATER PLANT (MANUGURU)

ई-निविदाएं आमंत्रित करने हेतु सूचना Notice Inviting e-Tenders

महाप्रबंधक, भारी जल संयंत्र, मणुगूरु भारत के राष्ट्रपति की ओर से, निम्नलिखित कार्यों के लिए दो बोली प्रणाली पर में ऑनलाइन आइटम दर बोलियां आमंत्रित करते हैं ।

The General Manager, Heavy Water Plant, Manuguru invites on behalf of President of India, online item rate bids on two bid system for following work (s).

इ-एनआईटी नंबर : एचडब्लयूपीएम/ईयू/कर्नल/ओएंडएम/2023/एनआईटी दिनांकित : 14-10-2023
e-NIT No. : HWPM/EU/Col/O&M/2023/NIT Dated : 14-10-2023

कार्य का नाम "एचडब्लयूपी (एम) कॉलोनी में आरटीसी (ए, बी और सी) शिफ्टों में 11 केवी / 415वी विद्युत सबस्टेशनों के संचालन और रखरखाव के लिए द्विवार्षिक अनुबंध।"
Name of Work : "Biennial Contract for Operation & Maintenance of 11 KV / 415V Electrical Substations in RTC (A,B & C) Shifts in HWP(M) Colony."

आनुमानित लागत : ₹. 23,53,000/- जीएसटी सहित Estimated Cost : ₹. 23,53,000/- including GST

बयाना राशि : ₹. 47,060/- Earnest Money : ₹. 47,060/-

पूरा होने की अवधि : कार्य शुरू होने की तारीख / कार्य आदेश जारी होने की तारीख 24 महीने।
Period of Completion : 24 months from the date of start of work / date of issue of work order

निविदा दस्तावेजों की उपलब्धता की तिथियां : 20-10-2023 को 10-00 बजे से 31-10-2023 को 18-45 बजे तक।
Dates of availability of tender documents : From 10-00 Hrs. of 20-10-2023 to 18-45 Hrs. of 31-10-2023

बोली जमा करने की अंतिम समय और तारीख (ऑनलाइन) : 31-10-2023 को 18-45 बजे तक।
Last Time and Date of Submission of Bid (Online) : Up to 18-45 hrs. of 31-10-2023

बोली प्रपत्र और अन्य विवरण वेबसाइट https://eprocure.gov.in/eprocure/app से प्राप्त किए जा सकते हैं।
e-NIT www.hwb.gov.in पर भी उपलब्ध है ।

The bid forms and other details can be obtained from the website : https://eprocure.gov.in/eprocure/app.
The e-NIT is also available on www.hwb.gov.in

Sd/-
(निविदा आमंत्रित प्रधिकारी के हस्ताक्षर)
(Signature of tender inviting authority)

सं.No. भापसं (म) HWP(M)/ प्रशा (आ) Admn(G)/एनआईटी NIT/18/2023/2703 Dt. 21-10-2022.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.